ఆదివారం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com
WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్
fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
28-5-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 116 పేజీలు: 10+4 వెల: 6.50

క్లాసులు ఎగ్గొడితే విద్యార్థి వీసాలు రద్దు: ట్రంప్ 3
బీహార్ సరిహద్దుల్లో నేపాల్ డ్రోన్లు 5

# 'నకిలీ' విక్రేతలపై కొరడా



మంగళవారం హైదరాబాద్‌లో కలెక్టర్లు, మంత్రులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### రైతులను మోసగించే వ్యాపారులపై పిడిచట్టం
### వానలొచ్చినా పూర్తిధాన్యం కొంటాం
### వ్యవసాయ అధికారులు నిరంతరం అప్రమత్తం
### ఎరువులు, విత్తనాల స్టాక్‌ను కలెక్టర్లు ఏరోజుకారోజు సమీక్షించాలి
### మంత్రులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే27:** రాష్ట్రంలో ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేని విధంగా రుతుపవనాలు 15 రోజులు ముందుగా వచ్చాయని, దానికి అనుగుణంగా సన్నద్ధమై ముందస్తు ప్రణాళికతో పని చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.వానలు ముందుగా రావడం వల్ల కొన్ని చోట్ల ధాన్యం సేకరణకు ఇబ్బందులు తలెత్తాయని, రైతులు ఆందోళన చెందారని సిఎం అన్నారు. మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం భరోసా ఇచ్చారు. మంగళవారం సాయంత్రం కమాండ్ కంట్రోల్ సెంటర్‌నుంచి ముఖ్యమంత్రి రేవంత్ మంత్రులు, అధికారులతో >>2

## జూన్ 2న ఘనంగా ఆవిర్భావదినోత్సవం
### భూభారతి త్వరలోనే రాష్ట్రమంతా అమలు: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే27:** గతంలో ధరణి రాష్ట్రంలో రైతుల పాలిట భూతంగా మారిందని, కొత్తగా ప్రజా ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టం రైతులకు చుట్టంగా ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన మండలాల్లో విజయవంతంగా అమలవుతున్న భూభారతిని త్వరలోనే రాష్ట్రమంతటా అమలు చేస్తామని చెప్పారు. భూభారతి చట్టాన్ని ప్రజలకు చేరువ చేయాలని, రైతుల సమస్యలకు పరిష్కారాలను సూచించేందుకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జూన్3 నుంచి 20వరకు రాష్ట్రమంతటా మూడో దశ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. అన్ని జిల్లాల ఇన్చార్జీ మంత్రులు రెవిన్యూ సదస్సుల నిర్వహణ షెడ్యూలు, ప్రణాళికను రూపొందించు >>2



గాంధీనగర్‌లో ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

# కాలు దువ్వితే బుద్ధి చెబుతాం
## పాక్‌ను హెచ్చరించిన ప్రధాని మోడీ
### దాయాది కదలికలు అనుమానాస్పదంగానే ఉన్నాయి
### పదేళ్లలో 11 నుంచి 4వ స్థానానికి వచ్చాం: ప్రధాని

**గాంధీనగర్(గుజరాత్),మే 27:** ఉగ్రవాదం పరోక్ష యుద్ధంకాదు అని, ఇది యుద్ధ వ్యూహంగా మారిందని, పాకిస్థాన్ మనపై యుద్ధానికి దిగుతోందని ప్రధాని మోడీ ఆరోపించారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ మే 6వ తేదీ తర్వాత జరిగిన ఆపరేషన్‌లో మృతిచెందిన వారికి పాకిస్థాన్ ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేపట్టిందని, దీన్ని ప్రాక్సీ వార్‌గా గుర్తించలేమని అన్నారు. ఉగ్రవాదుల మృతదేహాలపై పాకిస్థాన్ జాతీయ జెండాలను పరిచిందని, వాళ్లకు >>2

భారత్‌కు పాక్, చైనా నుంచే అధిక ముప్పు
అమెరికా నివేదికలో హెచ్చరికలు 3

## తెలంగాణకు ముగ్గురు, ఎపికి ఒకరు
# హైకోర్టు జడ్జిల బదిలీ



### 11 హైకోర్టులలోని మొత్తం 21 మంది జడ్జిలకు స్థానచలనం
### 'సుప్రీం' కొలీజియం సిఫారసు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 27:** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తుల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. 11 హైకోర్టులకు చెందిన 21 మంది జడ్జిల బదిలీకి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం మంగళవారం ప్రతిపాదించింది. మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ ఏపీ హైకోర్టుకు బదిలీ చేసేందుకు కొలీజియం ప్రతిపాదించింది. కర్నాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సి.సుమలత, జస్టిస్ లలిత కన్నెగంటి తెలంగాణ హైకోర్టుకు బదిలీ ప్రతిపాదించింది. పట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అన్నిరెడ్డి అభిషేక్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని, తెలంగాణ హైకోర్టు జడ్జి సుజయ్ పాల్ కల్‌కత్తా హైకోర్టుకు బదిలీ కొలీజియం సిఫారసు చేసింది. కర్నాటక హైకోర్టుకు చెందిన జస్టిస్ వి. కామేశ్వరరావు ఢిల్లీ హైకోర్టుకు, గౌహతి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జమీర్ కలకత్తా హైకోర్టుకు, గౌహతి హైకోర్టుకు చెందిన జస్టిస్ మనాష్ రంజన్ పాఠక్ ఒడిశా >>2



# విచారణకు వస్తా
## జూన్ 5న ఘోష్ కమిషన్ ఎదుటకు స్వయంగా హాజరవుతానన్న మాజీ సిఎం కెసిఆర్
### న్యాయనిపుణులతో విస్తృతంగా చర్చలు
### 'కాళేశ్వరం' అవకతవకలపై విచారణ జరుపుతున్న పిసి ఘోష్ కమిషన్
### 6న ఈటల, 9న హరీష్‌రావు విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే27:** కాళేశ్వరం ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ జారీ చేసిన నోటీసుల మేరకు జూన్ ఐదో తేదీన బిఆర్ఎస్ అధినేత,మాజీ సిఎం కేసీఆర్, ఆరో తేదీన బిజెపి ఎంపీ ఈటల రాజేందర్, తొమ్మిదో తేదీన బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు కమిషన్ ముందు హాజరు కావాల్సి ఉంది. కమిషన్ నోటీసుల నేపథ్యంలో ఏం చేయాలన్న విషయమై బీఆర్ఎస్ అధినేత కసరత్తు చేసినట్లు సమాచారం. ఘోష్ కమిషన్ విచారణకు హాజరు కావాలని నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ సీనియర్ నేతలకు ఆయన సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.విద్యుత్ ఒప్పందాలకు సంబంధించిన విచారణకు కమిషన్ నోటీసులు ఇచ్చినపుడు హాజరు కాకుండా సుధీర్ఘ లేఖ రాశారు.కమిషన్ వ్యవహారశైలిపై ఏకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిం చారు.సర్వోన్నత న్యాయస్థాన ఆదేశాల మేరకు ప్రభుత్వం కమిషన్ ఛైర్మన్‌ను మార్చాల్సి వచ్చింది. ఇపుడు కాళేశ్వరం కమిషన్ విషయంలో కేసీఆర్ అలా చేయకుండా హాజరవుతారని ప్రచారం జరుగుతోంది. నోటీసులు అందిన తర్వాత మాజీమంత్రి హరీశ్ రావు ఇప్పటికే రెండు దఫాలుగా కేసీఆర్‌తో సమావేశమయ్యారు. అటు న్యాయనిపుణులు,విశ్రాంత ఇంజనీర్లతోనూ కేసీఆర్ మంతనాలు జరుపు తున్నారు. కమిషన్ విధివిధానాలు, అందులో ఉన్న అంశాలు, నోటీసులో పేర్కొన్న విషయాలపై వారితో చర్చించినట్లు సమాచారం. వాటి ఆధారంగా విచారణకు సంబంధించి ఏంచేయాలన్న విషయమై కేసీఆర్ సంప్రదింపులు జరుపుతున్నారు. నోటీసులు రాజకీయపరమైనవని ఇప్పటికే ఆరోపించిన బీఆర్ఎస్ నేతలు వాటిని కాంగ్రెస్ నోటీసులుగా అభివర్ణించారు. కమిషన్ ముందు హాజరయ్యే విషయంలో వివిధ అభిప్రాయాలు చెబుతున్న గులాబీ నేతలు అన్ని అంశాలపై పూర్తిగా అవగాహన ఉన్న కేసీఆర్ తగిన నిర్ణయం తీసుకుంటారని చెప్తున్నారు. విచారణకు హాజరవడం ద్వారా కమిషన్ సహా ప్రజలకు కూడా అన్ని విషయాలను పూర్తి స్థాయిలో వివరించే అవకాశం >>2



మంగళవారం న్యూఢిల్లీలో కృష్ణమాదిగకు పద్మశ్రీ ని అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము

## కృష్ణమాదిగకు పద్మశ్రీ ప్రదానం
### సినీ నటులు అనంతనాగ్, శోభనలకు పద్మభూషణ్

**న్యూఢిల్లీ, మే 27:** పద్మపురస్కారాలు రెండో విడత ప్రధానోత్సవం రాష్ట్రపతిభవన్‌లో ఘనంగా జరిగింది. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ప్రత్యేకకార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము >>2



సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో మంగళవారం దాడులు నిర్వహిస్తున్న బిఐఎస్ అధికారులు

## స్టీల్ హింజ్స్ ఫ్యాక్టరీపై బిఐఎస్ దాడులు
### నకిలీ బిఐఎస్ మార్కులున్న ఉత్పత్తులు జప్తు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే27:** నకిలీ ఐఎస్ఐ ముద్రలతో ఉత్పత్తులు తయారు చేస్తున్న ఓ పరిశ్రమపై భారతీయ ప్రమాణాల బ్యూరో (బిఐఎస్), హైదరాబాద్ శాఖా కార్యాలయ అధికారులు దాడులు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో ఓ పరిశ్రమలో నకిలీ ఐఎస్ఐ ముద్రలతో ఇంటి తలుపులకు వాడే స్టీల్ హింజ్స్‌ను తయారుచేస్తూ, మార్కెట్‌కు సరఫరా చేస్తున్నారన్న సమాచారంతో అధికారులు ఈ దాడులు నిర్వహించారు. ఉత్పత్తులతో పాటు నకిలీ ఐఎస్ఐ ముద్రించిన ప్యాకేజింగ్ లేబుల్ అట్టలనూ సీజ్ చేసినట్లు బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ తెలిపారు. ఐఎస్ 1341:2018 ప్రమాణానికి లోబడి స్టీల్ బట్ హింజ్స్‌ను తయారు చేయాల్సి ఉంటుంది. భారత ప్రభుత్వం ఈ ఉత్పత్తికి క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్ గెజిట్ ద్వారా బీఐఎస్ ధ్రువీకరణ తప్పనిసరి చేసింది. దీన్ని తయారు చేసేందుకు కచ్చితంగా బీఐఎస్ నుంచి ధ్రువీకరణ పొందడంతో పాటు మార్కెట్లో నిల్వ చేయాలన్నా, విక్రయించాలన్నా దానిపై ఐఎస్ఐ ముద్రతో పాటు తయారీదారు లైసెన్సు వివరాలు ముద్రించాల్సి ఉంటుంది. కానీ, ఈ ఫ్యాక్టరీలో ఎలాంటి ధ్రువీకరణ లేకుండానే ఐఎస్ఐ మార్కును అనధికారికంగా వినియోగిస్తున్నట్లు బీఐఎస్ అధికారులు >>2

# పెద్దనోట్లను రద్దు చేయాలి
### నేరస్తులకు ఏపిలో చోటులేదు..
### అవినీతిపై పోరాడిన పార్టీ టిడిపి
### ఆగస్టు15 నుంచి మహిళలకు ఉచిత బస్సు
### కడప మహానాడులో పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఎపి సిఎం చంద్రబాబు

**కడప మే 27, ప్రభాతవార్త బ్యూరో:** గత ఏడాది అధికారం చేపట్టాక తెలుగుదేశం పార్టీ మొదటగా కడపలో తలపెట్టిన మహానాడు గురువారం కడప గడపలో అట్టహాసంగా ప్రారంభమైంది. ఏపి, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఆ పార్టీ అతిరథ మహారథులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర నేతలు హాజరు కాగా మొదటి రోజు సభ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పని అయిపోయిందన్న వారి పని అయిపోయిందే తప్ప తమ పార్టీ జెండా రెపరెపలాడుతూనే ఉందన్నారు. గత ఎన్నికల్లో బిజెపి, జనసేన పార్టీలతో కలిసి ఘన విజయాన్ని అందుకున్నామని చెప్పారు. అన్నదాత సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. హంద్రీనావా ఈ ఏడాదిలో పూర్తి చేయడంతోపాటు పోలవరం బనకచర్ల ప్రాజెక్టును పూర్తి చేసి సీమకు సాగునీరు అందించి ఇక్కడి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని, కోస్తాంధ్రలో ఆక్వా కల్చర్ అభివృద్ధి పరుస్తామని భరోసా ఇచ్చారు. పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. కేంద్రం ఇచ్చే నిధులతో కలిపి ప్రతి ఏడాది మూడు విడతల్లో రైతులకు అన్నదాత సుఖీభవ కింద జమ



మహానాడులో ఏపి సిఎం చంద్రబాబు

చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో నేరస్తులకు చోటు ఉండదని, అవినీతిపై పోరాడిన పార్టీ తమదేనన్నారు. తమ పోరాట ఫలితంగానే ఓబులాపురం మైనింగ్‌లో అవినీతికి పాల్పడిన వారికి జైలుశిక్ష పడిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత వైసిపి ప్రభుత్వ అవినీతిపై పారదర్శకంగా విచారణ జరుగుతోందని, శిక్ష ఆలస్యం కావచ్చుకాని అక్రమార్కులు తప్పించుకోలేరని సిఎం స్పష్టం చేశారు. తమ పార్టీ బిసిలకు ఎప్పటినుంచో వెన్నుదన్నుగా ఉందని వారు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి తాము తీసుకొచ్చామన్నారు. అందువల్లనే అనేక పార్టీలు బిసిలను గుర్తించడం ప్రారంభించాయని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే అనేక కీలక నిర్ణయాలలో తెలుగుదేశం పాత్ర ఉందని, ఆంధ్రప్రదేశ్ ఈ రోజు ఆలోచించే విధానాలు దేశం రేపు ఆలోచిస్తుందనేది అనేక మార్లు రుజువైందని చంద్రబాబు స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలకు నమ్మకం కలిగించామని, అందువల్లనే పెట్టుబడులు భారీగా వస్తాయని సిఎం చెప్పారు. కార్యకర్తల పోరాటం వల్లే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రశ్నించే గొంతులను నొక్కేశారని, అంతేకాక అక్రమ కేసులు పెట్టి హింసించారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు జాతి అభివృద్ధి కోసమే టిడిపి పనిచేస్తుందని, >>2



# విదేశ పర్యటనకు కెటిఆర్ పయనం
### డాలస్‌లో తెలంగాణ, బిఆర్ఎస్ వేడుకలు
### లండన్ 'ఇండియా వీక్'లో ప్రసంగం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే27:** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లండన్, అమెరికా పర్యటనకు బయల్దేరి వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ముఖ్యంగా అమెరికాలోని డాలస్‌లో జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలతో పాటు, బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సంబరాల్లో కూడా కేటీఆర్ పాల్గొంటారు. కేటీఆర్ తన పర్యటనలో భాగంగా మొదట యూకే వెళ్లనున్నారు. ఈ నెల 30న లండన్‌లో బ్రిడ్జ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే ప్రతిష్ఠాత్మక "ఇండియా వీక్ 2025" సదస్సులో ఆయన ప్రధాన ఉపన్యాసం చేయనున్నారు.ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన రాజకీయ నాయకులు,పారిశ్రామికవేత్తలు, ఇతర ప్రముఖులు పాల్గొంటారు. ఈ వేదికపై కేటీఆర్, బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణ సాధించిన అభివృద్ధి, వినూత్న ఆవిష్కరణల గురించి వివరించనున్నారు. తెలంగాణ విజయ ప్రస్థానాన్ని, అభివృద్ధి నమూనాని అంతర్జాతీయ సమాజానికి తెలియజేయనున్నారు. అదే రోజు వార్విక్‌లో, మొబిలిటీ టెక్నాలజీ రంగంలో తెలంగాణకు చెందిన ఆవిష్కరణలకు నిదర్శనంగా నిలిచిన ప్రాగ్మాటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పిడిఎస్ఎల్) నాలెడ్జ్ సెంటర్‌ను కేటీఆర్ ప్రారంభించనున్నారు. ఈ కేంద్రం మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ వంటి ప్రపంచ ప్రఖ్యాత ఆటోమోటివ్ సంస్థలకు పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) సేవలను అందించనుంది. యూకే పర్యటన ముగించుకున్న అనంతరం కేటీఆర్ అమెరికా వెళ్తారు. అక్కడ తెలంగాణ ఎన్ఆర్ఐలు నిర్వహించే పలు ముఖ్యమైన కార్యక్రమాలకు ఆయన హాజరవుతారు. జూన్ 1న టెక్సాస్ రాష్ట్రంలోని ఫ్రిస్కో నగరంలో ఉన్న కొమెరికా >>2

# 'సింగరేణి జాగృతి' ఆవిర్భావం
### బహుజనులు, యువతకు ప్రాధాన్యం: కవిత



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే27:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో సింగరేణి జాగృతి ఆవిర్భావించింది.మంగళవారం తన నివాసంలో సింగరేణి కార్మికులతో కవిత సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కార్యాచరణ ఉంటుందన్నారు. టీబీజీకేఎస్‌తో సమన్వయం చేసుకుంటూ పని చేస్తామన్నారు. బహుజనులు, యువతకు ప్రాధాన్యత కల్పిస్తాం అని కవిత స్పష్టం చేశారు. సింగరేణి 11 ఏరియాలకు కో ఆర్డినేటర్లను నియమించినట్లు పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా,సంస్థను కాపాడటమే ధ్యేయంగా సింగరేణి జాగృతి ఏర్పాటైందన్నారు.సింగరేణి ప్రాంతంలో తెలంగాణ జాగృతి ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించి సింగరేణిని రక్షించుకున్నామని.. అలాంటి సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం తమ అవినీతితో అంతం చేయాలని చూస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీ కోసం పని చేస్తున్నాడని అందుకే కార్మికుల ప్రయోజనాలు దెబ్బతీసే లేబర్ కోడ్ గురించి >>2



న్యూఢిల్లీలో మంగళవారం డియుఎస్‌యు విద్యార్థులతో సమావేశం అనంతరం తాగేందుకు కుండలో నీరు పోస్తున్న రాహుల్ గాంధీ

# కెటిఆర్ పయనం

>> సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, బీఆర్‌ఎస్ పార్టీ 25 ఏళ్ల రజతోత్సవ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈ భారీ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా నిలిచిన వేలాది మంది ప్రవాస భారతీయులు పాల్గొంటారని అంచనా. జూన్ 2న కేటీఆర్, డాలస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ (యూటీ డాలస్)లో భారతీయ విద్యార్థులతో సమావేశమవుతారు. ఈ సందర్భంగా నూతన ఆవిష్కరణలు, ఎంట్రప్రెన్యూర్‌షిప్‌తో పాటు భవిష్యత్ భారత నిర్మాణంలో విద్యార్థుల పాత్ర గురించి ప్రసంగించనున్నారు. ఈ పర్యటనలో కేటీఆర్ వివిధ దేశాల మేధావులు, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులతో సమావేశమై తెలంగాణ ప్రగతిని, ఇక్కడి అవకాశాలను వివరించనున్నారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ తదితరులు హైదరాబాద్ విమానాశ్రయం నుంచి బయల్దేరారు. కేటీఆర్ యూకే, యూఎస్ పర్యటన పట్ల అక్కడి ఎన్‌ఆర్‌ఐలు, బిఆర్‌ఎస్ శ్రేణులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# విచారణకు వస్తా

>> ఉంటుందన్న వాదన లేకపోలేదు. మంచి ఉద్దేశంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంశాలను పూర్తి స్థాయిలో విడమర్చి చెప్పవచ్చన్న అభిప్రాయాన్ని గతంలో కేసీఆర్ కొంతమంది నేతలతో వ్యక్తం చేసినట్లు చెప్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ ఆ ప్రాజెక్టుపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం కమిషన్ వేసింది. జస్టిస్ పిసి ఘోష్ నేతృత్వంలో ఏర్పాటైన కాళేశ్వరం కమిషన్ విచారణ దాదాపుగా పూర్తయ్యే దశకు చేరుకుంది. 14 నెలలుగా విచారణ జరిపింది. దాదాపు 200 మంది అధికారులను, ఇంజనీర్లను విచారణ జరిపారు. కెసిఆర్ నోటీసు అందుకున్న అప్పటి నుంచి పార్టీలో కాళేశ్వరం కమిషన్ ముందుకు హాజరు కావాలా లేదా అని అంశంపై తర్జనభర్జన జరిగింది. ఇప్పటికీ కెసిఆర్ ఫామ్ హౌస్ లో చాలాసార్లు దీనిపై చర్చించారు. పార్టీతో పాటు న్యాయ నిపుణులతో చర్చలు జరిపి సలహాలు తీసుకున్నారు. నిజానికి పోయిన ఏడాది అసెంబ్లీలో కాళేశ్వరంపై కావాలంటే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించు కోండి అంటూ సవాల్ విసిరిందే బీఆర్‌ఎస్. తీరా ప్రభుత్వం విచారణకు ఆదేశించిన తర్వాత హాజరు కాకపోతే ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని, కమిషన్‌ను గౌరవించకపోతే అది బీఆర్‌ఎస్ పై దెబ్బ పడుతుందని భావిస్తున్నారు. హాజరైతే ప్రజల్లో సింపతీ పెరుగుతుందని, ప్రభుత్వం కావాలనే కక్ష గట్టి విచారణలకు తిప్పుతుందని సంకేతాలు వెళ్తాయని భావిస్తున్నారు. మొత్తానికి మొదటిసారిగా ఓ విచారణకు గులాబీ దళపతి హాజరవుతారని తెలుస్తోంది. మరోవైపు పార్టీలో గంభీర వాతావరణం కనిపిస్తుంది. ఇక కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ ఇప్పటికే 400 పేజీల నివేదికను సిద్ధం చేసింది. గత ప్రభుత్వ హయాంలో కీలక పోస్టులను డీల్ చేసిన అధికారులు సోమేష్‌కుమార్, స్మిత సబర్వాల్, రజత్‌కుమార్ వంటి వారిని బహిరంగ విచారణకు పిలిచింది. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు, కాళేశ్వరంగా రూపాంతరం చెందడం మొదలు, ప్రాజెక్టు డిజైన్‌లు, అనుమతులు, నిధులకు సంబంధించిన కీలక సమాచారాన్ని రికార్డు చేసింది. ముఖ్య ప్రాజెక్టు వ్యయాన్ని లక్ష కోట్లకు పెంచడంపై ఆరా తీసింది. నిర్మాణం పూర్తి కాకుండానే బకాయిల చెల్లింపుపై కూడా కూపీలాగింది. ఈ సమాచారాన్ని క్రోడీకరించిన పీసీ ఘోష్ కమిషన్.. గత ప్రభుత్వ హయాంలో కీలక నిర్ణయాలు తీసుకున్న పెద్దలను ప్రశ్నించాలని నిర్ణయించింది. ఆ క్రమంలోనే నోటీసులు జారీ అయ్యాయి.

# పెద్దనోట్లను రద్దు చేయాలి

>> కార్యకర్తల కష్టానికి గౌరవం గుర్తింపు ఇచ్చి సంక్షేమాన్ని అందిస్తామని బాబు భరోసా ఇచ్చారు. వాట్సాప్ గవర్నెన్స్ ఒక గేమ్ చేంజర్‌గా సిఎం అభివర్ణించారు. వచ్చే ఆగస్టు 15నుండి మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసిలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని పేర్కొన్నారు. పార్టీకి ప్రభుత్వానికి మధ్య సమన్వయం ఉండాలని దీనికి మహానాడు వేదిక కావాలని ఆకాంక్షించారు. లక్ష్యాన్ని సాధించే వరకు రాష్ట్రాన్ని తెలుగు జాతిని నెంబర్ 1గా చేస్తామని అన్నారు. సంక్షోభం తెలుగుదేశానికి కొత్త కాదని ఆయన అభిప్రాయపడ్డారు. గత ఎన్నికల్లో కడపలో 10కి 7 సీట్లు గెలిచామని వచ్చే ఎన్నికల్లో కడపలో క్లీన్ స్వీప్ చేయాలని నేతలను దిశానిర్దేశం చేశారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కార్యకర్తలు అధికారులు న్యాయం చేయకపోతే వారికి శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దేశంలో పెద్దనోట్లన్నీ రద్దు చేయాలని కేంద్రానికి సూచించినట్లు చంద్రబాబు తెలిపారు. డిజిటల్ కరెన్సీ వచ్చాక పెద్ద నోట్ల అవసరం లేదని వాటి రద్దు తోనే అవినీతిని అరికట్టగలమని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. మంత్రులు లోకేష్, హోంమంత్రి అనిత, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పార్థసారధి, సబిత, బిసి జనార్ధన్‌రెడ్డి, కేంద్ర మంత్రులు చంద్రశేఖర్, రామ్మోహన్‌నాయుడు, స్థానిక ఎమ్మెల్యేలు పుత్తా చైతన్యరెడ్డి, మాధవిరెడ్డి తదితరులతో పాటు రెండు రాష్ట్రాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించిన పౌరవిమానయాన శాఖ**

మహానాడు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ వేడుకల్లో ఫొటో ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహానాడులో తొలిసారి డిజిటల్ ఫార్మేట్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. నందమూరి కుటుంబాలకు సంబంధించిన విషయాలను తెలియజేసే విధంగా ఫొటోలను ప్రదర్శించారు. అదేవిధంగా యువగళం పాదయాత్ర విషయాలను కూడా ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. నందమూరి తారక రామారావు జీవిత చరిత్ర విశేషాలు పుస్తకాలతోపాటు ఆయన అసెంబ్లీలో ప్రసంగించిన ముఖ్యమైన ఘటనలను పుస్తకాలను కూడా ప్రదర్శనలో పెట్టారు. ఎగ్జిబిషన్‌ను తిలకించిన అనంతరం రక్తదాన, వైద్య శిబిరాలను ప్రారంభించి అనంతరం రక్తదానం చేసిన వారి వద్దకు వెళ్లి అభినందించారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కార్యకర్తలకు అండగా ఉంటామని, ఆ పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

## జూన్ 2న కవిత
# కొత్త పార్టీ?
## ఎంపి రఘునందన్‌రావు

**హైదరాబాద్, మే 27 ప్రభాతవార్త:** మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్, ఆయన కుమార్తె కవితల మధ్య మధ్యవర్తులెందుకు? అని ఎంపి రఘునందన్‌రావు ప్రశ్నించారు. మంగళవారం మీడియాతో మాట్లాడారు. జూన్ 2వ తేదీన కవిత కొత్త పార్టీ పెట్టబోతుందని జోస్యం చెప్పారు. అనంతరం తెలంగాణలో కవిత పాదయాత్ర చేస్తుందని, కవిత గెలిచినప్పుడు కెసిఆర్ దేవుడయ్యారని, మరి ఇప్పుడు దెయ్యం ఎలా అయ్యారంటూ ఎంపి రఘునందన్‌రావు సందేహం వ్యక్తం చేశారు. దెయ్యాల మధ్య పదేళ్ల రాజకీయం ఎందుకు? చేసినట్లు అంటూ కవితకు ఈ సందర్భంగా ఎంపి చురకలు అందించారు.

# హైకోర్టు జడ్జిల బదలీ

>> హైకోర్టుకు, బాంబే హైకోర్టుకు చెందిన జస్టిస్ నితిన్ వాసుదేయో సాంబ్రే ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రతిపాదించింది. అలహాబాద్ హైకోర్టుకు చెందిన జస్టిస్ అశ్వనీ కుమార్ మిశ్రాకు చెందిన పంజాబ్-హర్యానా హైకోర్టుకు, గౌహతి హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ సుమన్ శ్యామ్‌ను బాంబే హైకోర్టుకు, పంజాబ్-హర్యానా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ప్రకాశ్ శర్మ రాజస్థాన్ హైకోర్టుకు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వివేక్ చౌదరి ఢిల్లీ హైకోర్టుకు, కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దినేష్ కుమార్ సింగ్ కర్నాటక హైకోర్టుకు, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వివేక్ కుమార్ సింగ్ మధ్యప్రదేశ్ హైకోర్టుకు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఓం ప్రకాశ్ శుక్లా ఢిల్లీ హైకోర్టుకు, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్ బాంబే హైకోర్టుకు, పంజాబ్-హరియానా హైకోర్టు న్యాయమూర్తి సుధీర్ సింగ్ పట్నా హైకోర్టుకు, రాజస్థాన్ హైకోర్టుకు చెందిన జస్టిస్ అరుణ్ కుమార్‌ను ఢిల్లీ హైకోర్టుకు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జయంత్ బెనర్జీ కర్నాటక హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది.

## వారం - వర్జ్యం

తేది : 28-05-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
విదియ రా. 1.57
మృగశిర రా. 12.32
వర్జ్యం ఉ. 8.18-9.46
దు.ఉ. 11.39-12.31
శుభసమయం : ఉ.5.10-6.00
రాహుకాలం - మ. 12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** పాతమిత్రులను కలిసి కష్ట సుఖాలను పంచుకుంటారు. దూర ప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకుంటారు.

**వృషభం :** నూతన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. కుటుంబంలో శుభ కార్యాల ప్రస్తావన వుంటుంది. వస్తుసేకరణ.

**మిథునం:** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. నూతన విషయాలు తెలుసుకుంటారు.

**కర్కాటకం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి. ఉద్యోగాలలో స్థాన మార్పులు వుంటాయి.

**సింహం:** భూవివాదాలలో తొందర పాటు వద్దు. ధనవ్యయం. ఋణ వత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి.

**కన్య :** మిత్రులే శత్రువులుగా మారి సమస్యలు సృష్టిస్తారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. వ్యయ ప్రయాసలు.

**తుల :** శ్రమ పెరుగుతుంది. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ధనవ్యయం పెరుగుతుంది.

**వృశ్చికం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. వస్తు సేకరణ.

**ధనుస్సు:** కుటుంబ సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**మకరం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకోండి. ఖర్చులు పెరుగుతాయి.

**కుంభం:** ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. దైవ దర్శనాలు. సోదరుల కలయిక.

**మీనం :** పాతమిత్రులను కలిసి ఆనందంగా గడువుతారు. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కృష్ణమాదిగకు పద్మశ్రీ ప్రదానం

>> విభిన్న రంగాల్లో విశిష్టసేవలందించిన పలువురికి ప్రతిష్టాత్మక పురస్కారాలు అందచేసారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం రోజున ఏడుగురికి పద్మవిభూషణ్, 19మందికి పద్మభూషణ్, 113మందికి పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించింది. వీరిలో నందమూరి బాలకృష్ణ, డా.నాగేశ్వరరెడ్డి వంటి తెలుగు ప్రముఖులు సహా మొత్తం 71 మందికి గతనెల 28న పురస్కారాలు ప్రధానంచేయగా తాజాగా మంగళవారం మరికొందరికి ప్రధానంచేసారు. రెండో విడత పురస్కారాలు అందుకున్నవారిలో సినీనటిశోభన పద్మభూషణ్ పురస్కారం అందుకోగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిక పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌నుంచి వి.రాఘవేంద్రాచార్య పంచముఖి, ప్రొఫెసర్ కెఎల్ కృష్ణలు పద్మశ్రీ అవార్డులను రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్నారు. పద్మభూషణ్ అవార్డును కన్నడ నటుడు అనంతనాగ్ స్వీకరించారు. ఈకార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, జైశంకర్, కిశన్‌రెడ్డి, ధర్మేంద్రప్రధాన్, ప్రహ్లాద్‌జోషి పలు రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.



మంగళవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జస్టిస్ ఖేహర్(రిటైర్డ్)కి పద్మ విభూషణ్, నర్తకి, నటి శోభనా చంద్రకుమార్‌కి పద్మ భూషణ్ అవార్డును అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము

# 'నకిలీ' విక్రేతలపై కొరడా

>> వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ అత్యవసర కాన్ఫరెన్స్‌లో ప్రధానంగా ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, రుతుపవనాలు, వానాకాలం పంటల సాగు.. నాలుగు అంశాలపై చర్చించారు. ధాన్యం సేకరణను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైనన్ని లారీలతో రవాణా చేయాలని, అవసరమైతే స్థానికంగా గోదాములు అద్దెకు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వానాకాలం ముందుగా వచ్చిందని, ఇప్పటికే ఈసారి 29 శాతం వర్షపాతం అధికంగా ఉండటంతో రాష్ట్రంలో సుభిక్ష వాతావరణం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. సీజన్ ముందుకు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అన్ని జిల్లాలో విత్తనాలు, ఎరువులు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, బఫర్ స్టాక్ ఉందా లేదా చూసుకోవలని, కలెక్టర్లు ఏరోజుకారోజు సమీక్షించుకోవాలని సిఎం ఆదేశించారు. ఎరువులు విత్తనాలను బ్లాక్ మార్కెట్ చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేసే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని చెప్పారు. అవసరమైతే కల్తీ విత్తనాల నేర చరిత్ర ఉన్న వారిపై పీడీ యాక్ట్ పెట్టాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని అన్నారు. ఎరువులు, విత్తనాల నిల్వలు, కల్తీల విత్తనాలను అరికట్టేందుకు వీలుగా జిల్లాలో పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించుకోవాలని సూచించారు.

యాసంగిలో గతంలో ఎన్నడూ లేనంత ధాన్యాన్ని ప్రభుత్వం ఈసారి కొనుగోలు చేసింది. గత ఏడాది 42 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొంటే, ఈసారి ఇప్పటికే 64.50 లక్షల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యధికంగా ధాన్యం కొనుగోలు జరిగిందని, ఇప్పటికే 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ముఖ్యమంత్రి వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 48 గంటల్లో రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించామని, ఈ సీజన్‌లో ఇప్పటికే రూ.12,184 కోట్లు చెల్లించామన్నారు. అధికారులు, జిల్లాల్లో కలెక్టర్లు సమర్థంగా పని చేయటం వల్లనే ప్రభుత్వం ఈ విజయం సాధించిందని వారిని అభినందించారు. దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో ఈ ఏడాది 2.75 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి సాధిం చటం, మన రైతులు సాధించిన విజయమని ముఖ్యమంత్రి అన్నారు. ఇందులో భాగస్వామ్యం పంచుకున్న వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్ విభాగాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఏడాది ముందుగా వచ్చిన వర్షాలతో ధాన్యం సేకరణకు అక్కడక్కడ ఆటంకం కలిగిందని అభిప్రాయ పడ్డారు. గత ఏడాదితో పోలిస్తే 21.50 లక్షల టన్నుల ధాన్యం ఎక్కువగా కొనుగోలు చేశామని, మరో నాలుగైదు లక్షల టన్నుల ధాన్యం రైతుల వద్ద మిగిలి ఉందని, ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి కలెక్టర్లను ఆదేశించారు. 33 జిల్లాల్లో 21 జిల్లాల్లో ధాన్యం సేకరణ విజయవంతంగా సాగిందని, 12 జిల్లాల్లో అక్కడక్కడ ఆందోళనలు జరిగినట్లు దృష్టికి వచ్చిందని, కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళితే ఈ సమస్యలన్నీ అక్కడికక్కడే పరిష్కారమవుతాయని ముఖ్యమంత్రి అన్నారు. చేసిన మంచి పనిని చెప్పుకోకపోవడం వల్లే చిన్న చిన్న సంఘటనలు పెద్దగా ప్రచారంలోకి వస్తున్నాయని, కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత ఆందోళనలు జరుగుతున్నాయని అన్నారు. అనారోగ్య ంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలు వల్లనే అని దుష్ప్రచారం చేసిన ఘటనను ఉదాహరించారు. అందుకే కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను దాచిపెట్టకుండా వెల్లడించాలని, కలెక్టర్లు ప్రోయాక్టివ్‌గా పని చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పాలనా పరంగా తప్పులు జరిగితే, వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలని, తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వాలని అన్నారు. ఉద్దేశపూర్వకంగా విష ప్రచారం చేసే వారిపై కేసులు పెట్టేందుకు వెనుకాడ వద్దని అన్నారు.

# జూన్ 2న ఘనంగా ఆవిర్భావదినోత్సవం

>> కోవాలని చెప్పారు. మంగళవారం సాయంత్రం కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ అత్యవసర కాన్ఫరెన్స్‌లో ప్రధానంగా ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, రుతుపవనాలు, వానాకాలం పంటల సాగు.. నాలుగు అంశాలపై చర్చించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. నిరుపేదలు ఇల్లు కట్టుకుంటే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, కలెక్టర్లు తమ పనితీరును బాధ్యతగా నిర్వర్తించి ఈ పథకాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల తుది జాబితాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీల ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్, ఎంపీడీవో, కార్మిక అధికారి, స్వయం సహాయక సంఘం సభ్యులతో ఈ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మేస్త్రీల ఛార్జీలు, స్టోన్ మెటల్ వంటి ధరలను కట్టడి చేసే బాధ్యతను ఈ కమిటీ చేపడుతుందన్నారు. ఇసుక దందాతో లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ఉచిత ఇసుక కూపన్లను సకాలంలో అందించాలని, లబ్ధిదారులకు ఇసుక కొరత లేకుండా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇటుక తయారీ, సెంట్రింగ్ యూనిట్ల తయారీకి ఇందిరా మహిళా శక్తి, రాజీవ్ యువ వికాసం ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లాల ఇంచార్జ్ మంత్రులు సంబంధిత జిల్లాల్లో పర్యటించాలని ముఖ్యమంత్రి సూచించారు. ధాన్యం సేకరణ, భూభారతి రెవిన్యూ సదస్సులు, వానాకాలం పంటల సాగు సన్నద్ధ ప్రణాళికపై కలెక్టర్లతో సమీక్ష నిర్వహించాలని చెప్పారు. ముందుగా వచ్చిన వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు, జ్వరాలు వచ్చే ప్రమాదముంటుందని సిఎం వైద్యారోగ్య శాఖను అప్రమత్తం చేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. జూన్ 1 నాటికి జిల్లాల వారీగా ఈ అంశాలన్నింటితో పూర్తి నివేదికను తనకు అందించాలని మంత్రులకు, కలెక్టర్లకు ముఖ్యమంత్రి సూచించారు. అదే రోజున సెక్రెటేరియట్లో మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమై వెంటనే తీసుకోవాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన ప్రణాళికపై చర్చిద్దామని చెప్పారు. సిఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ, అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.



గుజరాత్ పట్టణ వృద్ధి కథ 20 సంవత్సరాల వేడుకలను పురస్కరించుకుని మంగళవారం గాంధీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోడీకి బ్రహ్మోస్ క్షి పణి నమూనాను అందజేస్తున్న దృశ్యం

# కాలు దువ్వితే బుద్ధి చెబుతాం

>> పాక్ మిలిటరీ కూడా సెల్యూట్ చేసిందని ఆయన చెప్పారు. దీని ద్వారా ఉగ్రవాద చర్యలను పరోక్ష యుద్ధంగా పరిగణించరాదని, ఇది కావాలని చేస్తున్న యుద్ధ వ్యూహంగా భావించాల్సి వస్తుందని, ఒకవేళ వాళ్లు యుద్ధానికి దిగిగే, అప్పుడు మన సమాధానం కూడా ఆస్థాయిలోనే ఉంటుందని ప్రధానిహెచ్చరించారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిన గుజరాత్ అర్బన్ గ్రోత్ స్టోరీ 20వ సంబరాల్లో ప్రధాని మోదీ పాల్గొని మరోసారి పాకిస్తాన్‌వైఖరిపై ధ్వజమెత్తారు. దేశ విభజన సమయంలోనే ముజాహిదీన్‌లు ఏర్పడ్డారని, వాళ్లను అప్పుడే ఖతం చేస్తే ఈ సమస్య ఉండేది కాదు అని ప్రధాని పేర్కొన్నారు. కశ్మీర్‌లోకి ప్రవేశించిన ముజాహిదీన్‌లను 1947లోనే అంతం చేస్తే, ఇప్పుడు ఈ సమస్య ఉత్పన్నం అయ్యేది కాదన్నారు. సింధూ నదీ జలాల విషయంలో కుదిరిన ఒప్పందంలో చాలా లోపాలు ఉన్నాయని, సరైన రీతిలో ఆ నదీ జలాల పంపకంపై చర్చలు జరగలేద న్నారు. కశ్మీర్‌లో ఉన్న డ్యామ్‌లనుంచి ఇసుకను తీసివేసేందుకు కూడా అనుమతులు లేని విధంగా ఒప్పందం కుదర్చుకున్నట్లు ఆరోపించారు. సింధూ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేసి, మన డ్యాముల్లో నీటి సామర్థ్యాన్ని పెంచుతుంటే, పాకిస్థానీలు ఆగ్రహానికి గురవుతున్నారని తెలిపారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌ను 1947లోనే సర్దార్ వల్లభాయ్ పటేల్ తమ ఆర్మీతో వెనక్కి తీసుకోవాలని భావించారన్నారు. 2014లో తమ పార్టీ అధికారంలోకి వచ్చిన సమయంలో భారత దేశం 11వ అతిపెద్ద ఆర్థిక దేశంగా ఉండేదన్నారు. కానీ ఇప్పుడు మన దేశం నాలుగవ అతిపెద్ద ఆర్థిక దేశంగా మారిందన్నారు. ఆర్థిక వ్యవస్థల్లో బ్రిటన్‌ను దాటేసినప్పుడు సంతోషంగా ఫీలయ్యామని, ఎందుకంటే ఆ దేశం మనల్ని పాలించిందని, ఎప్పుడు 3వ స్థానానికి వెళ్లాలన్న వత్తిడి ఇప్పుడు దేశంపై ఉందన్నారు. పొరుగు వాళ్లు కూడా సంతోషంగా ఉండాలన్న భావన ఉందని, కానీ మన సామర్థ్యాన్ని సవాల్ చేస్తే, అప్పుడు భారత్ హీరోలకు నిలయంగా మారుతుందని ప్రధాని మోదీ తెలిపారు. మన శరీరం ధారుఢ్యంగా ఉన్నా ఒక చిన్న ముల్లు గుచ్చుకున్నా దాని వల్ల నొప్పి ఉంటుందని, మనకు నొప్పిని కలిగిస్తున్న ఉగ్రవాదం అనే ఆ ముల్లును శాశ్వతంగా పీకేస్తామని ప్రధాని మరోసారి స్పష్టంచేసారు. ప్రపంచమంతా కరోనా, ప్రకృతి వైపరీత్యాలు, ఆర్థిక సంక్షోభాలు వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ భారతదేశం తన గమ్యాన్ని వదులుకోలేదని ఆయన అన్నారు. మన లక్ష్యం 2047నాటికి అభివృద్ధి చెందిన భారత్. స్వాతంత్ర్యం పొందిన 100సంవత్సరాల సందర్భంగా, మనదేశాన్నిప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టేలక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. శాంతియుతసహజీవనం భారత్ లక్ష్యమని, కానీ, ఆ శాంతిని సవాలు చేస్తే, భారతదేశం తక్షణమే స్పందిస్తుందని, ఇది వీరుల భూమి అని మోదీ వెల్లడించారు.

# 'సింగరేణి జాగృతి' ఆవిర్భావం

>> ఒక్కమాట మాట్లాడటం లేదని పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో 40 వేల మందికిపైగా కార్మికులు పని చేస్తుంటే వారిలో సగానికిపైగా యువకులే ఉన్నారని తెలిపారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ హాస్పిటళ్లలో ఉచిత వైద్యం అందజేయాలన్నారు. కార్మిక కాలనీల్లో మెరుగైన వసతులు కల్పించాలని, తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 1970లో నిర్మించిన క్వార్టర్స్ కూలిపోయే దశలో ఉన్నాయని, అన్ని రీజియన్లలో కార్మికుల కోసం కొత్త క్వార్టర్స్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఓపెన్ కాస్టుల్లో ఎస్‌డీఎల్ వెహికిల్స్‌ను సింగరేణి కార్మికులతోనే నడిపించాల్సి ఉండగా ఆ మిషన్లను ప్రైవేటు వాళ్లతో నడిపిస్తున్నారని, ఇది ఓపెన్ కాస్టుల నుంచి కార్మికులను తొలగించే కుట్ర అన్నారు. వెంటనే ప్రైవేట్ వ్యక్తులతో పని చేయించడం ఆపివేయాలన్నారు. సింగరేణి సంస్థ ద్వారా సమకూరుతున్న డీఎంఎఫ్ టీ నిధులను కార్మికులకు మెరుగైన వసతులు కల్పించడానికి వినియోగించకుండా సీఎం, డిప్యూటీ సీఎంల నియోజకవర్గాలు కొడంగల్, మధిరకు తరలించుకుపోతున్నారని మండిపడ్డారు. జైపూర్ పవర్ ప్లాంట్ సెకండ్ ఫేజ్ పనులను బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రూ.5 వేల కోట్లతో ప్రతిపాదిస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏడాదిలోపే రూ.9 వేల కోట్లకు పెంచిందని అంటే సంస్థను తమ అవినీతితో ఈ ప్రభుత్వం ఏ స్థాయిలో దెబ్బతీయాలని చూస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎక్స్ ప్లోజివ్స్ టెండర్లలోనూ భారీ అక్రమాలకు పాల్పడ్డారని, ఏకంగా టెండర్‌ను మూడు రెట్లు పెంచారని తెలిపారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని సంస్థను ముంచేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకొని తీరుతామన్నారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగ నియామకాలు జీఎం స్థాయిలో చేస్తారని.. సీఎం తన పబ్లిసిటీ స్టంట్ కోసం ఉద్యోగులను ఇబ్బంది పెడుతూ హైదరాబాద్ కు పిలిపించి అపాయింట్ మెంట్లు ఇస్తున్నారని మండిపడ్డారు. పెండింగ్ లో ఉన్న మారు పేర్ల సమస్యను పరిష్కరించి వారికి ఉద్యోగ అవకాశం వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారి తరుపున సింగరేణి జాగృతి ఉద్యమిస్తుందన్నారు. రాజకీయ పార్టీలకు సింగరేణి అంటే తమ ప్రయోజనాలు మాత్రమేనని.. కార్మికులకు ఆ సంస్థే జీవితమని అన్నారు. వారందరి తరుపున తాము పని చేస్తామన్నారు. కార్మికుల కోసం తాను స్వయంగా బొగ్గు గనులు, ఓపెన్ కాస్టుల వరకు వచ్చి కూర్చొంటానని హామీ ఇచ్చారు. ఓపెన్ కాస్టుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. సింగరేణి జాగృతికి అనుబంధంగామహిళల విభాగంకూడా ఏర్పాటు చేస్తామన్నారు.

## స్టీల్ హింజ్స్ ఫ్యాక్టరీపై
# బిఐఎస్ దాడులు

>> గుర్తించారు. బీఐఎస్ డైరెక్టర్ తమ్మాడి సుజాత, జాయింట్ డైరెక్టర్ తన్నీరు రాకేశ్ నేతృత్వంలోని బృందం దాడుల్లో పాల్గొంది. బీఐఎస్ చట్టం 2016 ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపడుతున్నామని పీవీ శ్రీకాంత్ తెలిపారు. తప్పనిసరి జాబితాలో ఉన్న ఏ ఉత్పత్తిని అయినా బీఐఎస్ ధ్రువీకరణ లేకుండా తయారుచేసినా, నిల్వ చేసినా, విక్రయించినా చర్యలుంటాయన్నారు. దీనికి రూ.లక్ష నుంచి రూ.5లక్షల దాకా జరిమానాతో పాటు ఏడాది నుంచి 5ఏళ్ల దాకా జైలు శిక్షా పడే అవకాశముందన్నారు. వినియోగదారులు కొనే ప్రతీ వస్తువునూ బీఐఎస్ కేర్ యాప్లో నాణ్యత పరీక్షించుకొని కొనాలని.. నకిలీ నాణ్యతా చిహ్నాల పట్లా ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ప్రతీ ఐఎస్ఐ మార్కు పైన ఆ వస్తువు ఐఎస్(ఇండియన్ స్టాండర్డ్) నెంబరు, కింద ఆ తయారీదారు లైసెన్సు నెంబరు కచ్చితంగా ఉండాలన్నారు. ఆ లైసెన్స్ నెంబరును బీఐఎస్ కేర్ యాప్లో నమోదు చేసి వస్తువు యొక్క పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. బంగారు ఆభరణాలకైతే హెచ్యూఐడీ తప్పనిసరి ఉండాలని.. దాని ద్వారా ఆ ఆభరణం శుద్ధతనూ ఇదే యాప్లో తెలుసుకోవచ్చన్నారు.

## గాలి జనార్ధన్ రెడ్డి బెంగళూరుకు తరలింపు

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** ఓబుళాపూరం గనుల వ్యవహారంలో ఏడేళ్ల జైలు శిక్షకు గురైన కర్నాటక బిజెపి ఎంఎల్‌ఎ గాలి జనార్ధన్ రెడ్డిని బెంగళూరుకు తరలించారు. బెంగళూరులో గాలి జనార్ధన్ రెడ్డిపై వున్న పెండింగ్ కేసుల విచారణ కోసం అక్కడి పోలీసులు మంగళవారం నాడు హైదరాబాద్‌కు వచ్చి పి టి వారంట్‌పై ఆయనను బెంగళూరుకు తరలించారు. బెంగళూరులో వున్న కేసుల విచారణ తరువాత జనార్ధన్ రెడ్డిని తిరిగి హైదరాబాద్‌కు తరలిస్తారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

## ప్రభాకర్ రావు ఇంటికి నోటీసులు అంటించిన పోలీసులు

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మొదటి ముద్దాయిగా వుండి పోలీసుల విచారణకు గైర్హాజర్ అవుతూ 16 నెలలుగా అమెరికాలో తలదాచుకున్న ఎస్‌ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు ఇంటికి ఈ కేసును విచారిస్తున్న పశ్చిమ మండల పోలీసులు మంగళవారం నోటీసులు అంటించారు. నాంపల్లి కోర్టు ప్రకటించిన ప్రకటిత నేరస్తుడుగా ప్రభాకర్ రావును చూపుతూ ఆ నోటీసులో వుంది. ఈ నెల 20వ తేదీలోగా ఫోన్ ట్యాపింగ్ కేసులో తమ ఎదుట విచారణకు హాజరు కావాలని అందులో వుంది. శివారులోని ఇబ్రహీంబాగ్ వద్ద గల తారామతి, బారామతి వద్ద గల ప్రభాకర్ రావు విల్లా 38కు పోలీసులు నోటీసులు అంటించారు. ప్రభాకర్ రావుపై సిఆర్‌పిసి 82, బిఎన్ఎస్‌లోని 84కింద కేసు నమోదయ్యింది. ప్రభాకర్ రావుకు ఇప్పటికే పోలీసులు పలు దఫాలు నోటీసులు ఇవ్వడం, పలుమార్లు ఫోన్‌లో రావాలని కోరడం జరిగినా ఆయన రాక పోవడం తెలిసిందే. తాను అమెరికా నుంచి వర్చువల్‌గా విచారణకు హాజరవుతానని ప్రభాకర్ రావు కోరడం విదితమే. ఇందుకు పోలీసులు అంగీకరించక పోవడంతో ప్రభాకర్ రావు మొదట నాంపల్లి కోర్టులో, ఆ తరువాత హైకోర్టులో దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా రద్దయింది. దీంతో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జూన్ మొదటి వారంలో దీనిపై విచారణ జరగనుంది. ఒకవేళ సుప్రీం కోర్టులో ప్రభాకర్ రావుకు ముందస్తు బెయిల్ రాకుంటే నాంపల్లి కోర్టు ఆదేశాల ప్రకారం ఆయన జూన్ 20వ తేదీలోగా విచారణకు హాజరవాల్సి వుంటుంది. లేకుంటే ఆస్తులను సర్కారు జప్తు చేసే వీలుంది.

## గిరిజన సహకార సంస్థ వేతనాల విడుదలపై హర్షం

**హైదరాబాద్,మే27,ప్రభాతవార్త:** తెలంగాణ గిరిజన సహకార సంస్థకు చెందిన ఉద్యోగులు వేతనాలను100 శాతం విడుదల చేయడం పట్ల ఆ సంస్థ ఉద్యోగులు సంఘం నాయకులుజీవన్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం పూర్తిస్థాయిలో వేతనాలు అందక పోవడంతో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడ్డామన్నారు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు తరువాత పూర్తి స్థాయి జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల బాధలను సానుభూతితో విని సమస్యను పరిష్కరించిన మంత్రి సీతక్కకు ప్రతి ఉద్యోగి కృతజ్ఞతలు తెలిపారన్నారు. టిజిసిసి (గిరిజన కార్పోరేషన్ సొసైటి)కి సరిపడా నిధులను కేటాయించి సంస్థ ఉద్యోగుల కుటుంబాలలో వెలుగులు నింపిన సిఎం రేవంత్‌రెడ్డికి ప్రతి ఉద్యోగి రుణపడి ఉంటారన్నారు. ఉద్యోగుల సమస్యల పట్ల పూర్తి అవగాహనతో వేతనాల సమస్య పరిష్కారానికి కృషి చేసిన చైర్మన్ కోట్నాక్ తిరుపతి, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్‌కి ఉద్యోగులందరి తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



## క్లాసులు ఎగ్గొడితే విద్యార్థి వీసాలు రద్దు

### విదేశీ విద్యార్థులకు ట్రంప్ మరో హెచ్చరిక

**న్యూఢిల్లీ, మే 27:** అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు విదేశీయులకే ఎక్కువ నష్టం కలిగించేవిగా ఉన్నాయి. ముఖ్యంగా అమెరికాలో ఉంటున్న విదేశీ విద్యార్థులు, అక్రమ వలసదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలు కారణాలతో విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేసి వారిని దేశం నుంచి బహిష్కరిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా భారత్ సహా యూఎస్‌లో ఉంటున్న విదేశీ విద్యార్థులకు ట్రంప్ సర్కార్ మరో హెచ్చరిక చేసింది. చదువుకోవడానికి అని అమెరికాకు వెళ్లి విద్యా సంస్థల అనుమతి లేకుండా క్లాసులు ఎగ్గొట్టినా వీసాలు రద్దు చేస్తామని హెచ్చరించింది. భారత్‌లో ఉన్న అమెరికా రాయబార కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 'డ్రాపౌట్ అయినా, క్లాస్‌లకు గైర్హాజరైనా, విద్యాసంస్థకు చెప్పకుండా స్టడీ ప్రోగ్రామ్ నుంచి వెళ్లిపోయినా మీ విద్యార్థి వీసా రద్దవుతుంది. భవిష్యత్తులో ఎలాంటి అమెరికా వీసాలకైనా మీరు అర్హతను కోల్పోతారు. సమస్యల బారిన పడకుండా ఉండేందుకు ఈ నిబంధనలను కచ్చితంగా పాటించండి. మీ విద్యార్థి వీసాను కొనసాగించుకోండి అని యూఎస్ ఎంబసీ వెల్లడించింది. ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన తరువాత ఏదో ఒక వంకతో విదేశీయులను వెనక్కి తిప్పి పంపుతున్నారు అమెరికా అధికారులు. ముందస్తు నోటీసు లేకుండా వీసాలను రద్దు చేస్తూ అంతర్జాతీయ విద్యార్థులపై అమెరికా ప్రభుత్వం తన అణచివేతను తీవ్రతరం చేసింది. పాలస్తీనా అనుకూల నిరసనల నుంచి ట్రాఫిక్ ఉల్లంఘనల వరకూ ఇలా ఏదో ఒక కారణంతో విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేస్తూ వారిని దేశం నుంచి బహిష్కరిస్తోంది. అమెరికాలో విద్యనభ్యసిస్తున్న 1,000 మందికిపైగా అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను ప్రభుత్వం ఇప్పటికే రద్దు చేసింది. మార్చి నుంచి హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్, యూనివర్సిటీ ఆఫ్ మిచిగన్ వంటి ప్రముఖ విద్యాసంస్థలతోపాటు దేశంలోని 160 కాలేజీలు, యూనివర్సిటీలకు చెందిన వెయ్యి మందికిపైగా విదేశీ విద్యార్థుల వీసాలను అమెరికా అధికారులు రద్దు చేశారు. ఇలా వీసా రద్దైన వారిలో భారతీయులే ఎక్కువమంది ఉన్నారు. వీసాల రద్దు లేదా స్టూడెంట్ అండ్ ఎక్స్‌చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సెవీస్) రికార్డుల నుంచి తొలగింపునకు గురైన అంతర్జాతీయ విద్యార్థులలో దాదాపు 50 శాతం మంది భారతీయులేనని అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్(ఏఐఎల్‌ఏ) వెల్లడించింది.

## ముగిసిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రధాన పరీక్షలు

### 31 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు: మొదటి సంవత్సరంలో 90 శాతం.. ద్వితీయ సంవత్సరంలో 89 శాతం హాజరు: ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 22 నుంచి ప్రారంభమైన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రధాన పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఇప్పటి వరకు జరిగిన పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్టు అధికారులు ప్రకటించారు. ఆరో రోజైన మంగళవారం జరిగిన పరీక్షల్లో మొదటి సంవత్సరం పరీక్షల్లో 21 మాల్‌ప్రాక్టీస్ కేసులు, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 10 కేసులు నమోదైనట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాదిమార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఫెయిలైన వారికి.. మొదటి సంవత్సరంలో ఇంప్రూవ్‌మెంట్ కోసం పరీక్షలు రాసే వారికోసం నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 22 రాష్ట్ర వ్యాప్తంగా 892 పరీక్షా కేంద్రాల్లో కొనసాగుతున్నాయి. ఉదయం మొదటి సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతు న్నాయి. ఆరో రోజైన మంగళవారం ఉదయం జరిగిన మొదటి సంవత్సరం కెమిస్ట్రీ పేపర్-1, కామర్స్ పేపర్-1కి సెట్ సిని ఎంపిక చేశారు. పరీక్షలకి 1,58,320 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1,43,541 మంది(90.66 శాతం) పరీక్షకు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 21మాల్ ప్రాక్టీస్ కేసులు నమోద య్యాయి. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ కెమిస్ట్రీపేపర్-2, కామర్స్ పేపర్-2కి కూడా సెట్ ఏనిఎంపిక చేశారు. పరీక్షలకి 47,972 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 42,686మంది(89 శాతం) పరీక్షకు హాజరయ్యారు. సెకండియర్‌లో 10మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైనట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు.

# హెచ్‌సిఎ పెద్దల అక్రమాలు నిజమే

## గోల్‌మాల్‌పై సర్కారుకు అందిన విజిలెన్స్ నివేదిక

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)లో జరిగిన గోల్‌మాల్ వ్యవహారాలపై విచారణ జరిపిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తన నివేదికను మంగళవారం ప్రభుత్వానికి అందజేసింది. కాగా ఈ నివేదికలో ఐపిఎల్ జట్టు యాజమాన్యం హైదరాబాద్ సన్ రైజర్స్‌తో హెచ్‌సిఎ పెద్దలు కావాలనే విబేధాలు పెట్టుకుని బ్లాక్ మెయిల్‌కు పాల్పడినట్లు వున్నట్లు సమాచారం. హెచ్‌సిఎతో విబేధాలు రావడంతో హైదరాబాద్ సన్ రైజర్స్ యాజమాన్యం వున్న పళంగా హైదరాబాద్‌ను వీడి మరో నగరానికి వెళ్లేందుకు సిద్ధపడడం తెలిసిందే. ఈ మేరకు హెచ్‌సిఎ రాసిన లేఖ బయటకు రావడం సంచ లనం రేపింది. హైదరాబాద్ సన్ రైజర్స్ యాజమాన్యం లేఖ బయటకు రావడంతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ రంగంలో దిగి ఈ జట్టును ఎపికి రావాలని కోరడం గమనార్హం. నిబంధనల మేరకు పది శాతం టికెట్లు (3900 టికెట్లు) హెచ్‌సిఎకు ఉచితంగా అందజేస్తున్నా మరో పది శాతం టికెట్లు కూడా ఉచితంగా ఇవ్వాలని హెచ్‌సిఎ పెద్దలు బ్లాక్ మెయిల్ చేశారని, ఈ విషయంలో హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు వ్యవహారశైలి తమను తీవ్రంగా ఇబ్బందులకు గురిచే సిందని హైదరాబాద్ సన్ రైజర్స్ అధిపతి కావ్య మారన్ తన లేఖలో వెల్లడించారు. ఈ క్రమంలో ఉప్పల్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన ఐపిఎల్ మ్యాచ్ సందర్భంగా విఐపి గ్యాలరీకి తాళం వేశారని, ఇది తమను తీవ్ర అసౌకర్యానికి గురిచేసిందని కావ్య మారన్ తెలిపారు. ఈ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సం చలనం రేపడంతో హెచ్‌సిఎ గోల్‌మాల్‌పై విచారణ చేయాలని సర్కారు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను ఆదేశించింది. సర్కారు రంగంలో దిగడంతో హెచ్‌సిఎ పెద్దలు వెంటనే దిద్దుబాటు చర్యలకు దిగి హైదరాబాద్ సన్‌రైజర్స్‌తో రాజీ కుదుర్చుకున్నారు. మరోవైపు సర్కారు ఆదేశాల దరిమిలా ఈ విభాగం డిజి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి హెచ్‌సిఎ అక్రమాలపై విచారణ చేసేందుకు ఉప్పల్ స్టేడియంను సందర్శించి, అక్కడి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సన్‌రైజర్స్ యాజమాన్యం తరపున కొందరు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను కలిసి హెచ్‌సిఎ వల్ల తాము పడ్డ ఇబ్బందులను వివరించారు. వీటన్నింటి పై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కారుకు నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో ఏమున్నదనే విషయాలను అధికారులు వెల్లడించేందుకు నిరాకరించారు. అయి తే హెచ్‌సిఎ అక్రమాలపై అనేక అంశాలు ఇందులో వున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఐపిఎల్ ఫ్రాంచైజ్ హైదరాబాద్ సన్ రైజర్స్‌తో హెచ్‌సిఎ ప్రవర్తన సరిగ్గా లేదని అందులో వుందని తెలిసింది. హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు అక్రమాలకు పాల్పడినట్లు ఆ నివేదికలో వుందని తెలిసింది. ఈ నివేదికపై సర్కారు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.



వినతి పత్రాన్ని ప్రదర్శిస్తున్న తెలంగాణ ఉద్యమ కారులు

## తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలి

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 27 ప్రభాతవార్త:** గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం 250 గజాల ఇంటి స్థలాన్ని, పెన్షన్ కల్పించాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఈ ఆరు గ్యారంటీల హామీలను వచ్చే జూన్ రెండోవ తేదీలోగా ప్రారంభించాలని ఫోరం నాయకులు కోరారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పటేళ్ళ సురేందర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో తాము కీలక పాత్ర పోషించామని, గత ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకోకపోవడంతో కా ంగ్రెస్ పార్టీ విజయం కోసం ఎంతో కృషి చేశారని చెప్పారు. ఉద్యమ కారులను గుర్తించడానికి ఒక కమిటీని నియమించాలని, ఉద్యమ కారులకు గుర్తింపు కార్డులు పంపిణిచేయాలని, సంక్షేమ పథకాల్లో, ఇందిరమ్మ ఇళ్ళలో, రాజీవ్ యువవికాస్‌లో ఉద్యమకారులకు20శాతం కోటా కేటాయించాలని, సంక్షేమబోర్డును ఏర్పాటు చేసి పది వేల కోట్లు కేటాయించాలని, తెలంగాణసాంస్కృతిక విభాగంలో 1000 ఉద్యోగా లకు కల్పించి, ఉద్యమకారులకు అవకాశం కల్పించాలని వారు కోరారు.

## భారత్‌కు పాక్, చైనాలనుంచే అధిక ముప్పు

### అమెరికా నివేదికలో హెచ్చరికలు



**న్యూఢిల్లీ, మే 27:** ప్రపంచానికి ఎదురవుతున్న ముప్పులపై అమెరికా ఇంటెలిజెన్స్ ప్రత్యేక నివేదిక విడుదలచేసింది. ఈ నివేదికలో యుఎస్ ఇంటెలిజెన్స్ ఇండియాకు డేంజర్ బెల్స్ మోగించింది. చైనా, పాకిస్తాన్ నుంచి ఇండియాకు ముప్పు పొంచి ఉందని హెచ్చరించింది. భారత్ ఎదుర్కొంటున్న రెండు ముఖ్యమైన భద్రతా సవాళ్లను కూడా ప్రస్తావించింది. చైనా, పాక్ దేశాలు భారత్‌కు వ్యతిరేకంగా తమ సైనిక సామర్థ్యాలను ఆధునీకరించడానికి, విస్తరించడానికి చేస్తున్న ప్రయత్నాలను నొక్కి చెప్పింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత వచ్చిన ఈ నివేదిక భారత్ అభివృద్ధి చెందుతున్న రక్షణ వైఖరిని అంచనా వేసింది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత్ ప్రపంచ స్థాయిని బలోపేతం చేయడం, దాని సైనిక బలాన్ని బలోపేతం చేయడం, చైనా పెరుగుతున్న ప్రభావాన్ని ఎదుర్కోవడంపై దృష్టి పెట్టే అవకాశం ఉందని ఇది పేర్కొంది. భారత్ చైనాను తన ప్రాథమిక వ్యూహాత్మక శత్రువుగా చూస్తున్నదని, ఇటీవల సరిహద్దు శత్రుత్వాలు ఉన్నప్పటికీ పాకిస్తాన్‌ను మాత్రం నిరంతర శత్రువుగా పరిగణిస్తున్నట్లు యుఎస్ నివేదిక పేర్కొంది. సరిహద్దు ఉద్రిక్తతలను నిర్వహించడం, తెహ్రీక్ఇ తాలిబన్ పాకిస్తాన్, బలూచ్ తిరుగుబాటుదారుల వంటి సమూహాల నుండి దేశీయ ఉగ్రవాద ముప్పులను ఎదుర్కోవడం, దాని అణ్వాయుధ సామర్థ్యాలను అభివృద్ధి చేయడం వంటి రాబోయే సంవత్సరంలో పాకిస్తాన్ కీలకమైన రక్షణ ప్రాధాన్యతలను అమలుచేస్తున్నదని భారత్‌కు సూచించింది. 2024లో మాత్రమే ఉగ్రవాద దాడుల వల్ల పాకిస్తాన్ అంతటా 2,500 మందికి పైగా మరణించారు. పాకిస్తాన్ భారతదేశాన్ని ఒక ప్రాథమిక ముప్పుగా చూస్తూనే ఉంది. అందువల్ల భారత్‌ను ఎదుర్కోవడానికి వ్యూహాత్మక అణ్వాయుధాల అభివృద్ధితో సహా దాని అణ్వాయుధ వ్యూహాన్ని మెరుగుపరచడానికి ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. చైనా, యూఏఈ, టర్కీ, హాంకాంగ్, సింగపూర్ వంటి ఇతర మధ్యవర్తిత్వ దేశాలతో అనుసంధానించిన నెట్‌వర్క్‌ల ద్వారా పాకిస్తాన్ తనకు అవసరమైన వనరులు పొందే అవకాశాలు ఎక్కువని ఇలా జరిగితే భారత్‌కే ఎక్కువ ముప్పు అని తేల్చింది. చైనా తన సైన్యాన్ని భూమి, వాయు, సముద్రం, సైబర్, అంతరిక్షం వంటి అన్ని రంగాలలో వేగంగా అప్‌గ్రేడ్ చేస్తోంది. తూర్పు ఆసియాలో ఆధిపత్యాన్ని సాధించడం, తైవాన్‌ను ప్రధాన భూభాగంతో ఏకం చేయడం, ప్రపంచ స్థాయిలో అమెరికాను సవాలు చేయడం బీజింగ్ లక్ష్యం అమెరికా వేగులు చెపుతున్నారు. చైనా అణ్వాయుధాల నిల్వలు 600 ఆపరేషనల్ వార్‌హెడ్‌లను అధిగమించాయని, 2030 నాటికి 1,000 దాటుతుందని అంచనా వేసింది. ఉపగ్రహ, నిఘా వ్యవస్థలలో అమెరికా ఆధిపత్యాన్ని దెబ్బతీసేందుకు ఆ దేశం అంతరిక్ష ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాలలో కూడా భారీగా పెట్టుబడులు పెడుతోంది. చైనా, పాకిస్తాన్ రెండూ కీలకమైన భౌగోళిక రాజకీయ ఘర్షణ కేంద్రాలుగా కొనసాగుతున్నాయని, రాబోయే సంవత్సరాల్లో ప్రాంతీయ, ప్రపంచ భద్రతా గతిశక్తిని గణనీయంగా మార్చివేస్తాయని అమెరికి నిఘా సంస్థ తాజానివేదిక స్పష్టం చేస్తోంది.

## మావోయిస్టులను చంపి విజయంగా భావించడం సిగ్గుచేటు

### దేశాన్ని పాలించే నైతిక హక్కు బిజెపికి లేదు:వామపక్షాల నాయకులు, శాంతి చర్చల సంఘం నేతలు

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** దేశంలో ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను చంపి అదే తమ విజయంగా కేంద్రంలోని ప్రభుత్వం భావించడం సిగ్గుచేటని వామపక్ష పార్టీల నేతలు, శాంతి చర్చల సంఘం నేతలు అన్నారు. మావోయిస్టుల ఉద్యమం అంటేనే భయపడిన ప్రధానమంత్రి నరేంద్రమోడి, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చివరికి వారి శవాలను చూసి కూడా వణికి పోతున్నారని, అలాంటి వారికి ఈ దేశాన్ని పాలించే నైతిక హక్కు లేదని వామపక్షాల పార్టీల నాయకులు, శాంతి చర్చల సంఘం నేతలు అన్నారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావో యిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ రావుతో పాటు మరో ఆరు మంది మావో యిస్టుల మృత దేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా పోలీసులే దహనం చేయడాన్ని పార్టీలు, సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో మంగళ వారం ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, శాంతి చర్చల కమిటీ నాయకులు జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, చలపతి (సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ), సిహెచ్ మురహరి(ఎస్‌యుసిఐ). సుధాకర్(ఎంసిపిఐ (యు), హమ్మేష్ (మాస్‌లైన్), జానకిరామ్ ఆర్ ఎస్‌పి పాల్గొన్నారు. ఎన్ కౌంటర్లో చనిపోయిన మావోస్టుల మృత దేహాలను కుటుంబ సభ్యు లకు అప్పగించకుండా పోలీసులే దహన సంస్కా రాలు నిర్వహించడం అమానవీయమన్నారు. సుప్రీం కోర్టు వాటిని సుమోటాగా స్వీకరించి న్యాయ విచారణకు అదేశాలని కోరారు. ఎన్‌కౌంటర్ల పేరుతోమావోయిస్టులను చంపివేయడంమావోయిస్టులకు, ప్రభుత్వానికి ఏమి తేడా ఉందని కూనంనేని ప్రశ్నించారు.



మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ మావోయిస్టులు మృత దేహాలను ఏ ప్రమాణాలు పాటించి పోలీసులే దహనం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల ఉద్యమం ఇప్పటిది కాదని, 200 ఏళ్ల నుంచి ఉందని ఆయన గుర్తు చేశారు. సిపిఐఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జానీ వెస్లీ మాట్లాడుతూ ఆదివాసీలను, మహిళలను మావోయిస్టు లను అక్రమంగా చంపివేసి కేంద్ర బలగా లు నృత్యాలు చేయిస్తుంటే దేశప్రధాని, హోం మంత్రిలు హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు చేసు కోవడం ఇది ఏపాలనకు నిదర్శనమని ప్రశ్నించారు. ఆదివాసీల సమస్యలను పరిష్కరిం చుకుం డా మావోయిస్టులను చంపివేసి అటవి సంపదను కార్పోరేట్‌శక్తులకు అప్పగించడాన్ని చేస్తున్న కుట్రలను ఆపాలని ట్రంప్ చెప్పితే తప్ప కేంద్ర ప్రభుత్వం ఆపలేదని ఎద్దేవా చేశారు.

## విద్యుత్ చీఫ్ విజిలెన్స్ అధికారిగా ప్రియదర్శిని

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** విద్యుత్ శాఖ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా ఆ శాఖ డిప్యూటీ సెక్రటరీ ఎస్ ప్రియదర్శిని నియమించింది. ఈ మేరకు విద్యుత్‌శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకూ చీఫ్ విజిలెన్స్ అధికారిగా శారదాబాయి వ్యవహరించగా ఆమె బదిలీ అయ్యారు. దీంతో తాజాగా ప్రియదర్శినిని నియమించారు. మరోపక్క తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లకు 1,900 కోట్ల రూపాయల మేర నిధులను మంజూరు చేసింది. గృహజ్యోతి సబ్సిడీ కింద ఆయా మొత్తాన్ని విడుదల చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పచ్చిరొట్ట విత్తనాల సరఫరా: మంత్రి తుమ్మల

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పచ్చిరొట్ట విత్తనాల సరఫరా చేస్తున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఇందు కోసం ముందస్తుగానే ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలంగాణ సీడ్స్ కార్పోరేషన్‌కు 90 వేల క్వింటాళ్ళు, నేషనల్ సీడ్ కార్పోరేషన్ కు 40 వేల క్వింటాళ్లకు ఇండెంట్ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే రాష్ట్రంలోని 20 జిల్లాలు టిజి సీడ్స్‌కు, మరో 12 జిల్లాలు నేషనల్ సీడ్ కార్పోరేషన్‌కు కేటాయించడం జరిగిందని వివరించారు. ఈ నేపథ్యంలో సీడ్ కార్పోరేషన్ ఇప్పటివరకు 71,535 క్వింటాళ్లను తెప్పించి వారికి కేటాయించిన 20 జిల్లాలలో పంపిణీ ఆరంభించినట్లు వెల్లడించారు.


BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II
1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, AT : HYDERABAD
O.A. No. 280 OF 2025

BETWEEN :
ICICI BANK LIMITED ...Applicant
AND
M/S. SEETHARAMA FERTILIZERS AND GENERAL MERCHANT AND OTHERS ...Defendant(s)

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
1. M/s. Seetharama Fertilizers and General Merchant, Represented by its Manager, Mannam Malayadri S/o. Malakondaiah Mannam, Office Address: 9/310, J.P. Road, Nereducherla, Suryapet, Telangana.
2. Mannam Malayadri S/o. Malakondaiah Mannam, aged: 56 years, Occ: Business, R/o. 10-28, Janapahad Road, Nereducherla, Nereducherla Mandal, Nalgonda District, Telangana.
3. R. Peda Venkatnarsaiah S/o. Ramaiah Ravulapally, aged about 79 years, Occ: Business, R/o. 9-331, Neredcherla Municipality, Nalgonda, Near Venkatarama Theatre, Nalgonda, Telangana. (Co-Applicant) ....Defendants

Please take the summons in the above O.A.No. 280 of 2025 filed by the Applicant for Recovery of money Rs.34,84,882/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VARTHA" a Telugu Daily newspaper, and posted the matter on 20.06.2025.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants, are directed as under:
i) To show cause, within thirty days of the service of summons as to why the relief prayed for should not be granted;
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application;
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
v) You shall be liable to account for the sale proceeds realized by the sale of secured assets of other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 20.06.2025 at 10.30 am at Debts Recovery Tribunal-II, 1st floor, Triveni Complex, Abids, Hyderabad- 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default, the Application will be heard and determined in your absence.
20th day of May, 2025.

(By order of the Court)
Registrar
Debts Recovery Tribunal- II
Hyderabad



एनएमडीसी

Responsible Mining, Viksit Bharat

NMDC Limited
(A Govt. of India Enterprise)
CIN: L13100TG1958GOI001674

EXTRACT OF AUDITED STANDALONE & CONSOLIDATED FINANCIAL RESULTS FOR THE QUARTER AND YEAR ENDED 31ST MARCH, 2025

Pursuant to regulation 47 of the SEBI (Listing obligations and disclosure requirement) Regulations, 2015


The result can be accessed through the following link
https://www.nmdc.co.in/cms-admin/Upload/Financial_Result_Document/f8b169e0d6d34490ab8104c93922972a_20250527195410900.pdf
or scan

by order of the Board
NMDC Limited
sd/-
(Amitava Mukherjee)
Chairman-Cum-Managing Director
Din NO. 08265207

Date: 27/May/2025 Place: Hyderabad

(STANDALONE)

| QUARTERLY HIGHLIGHTS | YEAR ENDED HIGHLIGHTS |
|---|---|
| 1496 Cr. PAT | 6693 Cr. PAT |
| 6953 Cr. Turnover | 23668 Cr. Turnover |
| 13.31 MnT Production | 44.07 MnT Production |
| 12.67 MnT Sales | 44.40 MnT Sales |



HEAD OFFICE: KHANIJ BHAVAN, MASAB TANK, HYDERABAD - 500028, INDIA. | /nmdclimited | nmdc.co.in

వార్త

అభిప్రాయాలను మార్చుకోలేని వ్యక్తి తన తప్పుల్ని సరిదిద్దుకోలేడు. నేటి కంటే రేపు ఎక్కువ వివేకం ప్రదర్శించాలనుకుంటే మనిషిలో మార్పు అవసరం.

-ఎడ్వర్డ్

# ప్రాణాలు తీస్తున్న 'నకిలీ'లు

జనారోగ్యమే జాతిమహాభాగ్యమనే ఆశయం, లక్ష్యంకోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని, దేశ ప్రజలందరికి వైద్యసేవలు అందుబాటులోకి తెస్తామని, పాలకులు ఇంతగా చెబుతున్నా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్నో లక్షలకోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా ఆశించిన ఫలితాలు చేకూరడం లేదు. దేశానికి పట్టుగొమ్మలైన గ్రామసీమల్లో ఆరోగ్య పరిస్థితి ఆందోళన కరంగానే ఉందని చెప్పొచ్చు. అందరికి వైద్యం అనేది ఇప్పటికీ కనుచూపుమేరలో కన్పించడం లేదు. నేటికీ భారత్‌లో దాదాపు నలభైఏడు కోట్ల మందికి అత్యవసర మందులు అందుబాటులో లేవని అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. అన్నింటి కంటే ముఖ్యంగా దేశంలో దిగువ, మధ్యతరగతి పెట్టే ఖర్చులో దాదాపు డెబ్బై శాతంపైగా మందుల కొనుగోళ్లకే ఖర్చు చేస్తున్నారు. ప్రధానంగా మందుల్లో నాసిరకం, నకిలీవి కూడా జనారోగ్యాన్ని పతనం అంచుకు తీసుకుపోతున్నాయి. దేశ వ్యాప్తంగాసుమారు ఇరవైఐదువేల రకాలకుపైగా మందులు నమోదై ఉంటే అందుకు రెట్టింపు స్థాయిలో అనధికారికంగా చెలామణి అవుతున్నాయి. నకిలీ, నాణ్యత లేని మందులు విచ్చల విడిగా సరఫరా చేస్తున్నారు. ప్రజారోగ్యాన్నిగుల్లచేస్తున్న ఈనకిలీ మందులను ఒక వ్యూహం ప్రకారం ప్రవేశపెడు తున్నారు. మందుల్లో ప్రామాణికత దెబ్బతినడం వల్ల చోటు చేసుకుంటున్న అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. గతంలో ముంబాయిలో ఇలాంటి నకిలీ మందులు వాడడంతో డజన్ మందికిపైగా మరణించడంతో ఆనాటి ప్రభుత్వం జస్టిస్ లెంటిన్ కమిషన్‌ను నియమించింది. మంత్రిత్వస్థాయి మొదలు దిగువ స్థాయి వరకు ఆరోగ్య, ఔషధవిభాగాల్లోని లొసుగులను వైఫల్యాలను, అవినీతిని ఎత్తి చూపుతూ జిస్టస్‌లెంటిన్ తన నివేదికలో ఆనాడే స్పష్టం చేశారు. ఆ నివేదికలు చేసిన ప్రతిపాదనలను పట్టించుకోలేదనేచెప్పొచ్చు. నకిలీమందుల వల్ల కలిగే దుష్ప్రభావాలు అటుంచి జబ్బు తగ్గకపోతే వైద్యుడివైఫల్యమా, ఉపయోగించిన మందులు కారణమా అర్థంకాక, వైద్యులు మళ్లీ మళ్లీ పరీక్షలు చేయిస్తూ ఇతర మందులతో రోగాలపై ప్రయోగాలు చేస్తున్నారు. దానివల్ల ఆరోగ్యంతోపాటు ఆర్థికంగా కూడా కుప్పకూలిపోతున్నారు. అసలు వైద్య ఆరోగ్య విషయంలో నిర్దిష్టమైన ప్రణాళిక, ముందు చూపు లేకపోవడం వల్లనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయి. దేశంలో ఇటీవల కాలంలో విస్తరిస్తున్న విషజ్వరాలు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రధానంగా డెంగ్యూవ్యాధి ప్రబలిపోతున్నట్లు వార్తలు అందుతున్నాయి. భారతదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధి మానవాళిపై పంజా విప్పుతున్నది. యేటా దాదాపు నలభైకోట్ల మందికిపైగా ఈ వ్యాధిబారినపడుతున్నారని, అందులో నలభైవేల మందికి పైగా అసువులు బాస్తున్నట్లు అంచనా. ఆసియా ఖండంలోనే ఇది ఎక్కువగా విస్తరిస్తున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా కూడా అన్ని రాష్ట్రాల్లోనూ విస్తరిస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో డెంగూ వ్యాధిని సకాలంలో గుర్తించలేకపోతున్నారు.ఫలితంగా అదిముదిరి ప్రాణాలకు ముప్పు తెస్తున్నది. ముఖ్యంగా డెంగ్యూవ్యాధికి ఇప్పటికీ ఔషధం, టీకా లేకపోవడంతో విస్తరణను అడ్డుకోలేకపోతున్నారు. ఇంకా ఈవ్యాధితోపాటుస్వైన్‌ఫ్లూ, చికెన్‌గున్యాలాంటి వ్యాధులు ప్రబలిపోతున్నాయి. అందుకు తగినట్లుగా ఆస్పత్రులు కానీ, సిబ్బంది కానీ లేరనే చెప్పొచ్చు. దారిద్ర్యరేఖకు దిగువనున్న బడుగువర్గాల కుటుంబాలకు కనీస వైద్యం కూడా అందుబాటులో ఉండడం లేదు. దీంతో గ్రామాల్లో వచ్చీరాని వైద్యంతో డాక్టర్లుగా చెలామణిఅవుతూ మందులుఇచ్చేవారు కూడా తక్కువ సంఖ్యలోలేరు. మొన్న నల్గొండ జిల్లాలో జరిగిన వైద్య అధికారుల ఆకస్మిక తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఏమాత్రం అనుమతులు, అర్హతలు లేకుండానే ఆస్పత్రులు నడుపుతున్నట్లు బయటపడింది. కొన్నిప్రాంతాల్లో కనీసం మందుల పేర్లు రాయలేనివారు కూడా డాక్టర్ల జాబితాలో చేరిపోతున్నారు. చిన్న చిన్న ఆపరేషన్లు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. అర్హత లేని వైద్యులుచేసే ఇలాంటి చికిత్సల్లో కొన్ని సందర్భాల్లో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ పరిస్థితి అంతకంతకు పెరుగుతుండడం ఆందోళన కలిగించేఅంశం. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. వర్షాకాలం వస్తుం దంటేనేవారి పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటుంది. అందు బాటులో ఉన్న నాటు వైద్యం, పసర్లు, వేర్లతోనే వైద్యం చేసుకుంటున్నారు. గిరిజనప్రాంతాల్లో డాక్టర్లను,సిబ్బందిని నియమించినా అక్కడికి వారిని పంపడంలో పాలకులు విఫలమవుతున్నారనే ఆరోపణలువస్తున్నాయి. వీటన్నింటిని మించి మందులు, సిబ్బంది కొరత తీవ్రంగానే ఉంది. ప్రపంచఆరోగ్య సంస్థ గతంలో విడుదలచేసిన నివేదికప్రకారం అల్లోపతి వైద్యం చేసేవారిలో యాభైఏడు శాతానికిపైగా అర్హతులు లేవని బయటపడింది. అలాగే వైద్యులుగా చెలామణి అవుతున్న వారిలో 18.8శాతంమంది మాత్రమే అర్హత ఉన్నట్లు వెలుగు చూసింది. అల్లోపతితోపాటు హోమియోపతి, ఆయుర్వేదం, యూనాని, సిద్ధ, యోగా, విధానాల్లో వైద్యులతో కలిపి భారత్‌లో లక్ష జనాభాకు కేవలం ఎనభై మంది మాత్రమే ఉన్న వారిలో సంబంధిత పట్టా కలిగిన వారు ముప్పైఆరు శాతం మాత్రమే. రాబోయే రోజుల్లో ప్రజారోగ్యం అత్యంత క్లిష్ట పరిస్థితి ఎదుర్కోబోతున్నట్లు వైద్య నిపుణులే అభిప్రాయపడుతున్నారు. పాలకులు ఇప్పటికైనా గత అనుభవాలతో పాఠాలు నేర్చుకొని ప్రజారోగ్యం ఎదుర్కోబోతున్న సవాళ్లకు అనుగుణంగా సమయాత్తం కావాలి.

ఏకాగ్రత యుద్ధంలో బలానికి రహస్యం. ఇదే మాట మనుషుల అన్ని వ్యవహారిక పోరాటాలకీ వర్తిస్తుంది.



ఎమర్సన్

ప్రపంచంలోని మేధావులందరికన్నా ఒక మంచి అంతరాత్మ గల వ్యక్తి గొప్పవాడు.



బల్వర్‌లిటన్

## ప్రజావాక్కు



### రైలు ప్రయాణం సులభతరం

**కొవ్వూరు** రాజమండ్రిల మధ్య గోదావరి నదిపై దాదాపు మూడు కిలోమీటర్ల పొడవు కలిగిన రైల్ కమ్ రోడ్ బ్రిడ్జిని 1974లో అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్‌అలీ అహ్మద్ ప్రారంభోత్సవం చేసి ఈ నవంబరుకు యాభైఏళ్లు పూర్తి అయింది. దీనివల్లరైళ్ల రాకపోకలుక్రమబద్ధీకరణ జరిగింది. అంతకు ముందు బ్రిటిష్ వారు దాదాపు 150 ఏళ్లక్రితం కొవ్వూరు గోదావరి స్టేషన్ల మధ్య నిర్మించిన హేవలాక్ బ్రిడ్జిని మూసివేసిన తరువాత బాణం ఆకారంలో కట్టిన బ్రిడ్జ్‌వల్ల రైలు ప్రయాణం మాత్రమే చేయవలసి వచ్చేది. రైల్‌కమ్ రోడ్డుబ్రిడ్జివల్ల ప్రయాణాలు ఇంకా సులభతరం అయింది. ఇంతకు ముందు రావులపాలెంద్వారా రాజమండ్రి వైపువెళ్లవలసి వచ్చేది. ప్రతీ ఏటా వీటి నిర్వహణ తప్పక చేయాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### తల్లిదండ్రులు ఆలోచించండి

**యూ ట్యూబ్‌లు** ఇన్‌స్టాగ్రామ్‌లు మనుషులనెలా ప్రభావితం చేస్తున్నాయో చెప్పడంలో మంచి కన్నా చెడు ఎక్కువ అనే మాట వినిపించడం చూస్తున్నాం. కుటుంబాల వీడియోలు కూడా ఎంతో అసభ్య పదజాలాలతో చెత్త డైలాగ్స్‌తో ఇంస్టాగ్రామ్‌లో పెట్టేస్తున్నారు. ఆడపాదడపా ఏవో కొన్ని తప్పా. పెద్దలే ఇటువంటి ఇంస్టాలు పెట్టేసి ఆనందం పొందుతుంటే ఇక యవ్వనంలో అడుగిడిన యువకులు, విద్యార్థుల మానసిక అల్లకల్లోలం ఎంతటి శారీరక మానసిక దౌర్బల్యానికి దారితీస్తుందో సంఘం ఊహిస్తోందా. ఇటువంటి వాటిని మీడియాలో రానివ్వకుండా ఒక స్పెషల్ సెల్ ఏర్పాటు చేసి సెన్సార్ చేసే కట్టుదిట్టాలు రావాలి. లేదా త్వరలో ఫోర్న్ మూవీస్ రావడంలో సందేహం లేదు. దిగజారిపోయేది పిల్లలే. తల్లిదండ్రుల్లారా ఆలోచించండి.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### ధరలను తగ్గించాలి

**ఇవాళ** ప్రతి వస్తువుల ధరలు పెరిగిపోతూనే ఉన్నాయి. అన్నింటిపై పన్నుల భారం పెంచుతూనే ఉన్నారు. ఇలా అన్నింటిపై ధరలు పెంచుకుంటూపోతే సామాన్యుడు ఎలా బతకాలో ఎవరూ ఆలోచించడం లేదు. పెరుగుతున్న ధరలను అదుపులో ఉంచడానికి ఏ మార్గాలు లేవా? పాలకులు మేధావులు ఆలోచించాలి.

-ఎస్. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### ట్రాఫిక్ సమస్యలను అధిగమించాలి

**చాలా** ఏళ్ల కిందట ప్రభుత్వం ఎన్నో కోట్ల రూపాయలు వెచ్చించి తార్నాక కూడలివద్ద ఒక సన్న ఫ్లైఓవర్ కట్టింది. ఇది మెట్టుగూడా నుండి హబ్సిగూడ వెళ్లే బళ్లు కూడలి దగ్గర ఆగకుండా వెళ్లడానికి అవకాశం వుంది. దీని వల్ల ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి లాలాపేట వెళ్లే బళ్లు ఫ్లైఓవర్ కిందనుంచి నేరుగా వెళ్ళొచ్చు. కానీ ఈ బళ్ళని తిన్నగా వెళ్లనివ్వట్లేదు. ఉస్మానియా నుంచి లలాపేట వెళ్ళే బళ్లు మెట్టిగూడ వెపు వెళ్లి మెట్రో స్టేషన్ తరువాత గీ టర్న్ తీసుకుని తిరిగి కూడలి వద్దకు వచ్చి లాలపేట వెళ్ళాలి. దీనితో టర్నింగ్ పాయింట్ వద్ద ట్రాఫిక్ జామ్‌ఎంతో అమూల్యమైన పెట్రోల్ వృధా. ట్రాఫిక్ పోలీసులు దీనిని గమనించి ఫ్లైఓవర్ కింద నుంచి బళ్ళను నేరుగా వెళ్లేందుకు అనుమతించాలి.

- నరసింహా, లాలాపేట

### పాత పద్ధతులే మేలు

**ప్రైవేట్,** కార్పొరేట్ టీచర్ల కంటే ప్రతిభ ఎక్కువ నైపుణ్యాలున్న ప్రభుత్వ పాఠశాల టీచర్లు తెలుగు మీడియం ప్రోత్సహించడం దురదృష్టకరం. ప్రపంచం ఎలా పరుగులు పెడితే మనం అలా పరుగులు పెట్టాల్సిందే. ఆ రోజుల్లో కూడా స్కూల్ అవర్స్ అయిపోయిన తర్వాత విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయుల ఇల్లలోనే ఉండేవారు. ప్రైవేట్ చెప్పడానికి టీచర్లు గ్రామాల్లో ఉండేవారు. విద్యార్థినీ విద్యార్థులు రాత్రి పడుకోవడానికి మాత్రమే గ్రామాల్లో ఇళ్లకు చేరుకునేవారు. ప్రతి సబ్జెక్టు వంద మార్కులకు ఉండాలి. పాస్‌మార్క్ కనీసం నలభైశాతం కావాలి. చూసి రాతవిధానాలను ప్రోత్సహించకూడదు. లాంగ్వేజ్‌లకు సంబంధించి మూడులాంగ్వేజ్‌లు కూడా పాత పద్ధతిలో కాంప్రహెన్షన్, కాంపొజిషన్‌తోపాటు బైహార్ట్ చేసేటటువంటివి ఉండాలి.

-వీరగంట భాస్కర్ రావు, హైదరాబాద్

### పింఛను పంపిణీలో మార్పు రావాలి

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రంలో ఏకారణం చేతనయినా ఒక నెల వితంతు పింఛను స్వయంగా తీసుకొనకపోతే మరుసటి నెలలో బాకీ పడిన దానికి తీసుకునే అర్హతను కోల్పోతారు. రెండు నెలలు ఏకారణం చేతనయినా తీసుకోనట్లయితే మూడవ నెలలో మొత్తం ఇస్తామని సిఎం చెప్పినట్టు గుర్తు. ఏ కారణం చేతనైనా ఆస్పత్రిలో ఉండాల్సి వచ్చి ఆ నెల పింఛను తీసుకోలేని పరిస్థితులో ఉంటే మరుసటి నెల పింఛను మాత్రమే ఇస్తున్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి స్పందించాలి.

- ఎన్.నాగరాజు, విజయవాడ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఫీజుల పెంపుపై నియంత్రణేది?

*విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే ప్రభుత్వ పరంగా ఓ ప్రకటన విడుదల చేయాలి. జీవో నెంబర్ 42 ప్రకారం ఫీజులను పెంచాలంటే జిల్లా ఫీజ్ రెగ్యులేషన్ కమిటీ అనుమతి తీసుకోవాలి. రోజు రోజు ఫీజులు పెంచుతున్నారు తప్ప తగ్గించడం లేదు.ఫీజుల నియంత్రణ,టీచర్ల నియామకం,డొనేషన్ల వసూలు వంటి అంశాల్లో విద్యా హక్కు చట్టం చాలా స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిన వాటిని పాటించడం చాలాప్రైవేట్ పాఠశాలల్లో కనిపించడంలేదు. చట్టాన్ని ఉల్లంఘిస్తే భారీగా జరిమానాలు విధించేలా చర్యలు తీసుకోవాలని విద్యానిపుణులు డిమాండ్ చేస్తున్నారు. ప్రవేశ పరీక్షల పేరుతో డొనేషన్లు వసూలు చేస్తే రూ. 25,000నుండి రూ.50,000 వరకు జరిమానావిధించేలా చట్టంలో ప్రొవిజన్స్ ఉన్నాయి. అంతేకాకుండా ప్రతి ప్రైవేట్ పాఠశాలలో కనీసం 25 శాతం సీట్లు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలన్న నిబంధన విద్యాహక్కు చట్టంలో ఉంది.కానీ దీనిపై కూడా పర్యవేక్షణ లేదు. ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి.*

డాక్టర్ మోటె చిరంజీవి

ప్రైవేటు బడి ఫీజు భారమైంది. అక్షరాలు దిద్దించడానికే లక్షలు దాటింది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా స్కూల్ ఫీజులు గణనీయంగా పెరిగాయి. 5శాతం దాటని ధనవంతుల సంగతి పక్కనపెడితే మిగతా 95శాతం మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కుటుంబాలు ఈ ఆర్థిక భారం మోయలేక పిల్లలకు మంచి చదువులు చెప్పించలేక మనోవేదనకు గురవుతున్నారు. బెంగళూరు నుంచి ఢిల్లీ వరకు సర్వాత్రా ఇదే పరిస్థితి.ముఖ్యంగా గత మూడేళ్లలో స్కూల్ ఫీజులు అనేక రెట్లు పెరిగాయని స్కూల్ పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా పాఠశాల ఫీజులు మూడు ఏళ్లలోనే 50 నుంచి 80 శాతం పెరిగాయని తాజా జాతీయ సర్వే సైతం నిర్ధారించింది. స్కూల్ ఫీజులపై ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో ప్రైవేట్ స్కూల్ యాజమన్యాలు ఇష్టారీతిగా యేటా ఫీజులు పెంచుకుంటూ వెళ్తున్నారు. దీంతో పిల్లలను చదివించడానికి తల్లింద్రులకు తడిసి మోపెడవుతుంది. కమ్యూనిటీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అయిన లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో 44శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుతున్న పాఠశాలలో గత మూడేళ్లలో ఫీజులు 50 నుంచి 80 శాతం పెరిగాయని చెప్పినట్లు సర్వే నివేదిక వెల్లడించింది.దేశ వ్యాప్తంగా ఉన్న 309జిల్లాల్లోని 31 వేల మంది స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులపై ఈ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో పాల్గొన్న దాదాపు 93శాతం మంది తల్లిదండ్రులు పాఠశాలల అధిక ఫీజుల నియంత్రణపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఆశలను అవకాశంగా మలుచుకున్న ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు వివిధ పేర్లతో బురిడీ కొట్టిస్తున్నాయి. దీంతో అత్యాశకు పోయి లక్షలు కుమ్మరిస్తూ భారం భరిస్తున్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా స్కూల్ ఫీజులు గణనీయంగా పెరిగాయి. 5 శాతం దాటని ధనవంతుల సంగతి పక్కనపెడితే మిగతా 95శాతం మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కుటుంబాలు ఈఆర్థికభారం మోయలేక పిల్లలకు మంచి చదువులు చెప్పించలేక మనోవేదనకు గురవుతున్నారు. ఒకప్పుడు గ్రామర్, కాన్సెప్ట్ స్కూళ్లు అంటేనే అదేదో బ్రహ్మ పదార్థంలా చూసేవారు. ఇప్పుడు కాన్సెప్ట్ పోయి టాలెంట్, టెక్నో, ఈటెక్నో, డీజీ, మోడల్ స్కూల్, ఐఐటీ, జేఈఈ, సివిల్స్ ఫౌండేషన్ అంటూ తల్లిదండ్రులను ఊహాలోకంలోకి తీసుకెళ్లేందుకు పాఠశాల యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయి.ఎలాంటి అనుమతి లేకుండా ఏటా 20 నుంచి 30 శాతం ఫీజులను యాజమాన్యాలు యథేచ్ఛగా పెంచుతూ వెళ్తున్నాయి.జీవో నెంబర్ 91 ప్రకారం దరఖాస్తు రుసుం రూ.100, అడ్మిషన్ ఫీజు రూ.500 మాత్రమే తీసుకోవాలి.పాఠశాలలో పుస్తకాలు, విద్యా సామగ్రిని కొనుగోలు చేయాలన్న నిబంధనలు పెట్టరాదు. సెక్షన్ 8(1) ప్రకారం విద్యాసంస్థ పేర్లకు ఇంటర్నేషనల్, ఐఐటీ, ఒలింపియాడ్, కాన్సెప్ట్, ఈటెక్నో వంటి పదాలను చేర్చకూడదు. జీవో 88 ప్రకారం 200 మంది విద్యార్థులు చదివే పాఠశాలలో 700 చదరపు మీటర్ల విస్తీర్ణంలో క్రీడా మైదానం ఉండాలి.అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.అగ్నిమాపక సామగ్రిని అందుబాటులో ఉంచాలి. కానీ ఏ ఒక్క కార్పొరేట్ విద్యాసంస్థల్లో అగ్నిమాపక సామగ్రిని పెట్టడం లేదు.కనీసం నోటీసు బోర్డుపై ఏ తరగతికి ఎంత ఫీజు వసూలు చేస్తామో కూడా చెప్పకుండా పరిమితి లేకుండా ఫీజులను వాళ్లే నిర్ణయించేస్తున్నారు. చాలా పాఠశాలల్లో ఎత్తయిన గోడలు, ఏసీ తరగతి గదులు, ప్రత్యేకమైన టేబుళ్లు, కుర్చీలు,ఏసీ బస్సులు, డిజిటల్ బోర్డులు, డిజిటల్ మెటీరియల్ చూపి,భారీగా ఫీజులు



వసూలు చేస్తున్నారు.సాధారణంగా, టైర్ 1, టైర్ 2 నగరాల్లో,ప్రైవేట్ స్కూళ్ల ట్యూషన్ ఫీజులు ప్రతి నెలా రూ. 2,500 నుండి రూ. 8,000వరకు ఉంటాయి. కొన్ని స్కూళ్లు వార్షిక ఫీజులు కూడా విధిస్తాయి,ఇవి ఒక్కో స్కూల్‌కి ఒక్కో విధంగా ఉంటాయి.ఉదాహరణకు, ముస్సోరీలోని వుడ్‌స్టాక్ స్కూల్ భారతదేశంలో అత్యంత ఖరీదైన పాఠశాలలలో ఒకట.వార్షిక ఫీజులు రూ.18 లక్షలకు చేరుకుంటున్నాయి. ప్రైవేట్ స్కూల్‌ఫీజులు తల్లిదండ్రులకు ఒక ప్రధాన అంశం. ఫీజులు చాలా ఎక్కువగా ఉండటం వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చేర్చడానికి వెనకడుగు వేస్తున్నారు. కొన్ని రాష్ట్రాలు,నగరాలు ఫీజులను నియంత్రించడానికి చట్టాలు,నిబంధనలు తీసుకువచ్చాయి. కానీ రాష్ట్రంలో విద్యా కమిషన్ వున్న స్కూల్ ఫీజులలో ఎటువంటి మార్పు లేదు.విద్యార్థుల నుండి తీసుకున్న టువంటి ఫీజులో పాఠశాల నిర్వహణ, విద్యుత్, అద్దె ఖర్చులు,15 శాతం స్కూల్ అభివృద్ధికి ఉపయోగించాలి.15 శాతం ఫీజును స్కూల్ సిబ్బందికి బీమా, భవిష్యనిధి కోసం కేటాయించాల్సి ఉంటుంది.2008 జీవో నెం.90, 91, 92 ప్రకారం ఫీజు నిర్ణయించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి, ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, విద్యార్థి సంఘాలు,ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధితో కమిటీని ఏర్పాటు చేయాలి. దీనికి కలెక్టర్ చైర్మన్‌గా ఉండాలి. ఈ కమిటీ పాఠశాలను పరిశీలించి మౌలిక సదుపాయాలు, పరిస్థితి చూసి ఎంత ఫీజులు వసూలు చేయాలనే విషయమై నివేదిక ఇస్తుంది. దీనిపై విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే ప్రభుత్వ పరంగా ఓ ప్రకటన విడుదల చేయాలి. జీవో నెంబర్ 42 ప్రకారం ఫీజులను పెంచాలంటే జిల్లా ఫీజ్ రెగ్యులేషన్ కమిటీ అనుమతి తీసుకోవాలి. రోజు రోజు ఫీజులు పెంచుతున్నారు తప్ప తగ్గించడం లేదు.ఫీజుల నియంత్రణ,టీచర్ల నియామకం,డొనేషన్ల వసూలు వంటి అంశాల్లో విద్యా హక్కు చట్టం చాలా స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిన వాటిని పాటించడం చాలాప్రైవేట్ పాఠశాలల్లో కనిపించడంలేదు. చట్టాన్ని ఉల్లంఘిస్తే భారీగా జరిమానాలు విధించేలా చర్యలు తీసుకోవాలని విద్యానిపుణులు డిమాండ్ చేస్తున్నారు. ప్రవేశ పరీక్షల పేరుతో డొనేషన్లు వసూలు చేస్తే రూ. 25,000నుండి రూ.50,000 వరకు జరిమానావిధించేలా చట్టంలో ప్రొవిజన్స్ ఉన్నాయి. అంతేకాకుండా ప్రతి ప్రైవేట్ పాఠశాలలో కనీసం 25 శాతం సీట్లు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలన్న నిబంధన విద్యా హక్కు చట్టంలో ఉంది.కానీ దీనిపై కూడా పర్యవేక్షణ లేదు.ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి.చట్టాన్ని ఉల్లంఘించే స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేకుండా విద్యావ్యవస్థను నడిపే దిశగాచర్యలు తీసుకోవాలి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. సెక్షన్ 12 ప్రకారం స్కూల్ స్టాఫ్ సెలక్షన్ కమిటీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం టీచర్లను,నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించి వారి వివరాలు, విద్యార్హత, వారికి ఇచ్చే వేతనాల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలని చట్టం చెబుతుంది. సెక్షన్ 12 ప్రకారం టీచర్ విద్యార్థుల నిష్పత్తి 1:20 కి మించరాదు. చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు యాజమాన్యం 25శాతం సీట్లను ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులకు, మైనారిటీలకు కేటాయించాలి. ఇవే కాకుండా పాఠశాలల్లో మున్సిపాలిటీ పరిధిలో అయితే 1000 చదరపు మీటర్ల ఆట స్థలం, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 2000 చదరపు మీటర్ల ఆటస్థలం తప్పనిసరిగా ఉండాలి. కానీ ఇప్పుడు ఉన్నటువంటి ప్రైవేటు పాఠశాలలు దేన్నీ పాటించడంలేదు. ప్రతి సంవత్సరం తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం, విద్యావేత్తలు, మేధావులు, అధికారులు సభ్యులుగా ఉన్నటువంటి ఫీ రెగ్యులేషన్ కమిటీ ఫీజులను నియంత్రణ చేసే నియంత్రణ వ్యవస్థ ఉండాలి. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులను ధిక్కరించిన సంస్థలపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వం కఠిన చట్టాలు రూపొందించాలి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం కోసం విద్యార్థులు,తల్లిదండ్రులు, విద్యావేత్తలు చిన్న విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా ఉద్యమం చేపట్టినటువంటి బాధ్యత ఉంది. ఈ విధంగా చేసినట్లయితేనే అధిక ఫీజులను వసూలు చేయకుండా ఉంటుంది. ఫీజులను కొంతమేరకు నియంత్రించవచ్చు. ●

# రైతు కాడివదిలితే దేశ భవిత ప్రశ్నార్థకం!

పులి రాజు

డెబ్బైఏడేళ్ల స్వతంత్ర భారతదేశంలో పండించిన పంటలకు ధరల పైన స్వతంత్రం రాని ఒకే ఒక వ్యక్తి రైతు. ఆదాయ భద్రత లేని ఏకైక రంగం వ్యవసాయ రంగం. వ్యవసాయదారుడు అంటేనే సమాజంలో ఒక చిన్న చూపు. ఆదాయం మాట పక్కన పెడితే కనీసం పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులను చూసి నేటి యువ తరం వ్యవసాయం చేయడానికి ఎవరు ముందుకు రావడం లేదు. వ్యవసాయంలో ఉన్న యువతరం వ్యవసాయాన్ని వదిలి వేరే మార్గాన్ని వెతుక్కుంటున్నారు. ఇప్పటికే వ్యవసాయానికి అత్యంత ప్రధానమైన నాగలి, ఎడ్లు, కొడవలి లాంటివి ఇప్పటి తరానికి తెలవకుండా పోయిన సంగతి తెలిసిందే! భవిష్యత్తులో పై వాటిని, రైతులను మ్యూజియంలో చూసే పరిస్థితి వచ్చేటట్లు ఉంది. భారత వ్యవసాయం సంక్షోభంలో లేదు, కానీ రైతు మాత్రమే సంక్షోభంలో ఉన్నాడు. మన దేశంలో ప్రతి అర్ధగంటకు ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ప్రతిరోజు సుమారు 2 నుండి 3 వేల మంది రైతులు వ్యవసాయ రంగాన్ని వదిలి ఇతర రంగాలకు వెళ్లిపోతున్నారు. ఇంకా 40 శాతం మంది రైతులు వ్యవసాయం అంటే ఇష్టం లేకున్నా, నష్టాలను మూటగట్టుకుంటున్నా కూడా వ్యవసాయం ఎందుకు చేస్తున్నారంటే భార్య, పిల్లలను, తల్లిదండ్రులను, ఊరును, బంధువులను వదిలిపెట్టలేక వ్యవసాయం చేస్తున్నారు. ఎన్‌సిఆర్‌బి లెక్కల ప్రకారం భారతదేశంలో 1995 నుండి 2022 వరకు 3,97,540 మంది రైతులు, తెలంగాణలో 33,325 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు అధికారిక లెక్కలు వివరిస్తున్నాయి. దేశ జనాభాకు సరి పోయే ఆహారాన్ని ఉత్పత్తిచేస్తున్న వ్యవసాయ రంగంబాగానే ఉంది. కానీ ఆ ఉత్పత్తికి మూల కారణమైన వ్యవసాయ దారుడు మాత్రం అప్పుల ఊబిలోకి నెట్టబడి దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్న దృశ్యాన్ని మనం



నిత్యం చూస్తూనే ఉన్నాం. భూమి అనేది ఆకలి తీర్చే కన్న తల్లి లాంటిది. ఆ భూమి భవిష్యత్ తరాలకు వారసత్వ సంపద! రైతు అంటే ప్రభుత్వాలు నిర్వచనం ప్రకారం పట్టా పాస్ బుక్ ఉంటే రైతు. ఒకప్పుడు భూమి అంటేపంటలు పండించే ఒక ప్రధాన సాధనం, ఒక బతుకు దెరువు, ఆ కుటుంబానికి వారసత్వ సంపద,ఒక భరోసా! ఆ గ్రామస్తుల ఆస్తి కానీ ఇప్పుడు భూమి అంటే పంటలు పండించే సాధనం కాదు. భూమి అంటే సామాజిక హోదాకు ప్రతిరూపం. ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న రైతు బీమా, రైతు బంధు/ రైతు భరోసా, పన్నుల మినహాయింపు లాంటి పథకాలను ఉపయోగించుకోవడాకి ఐదుగుంటల నుండి వందల ఎకరాలలో కొనుగోలు చేస్తున్నారు. మాకు భూమి ఉంది అని చెప్పుకోవడానికి గర్వపడుతున్నారు. సాధారణ ఉద్యోగి నుంచి మంత్రుల స్థాయి వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో వందల ఎకరాలు కొని ఫామ్ హౌస్ కట్టుకొని సెలవు రోజులలో ఎంజాయ్‌చేయడానికి ఉపయోగపడుతున్న పంట పొలాలు. ఇవాళ రైతుల చేతిలో భూమిలేదు. భూమి పట్టా ఉన్నవారు రైతులుకారు. తెలంగాణలో భూమి పట్టాదారుల సంఖ్య2018 -19 లో 50,23,861, 2024-25 లో 70,60,000. పట్టా దారులు పెరుగుతున్నారు కానీ రైతులకు తగ్గుతున్నారు. భూమి ఉండాలి కానీ ఆ కుటుంబం వ్యవసాయం చేయదు.వ్యవసాయం చేసే యువకులకు పిల్లను ఇవ్వడానికి ముందుకు రావడం లేదంటే అతిశయోక్తి కాదు. సిద్ధిపేట జిల్లా,వర్గల్ మండలం, తునికి ఖల్సా గ్రామంలో గ్రామస్తులకు 1133ఎకరాలుంటే ఇతరులకు 1203ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. నేటి యువతరం సెక్యూరిటీ గార్డ్ గానైనా పనిచేయడానికి సిద్ధపడుతున్నారు కానీ వ్యవసాయం చేయడానికి ఇష్టపడడం లేదు.యువతరాన్ని వ్యవసాయం వైపు మళ్లించాలంటే కొన్నిసూచనలు. మనం వ్యవసాయదారులను గౌరవించాలి. వ్యవసాయం బతుకులపైన భరోసా కల్పించాలి.పెట్టిన పెట్టుబడులను తిరిగి రాబట్టుకునేటట్టు ఉండాలి.పండిన పంటలకు లాభసాటిధరలుండాలి. రుణసౌకర్యం కల్పించాలి. రైతు బీమాతో పాటు పంటల బీమాలు కచ్చితంగా అమలుచేయాలి. రైతుల పిల్లలకు రిజర్వేషన్ సౌకర్యాలు కల్పించాలి.అభివృద్ధి పేరు మీద రైతుల దగ్గర నుండి బలవంతంగా పంటపొలాలను తీసుకోకూడదు. ●

# అంతర్జాతీయ గుర్తింపునకు బలూచిస్థాన్ నిరీక్షణ

డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్

బలూచిస్థాన్, కఠినమైన పర్వతాలు, విశాలమైన ఎడారులతో కూడిన ఈ భూమి, ఎప్పటికప్పుడు అణచివేతకు వ్యతిరేకంగా తిరగబడిన ప్రాంతం. స్వంత సంస్కృతి, చరిత్రతో గుర్తింపు పొందిన బలూచి ప్రజలు, పాకిస్థాన్ చేతిలో దశాబ్దాలుగా వ్యవస్థాపిత అణచివేతను, క్రూరత్వాలను ఎదుర్కొంటున్నారు. స్వతంత్ర బలూచిస్థాన్ డిమాండ్ ఒక ఆకస్మిక తిరుగుబాటు కాదు. బ్రిటిష్ వలస పాలన తర్వాత పాకిస్థాన్ రాష్ట్రం చేతిలోని శతాబ్దాల పోరాటం ఫలితం. ఈ ఉద్యమాన్ని అర్థం చేసుకోవడానికి, బలూచిస్థాన్ భౌగోళిక స్థితి, చారిత్రక నేపథ్యం, సామాజిక ఆర్థిక పరిస్థితులు స్వాతంత్ర్య డిమాండ్‌కు కారణమైన దమనవిధానాలను తెలుసుకోవాలి. భౌగోళికంగా, బలూచిస్తాన్ పాకిస్థాన్‌లో అంతర్భాగం. భూభాగం పరంగా అతిపెద్ద విశాలమైన ప్రాంతం. కానీ, జనసాంద్రత చాలా తక్కువ. ఇరాన్, అఫ్ఘానిస్థాన్ సరిహద్దులు అలాగే అరేబియన్ సముద్ర తీరం ఉండటం వల్ల ఇది భూరాజకీయంగా (జియో పాలిటిక్స్‌కి స్ట్రాటజిక్)ముఖ్యమైన ప్రాంతం. ఇక్కడి ఎడారుల క్రింద సహజవాయు వనరులు, బంగారం, రాగి వంటి ఖనిజాలు ఎన్నో ఉన్నాయి. ఈ వనరులు సంపదను తెచ్చి పెట్టాల్సినవి, కానీ అది శాపంగా మారింది. పాకిస్థాన్ ప్రభుత్వం, విదేశీ పెట్టుబడిదారులతో కలిసి, ఈ వనరులను దోచుకుంటోంది. కానీ బలూచి ప్రజలు బీభత్సమైన పేదరికంలో మగ్గుతున్నారు. ప్రాథమిక మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య సేవలు విస్మరించబడ్డాయి. నిరుద్యోగం అధికం. బలూచిస్తాన్ నుండి సంపద ఇస్లామాబాద్‌కు ఇతర విదేశీ కంపెనీలకు వెళ్తుంది కానీ, స్థానికులకు ఏమీ లభించదు. చారిత్రకంగా, బలూచిస్థాన్ 1948లో పాకిస్థాన్‌తో బలవంతంగా కలిపేముందు స్వతంత్ర రాజ్యంగా ఉండేది. కలాత్ ఖాన్ (స్వతంత్ర పాలకుడు) సైనిక బెదిరింపులతో పాకిస్థాన్‌లో విలీనానికి అంగీకరించాల్సి వచ్చింది. ఈ నిర్ణయాన్ని బలూచి ప్రజలు ఎప్పటికీ అంగీకరించలేదు. అప్పటి నుండి, ప్రతి తిరుగుబాటును క్రూరమైన సైన్యదాడులతో అణిచివేసారు. 1970లలో, ఎన్నికైన బలూచిస్థాన్ ప్రభుత్వాన్ని



రద్దు చేసిన తర్వాత పూర్తి స్థాయి తిరుగుబాటు జరిగింది. దానితో సైన్యం హింసాత్మకంగా ప్రతిస్పందించి, వేలాది మందిని చంపింది. ఈ రోజుకూడా ఇదే విధానం కొనసాగుతోంది. బలవంతపు అదృశ్యాలు, న్యాయవిధానం లేని హత్యలు, సామూహిక స్థానభ్రంశం అనేవి రోజువారీ సంఘటనలు. పాకిస్థాన్ సైన్యం ఏ విధమైన శిక్ష లేకుండా కార్యకలాపాలు చేస్తోంది. హక్కులు లేదా స్వయం ప్రభుత్వం గురించి మాట్లాడే కార్యకర్తలు, పత్రికా సంపాదకులు, విద్యార్థులను కూడా అత్యాచారాలు చేస్తోంది. 'కిల్ అండ్ డంప్' విధానం క్రింద యువకులను గుట్టుగా కిడ్నాప్ చేసి, చంపి గోతిలో పాతిపెడతారు. ఆ శవాలు ఎప్పటి కో దొరుకుతాయి. ప్రజల్లో అలాంటి భయాన్ని పాకిస్థాన్ ఆర్మీ పెంచి పోషించింది. కానీ బలూచి ప్రజల ధైర్యాన్ని అణచివేయలేకపోయింది. సామాజికంగా ఆర్థికంగా, బలూచిస్థాన్ ఉద్దేశపూర్వకంగా వెనుకబడిన ప్రాంతంగా ఉంచేశారు. అక్షరాస్యత రేటు పాకిస్థాన్తో పోలిస్తే అత్యంత తక్కువ. ప్రాథమిక సదుపాయాలు అందుబాటులో లేవు. పాకిస్థాన్ విధానాలు బలూచి గుర్తింపును అణచివేయడానికి నాన్ బలూచి వలసదారులను ఇక్కడికి తెచ్చి జనాభా నిర్మాణాన్ని మార్చడానికి ప్రయత్నిస్తోంది.ప్రజల సాంస్కృతిక జీవనాన్ని కూడా అణచివేస్తుంది. బలూచి భాషను అణచివేస్తున్నారు, బలవంతంగా ఉర్దూ భాషను వారిపై రుద్దుతున్నారు. వారి సంప్రదాయాలను 'వెనుకబడినవి' అని తిరస్కరిస్తున్నారు. మీడియాపై నియంత్రణ విధించారు. అంతర్జాతీయ ప్రేక్షకులను ఈ అత్యాచారాలను డాక్యుమెంట్ చేయడానికి అనుమతించరు. పాకిస్థాన్ ప్రచారం బలూచి జాతీయవాదులను "తీవ్రవాదులు' గా చిత్రీకరిస్తుంది, కానీ నిజానికి వారి పోరాటం రాష్ట్రస్పాన్సర్ చేయబడిన అణచివేతకు వ్యతిరేకంగా జీవిత పోరాటం చేస్తున్నారు. ఆర్థికంగా, బలూచిస్థాన్ దోపిడీకి గురైన ప్రాంతం. చైనా, పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ) వంటి బహుళ బిలియన్ డాలర్ ప్రాజెక్టులు బలూచి భూముల్లోకి ప్రవేశిస్తున్నాయి. కానీ ప్రజలకు ఏమీ లాభంలేదు. బదులుగా, వారి భూములు జప్తు చేయబడుతున్నాయి. పర్యావరణ నాశనం జరుగుతోంది. చైనా పాకిస్థాన్ మిలిటెంట్లు మాత్రం వారిని క్రూరంగా హింసించేవారు. అనేక తిరుగుబాట్లు జరిగాయి. అందుకే ఇప్పుడు పాకిస్థాన్ మిలిటరీ పై తిరుగుబాటు చేసి, స్వాతంత్ర్య ప్రకటన చేశారు.వారి సరిహద్దులతో కూడిన మ్యాప్ రూపొందించి, జాతీయ జెండాను ఎగురవేశారు నెట్‌లో అదృశ్యాలను పోస్ట్ చేశారు. భారతదేశాన్ని, ఐక్యరాజ్యసమితిని తమ రిపబ్లిక్ బలూచిస్తాన్‌ను గుర్తించమని కోరుతున్నారు. ●

# రాష్ట్రపతిపాలన సైతం మణిపూర్‌లో విఫలం



## గవర్నర్‌ను వెంటనే రీకాల్‌చేయాలి

**ఇంఫాల్, మే 27:** ప్రభుత్వరంగ సంస్థ ఆధ్వర్యంలోనడుస్తున్న బస్సులపై రాష్ట్రంపేరును తుడిచేస్తే అడిగే దిక్కులేదని, రాష్ట్రపతి పాలన విధించినప్పటికీ మణిపూర్‌లో శాంతియుత వాతావరణం ఏర్పడలేదని,రాష్ట్రం, కేంద్రం రెండూ కూడా విఫలం అయ్యాయని మణిపూర్ పిసిసి చీఫ్ కీషమ్ మేఘచంద్ర ఆరోపించారు. రాష్ట్రంలో శాంతినెలకొల్పడంలో రాష్ట్రపతి పాలన పూర్తిగా విఫలం అయిందన్నారు. గవర్నర్ అజయ్‌కుమార్‌భల్లాను వెంటనే కేంద్రం రీకాల్‌చేయాలని డిమాండ్‌చేసారు. ఫిబ్రవరి 13న కేంద్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించింది. ముఖ్యమంత్రి ఎన్ బీరేన్‌సింగ్ రాజీనామాచేయడం, సుదీర్ఘకాలంగా రాష్ట్రంలో హింస అట్టుడికిపోవడంతో కేంద్రం రాష్ట్రపతి పాలన విధించింది. రాష్ట్ర అసెంబ్లీ కాలపరమితి 2027 వరకూ ఉన్నప్పటికీ సస్పెండ్‌చేసి రాష్ట్రపతి పాలన విధించారు. తన సోషల్‌మీడియా పోస్టులో కీషమ్ మాట్లాడుతూ డబుల్ ఇంజిన్‌ప్రభుత్వం మణిపూర్‌లో ఇప్పటికే రెండేళ్లుగా విఫలం అయిందని, రాష్ట్రపతి పాలనలో కూడా కేంద్రం మణిపూర్‌లో విఫలం అయిందన్నారు. వాంగ్‌ఖెమ్ ఎమ్మెల్యేకూడా అయిన పిసిసి చీఫ్ ప్రధానిమోడీ సైతం మణిపూర్‌పై దృష్టిపెట్టలేదని, ఇప్పటివరకూ పర్యటించలేదని హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామాచేసి మణిపూర్ గవర్నర్‌ను రీకాల్ చేయాలని డిమాండ్‌చేసారు. గడచిన కొన్ని రోజులుగా రాష్ట్రంలో నిరసనలు వెల్లువెత్తడంతో పిసిసి చీఫ్ స్పందించారు. గతవారం ఒక ప్రభుత్వ బస్సు ముందుభాగంలో ఉన్న రాష్ట్రం పేరును తొలగించడంతో హింస మళ్లీ ప్రజ్వరిల్లింది. 20వ తేదీ జరిగిన ఈసంఘటనపై గవర్నర్ క్షమాపణలు చెప్పాలని ఆందోళన కారులు డిమాండ్‌చేస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది గ్వాల్టాబి చెక్‌పోస్టువద్ద బస్సును నిలిపివేసారు. డిఐపిఆర్ సిబ్బందిని ఆ బస్సు పైభాగంలో ఉన్న రాష్ట్రం పేరును తెల్లకాగితంతో మూసేయాలని ఆదేశించారు. ఉఖ్రుల్ జిల్లాలోని షిరూయి లిలీ వేడుకలకు వెళుతున్న జర్నలిస్టుల బస్సు పై సెక్యూరిటీసిబ్బంది నిర్బంధంగా రాష్ట్రం పేరుతొలగించారన్నారు. గవర్నర్ స్వయంగా మణిపూర్ పదం తొలగించాలని సూచించడం వల్లనే ప్రభుత్వ రవాణా బస్సుపై ఈ పేరు తొలగించారని వారు తీవ్రనిరసన తెలిపారు. ఆరుకిలోమీటర్లమేర మానవహారం నిర్మించి తమ నిరసనను తెలిపారు. ఇంఫాల్ ఎయిర్‌పోర్టు నుంచి కీసమ్‌పట్‌వరకూ ఈ మానవహారం రిగింది. గవర్నర్ హెలికాప్టర్‌పై రాజ్‌భవన్‌కు వెళ్లడంపైనా పిసిసిచీఫ్‌ఘాటు విమర్శలుచేసారు.



## భారత్‌తో శాంతి చర్చలకు
# పాకిస్థాన్ సిద్ధమే

### ఇరాన్ పర్యటనలో పాక్‌ప్రధాని షెహబాజ్

**టెహ్రాన్, మే 27:** పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ తదితర పరిణామాలతో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ మరోసారి శాంతిచర్చలు ప్రస్తావించారు. భారత్‌తో శాంతి చర్చల గురించి ప్రస్తావిస్తూ కశ్మీర్, ఉగ్రవాదం, వాణిజ్యం, జల వివాదం వంటి దీర్ఘకాలిక సమస్యలపై భారత్‌తో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. నాలుగు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా షెహబాజ్ షరీఫ్ సోమవారం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు వెళ్లారు. ఆ దేశ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో సమావేశమయ్యారు. ఈ క్రమంలో సంయుక్త విలేకరుల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. మా పొరుగు దేశంతో (భారత్) శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నాం. వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి కూడా ఇండియాతో మాట్లాడటానికి మేము సిద్ధం. పాక్ శాంతిని కోరుకుంటున్నదని శాంతి చర్చల ద్వారా ఇరుదేశాల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తాం. భారత్ నిజంగా శాంతియుత వాతావరణాన్ని కోరుకుంటున్నట్లైతే శాంతి చర్చల ప్రతిపాదనలకు అంగీకరించాలని షెహజాజ్ షరీఫ్ అన్నారు. కాగా, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తమకు అప్పగిస్తేనే పాకిస్థాన్‌తో చర్చలు జరుపుతామని భారత్ ఇప్పటికే స్పష్టం చేసింది. అయినప్పటికీ ఇతర సమస్యల కోసం శాంతి చర్చలకు షెహబాజ్ పిలుపునివ్వడం గమనార్హం. భారత్, పాకిస్థాన్ మధ్య శాశ్వత కాల్పుల విరమణకు ఇరాన్ మద్దతును ప్రకటించిదని ఆ దేశ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తెలిపారు.

## బీహార్ సరిహద్దుల్లో
# నేపాల్ డ్రోన్లు

### హై అలర్ట్‌ప్రకటించిన ప్రభుత్వం



**పాట్నా, మే 27:** భారత్‌నేపాల్ సరిహద్దు జిల్లాల్లో డ్రోన్లు ప్రవేశించడంతో బీహార్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. సుమారు 15 నుంచి 20 వరకూ డ్రోన్లు నేపాల్ గగనతలం నుంచి బీహార్‌లోకి ప్రవేశించి ముందురోజు రాత్రి చక్కర్లు కొట్టాయి. కమల్లా సరిహద్దు పోస్టుపరిసరాల్లో సుమారు 40 నిమిషాలపాటు ఈ డ్రోన్లు చక్కర్లుకొట్టాయి. మధుబని జిల్లాలో నేపాల్‌సరిహద్దు ఉంది. 15నుంచి 20 డ్రోన్లు కొంత సామగ్రితో వస్తున్నట్లుగా కనిపించాయని, కమ్లా సరిహద్దు చెక్‌పోస్టువద్ద రాత్రి 7.30 నుంచి 8 గంటలప్రాంతంలో తిరుగాడి నట్లు ఎస్పెస్పీ వివేక్ ఓఝా చెప్పారు.మళ్లీ తిరిగి నేపాల్‌వైపు వెళ్లిపోయాయయని, బీహార్‌లో తిరిగిన తర్వాత నేపాల్ సరిహద్దుల్లో పశ్చిమ, తూర్పు ప్రాంతాలకు ఇవి వెళ్లినట్లు గుర్తించామన్నారు. దీనితో దర్భంగా ఎయిర్‌ఫోర్స్, ఢిల్లీ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్లకు సమాచారం అందించామని, వెంటనే హై అలర్ట్‌కూడా ప్రకటించినట్లు తెలిపారు. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి హైఅలర్ట్ కొనసాగుతున్నదన్నారు. ఈడ్రోన్లు నిత్యంజరిగే విన్యాసాల్లో భాగంగా వచ్చాయా అన్నదానిపై ఆరాతీస్తున్నారు.ఇదే విషయమై సమగ్ర దర్యాప్తు ప్రారంభించామని డిప్యూటి కమాండంట్ ఓఝా తెలిపారు. సరిహద్దుల్లో తీవ్రస్థాయి తనిఖలుచేస్తున్నామని ఎస్‌హెచ్‌ఒ రాకేష్‌కుమార్ తెలిపారు. పోలీస్ జాగిలాలను కూడా ప్రవేశపెట్టామని, స్కానింగ్‌మెషిన్లకూడా పనిచేస్తున్నట్లు తెలిపారు.

## పహాల్గాంలో సిఎం ఒమర్ అబ్దుల్లా
# కేబినెట్ సమావేశం



**శ్రీనగర్, మే 27:** పహల్గాంలో అమాయక పర్యాటకులపై ఉగ్రమూకలు జరిపిన దాడి తర్వాత జమ్ముకాశ్మీర్ పర్యాటక రంగానికి విఘాతం కలిగింది. ప్రత్యేకించి పహల్గాంకు యాత్రీకులు పూర్తిగా రావడం మానేసారు. దీనితోపాటు కాశ్మీర్‌లోని దాల్‌లేక్ ఇతర పర్యాటక ప్రాంతాలన్నీ కూడా మూతపడుతున్నాయి. పర్యాటక రంగమే ప్రధాన జీవనాధారంగా కొనసాగే కాశ్మీర్‌లో ఈరంగం పరిపుష్టంచేసేందుకు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రత్యేక కసరత్తులు చేపట్టారు. దక్షిణకాశ్మీర్‌లోని పహల్గాంలోనే తన కేబినెట్ సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించారు. తద్వారా కాశ్మీర్‌లో పర్యాటకులకు పూర్తి రక్షణ ఉంటుందని, భద్రత కల్పిస్తారన్న నమ్మకం పెంచేందుకే ఈచర్యలు తీసుకుంటున్నట్లు ఆయన సన్నిహితులు చెపుతున్నారు. పహల్గాంలోని పర్యాటక వ్యాపారంచేసేవారితోకూడా ముఖ్యమంత్రి, ఆయన మంత్రివర్గ సహచరులు కలిసిచర్చలుజరిపారు. ఏప్రిల్ 22 దాడి తర్వాత లోయలో పర్యాటకం ఎలా వృద్ధిచేయాలన్న అంశంపై వారినుంచి సలహాలు సూచనలు స్వీకరించారు. మంగళవారం కేబినెట్ సమావేశం నిర్వహించడం ద్వారా కాశ్మీర్‌లో పర్యాటకులకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందన్న విశ్వాసం పెంపొందించినట్లవుతుందని ఒమర్ మంత్రివర్గం భావిస్తోంది. ఇప్పటివరకూ శ్రీనగర్, జమ్ముల్లో మాత్రమే జరిగే కేబినెట్ సమావేశాలు మొట్టమొదటిసారి బయటి ప్రాంతం అయిన పహల్గాంలో జరుగుతోంది. పహల్గాంలో దాడి తర్వాత పర్యాటకులందరూ ఎవరిప్రాంతాలకు వారు వెళ్లిపోయారు. శ్రీనగర్ ఇతరప్రధాన ప్రాంతాల్లో హోటళ్లు ఖాళీ అయిపోయాయి. దక్షిణకాశ్మీర్, సోనామార్గ్, గుల్మార్గ్ వంటి ప్రాంతాల్లో ఆతిథ్యరంగం పూర్తిగా అడుగంటిపోయింది. మంగళవారం కేబినెట్ సమావేశం తర్వాత బుధవారం ఉత్తరకాశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో అత్యున్నత స్థాయిసమావేశం నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి, కేబినెట్‌మంత్రులు, సిఎం సలహాదారు, ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వశాఖల అధిపతులు, సీనియర్ సివిల్ పోలీస్ అధికారులు ఈసమావేశంలో పాల్గొంటారు. ఇలాంటి సమావేశం వల్ల కొంతమేలు జరుగుతుందని అక్కడి వ్యాపారులు చెపుతున్నారు. సీనియర్ నాయకుడు ఎమ్మెల్యే తన్వార్ సాదిక్‌మాట్లాడుతూ ప్రజలవద్దకే ప్రభుత్వం అన్న రీతిలో ఈసమావేశాలు నిర్వహిస్తున్నారనిదీనివల్ల ప్రజల్లో మరింతనమ్మకం పెరుగుతుందన్నారు.

## జార్ఖండ్‌లోఎన్‌కౌంటర్.. మావోయిస్టు కీలకనేత హతం


**రాంచి, మే 27:** జార్ఖండ్‌పరిధిలోని పలాము మహుదానంద పంచాయితీపరిధిలో 12 గంటల పాటు జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు టాప్ నాయకుడు తులసి భూయాన్‌ను భద్రతా దళాలు మట్టుపెట్టారు. రాత్రి ఏడుగంటలకు ఆ కాల్పులు ప్రారంభించారు. సోమ, మంగళ వారాల్లోకూడా కొనసాగాయి. మావోయిస్టు నాయకుడి మృతదేహంతోపాటు సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్ కూడా అక్కడ రికవరీచేసుకన్నారు. 15 లక్షల రివార్డు ఉన్న మావోయిస్టునేత నితేష్ యాదవ్‌కు కూడా బుల్లెట్ గాయాలయినట్లు పోలీసులు గుర్తించారు. సుమారు ఆరుడజన్ల కేడర్లకు నితీష్ యాదవ్ నేతృత్వం వహిస్తు న్నాడు. సంజయ్ గోద్రామ్‌కూడా వీరిలో ఉన్నాడు. ఆతని తలపైనా 10 లక్షల రివార్డుఉంది. ఇపుడు నితేష్ జార్ఖండ్, బీహార్ పోలీసు లకు సవాల్‌గా మారడంతో పోలీసులు నిరంతర గాలింపుచేపట్టారు. గడచిన 15ఏళ్లనుంచి ఆతనికోసం వేట ప్రారం భించారు. నితేష్‌యాదవ్ ఆతని స్క్వాడ్ మహుదానర్‌పికెట్ వద్ద ఉన్నట్లుతేలింది. మేజర్ మావోయిస్టు కార్యాకలాపాలకు శ్రీకారంచుట్టారని తెలియడంతోనే పలాము ఎస్పీ రిష్మారమేషన్‌గాలింపు ముమ్మరం చేసారు. జార్ఖండ్ జాగ్వార్ సిఆర్‌పిఎఫ్‌లతో జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. గాలింపులో బలగాలకుతారసపడిన మావోయిస్టులు కాల్పులు జరపడంతో ఎదురుకాల్పులు ప్రారంభించారు. రెండు రోజులపాటుజరిగిన ఈ కాల్పుల్లో తుల్సి భూయాన్ అనే సీనియర్‌నేత హతమయినట్లు ప్రకటించారు. ఎన్‌కౌంటర్ తర్వాతకూడా గాలింపు చేపట్టారు. ఇపుడు ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం మావోయిస్టులకు సురక్షిత హబ్‌గా కొనసాగుతోంది. దీనిసమాచారం పూర్తిగా తెలుసుకున్నదళాలు ఆప్రాంతంచుట్టుముట్టాయి. బీహార్, జార్ఖండ్‌లకు సరిహద్దుల్లో ఉన్న ఈప్రాంతంలో నక్కిన మావోయిస్టులు పలాములో ఆపరేషన్ పూర్తిచేసి ఇక్కడే దాక్కునేవారని తేలింది.

## పాక్‌వైపునుంచి పేలుడు సామాగ్రిని తీసుకోబోయి
# అనుమానిత బబ్బర్‌ఖల్సా సానుభూతిపరుడు మృతి

**అమృత్‌సర్, మే 27:** పాకిస్తాన్ కేంద్రంగాపనిచేస్తున్న బబ్బర్‌ఖల్సాతో లింకులు ఏర్పాటుచేసుకుని డ్రోన్లద్వారా వచ్చే పేలుడు పదార్థాలను స్వాధీనంచేసుకునే యత్నంలో సామగ్రి పేలి ఒక వ్యక్తిచనిపోయాడు. మజీతారోడ్డు బైపాస్‌లోని డీసెంట్ అవెన్యూకాలనీలో ఈసంఘటన జరిగింది. పోలీసులకు ముందుగానేసమాచారం అందడంతో ఆతని ఆచూకీతోపాటు మరికొందరు ఆతని సన్నిహితులకోసం గాలింపు చర్యలు చేపట్టారు. పాకిస్తాన్ మద్దతు ఉన్న ఉగ్రగ్రూపుతో మృతునికి సంబంధాలున్నట్లు అనుమానిస్తున్నారు. పోలీస్, ఫోరెన్సిక్ సిబ్బంది ఈ పేలుడు పదార్థం తీవ్రతను మదింపుచేస్తున్నారు. పేలుడు తీవ్రతకు మృతుడి రెండుచేతులు కూడా భుజాల వరకూ కాలిపోయాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం ఈ ప్రాంతంలో భారీ పేలుడు శబ్దం వినిపించిందని, దీనితో స్థానికులంతా ఆప్రాంతానికి వెళ్లి పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. సదర్ పోలీస్‌స్టేషన్ నుంచి సిబ్బంది, బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌లు ఆప్రాంతానికి వెళ్లాయి. సిసిటివి ఫుటేజిని కూడా స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించినా ఫలితంలేదు. చనిపోయినట్లుధృవీకరించారు. అమృత్‌సర్ రూరల్ ఎస్ఎస్‌పి మణీందర్‌సింగ్ మాట్లాడుతూ తీవ్ర గాయాలకులోనయి ఈ వ్యక్తి వివరాలను ప్రస్తుతం ఆరాతీస్తున్నట్లు చెప్పారు. డ్రోన్లద్వారా వచ్చిన పేలుడు సామగ్రిని తీసుకునేందుకు వచ్చి ఉంటాడని,ఆ సామగ్రిని తీసుకోవడంలో అజాగ్రత్తవల్లపేలిపోయి ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నామని, అయితే ఈ కన్‌సైన్‌మెంట్ పాకిస్తాన్‌నుంచే వచ్చిందని కూడా ఆయన సందేహం వ్యక్తంచేసారు.

బోర్డర్‌రేంజ్ డిఐజి సతీందర్‌సింగ్‌మాట్లాడుతూ ఐఎస్ఐ మద్దతున్న బబ్బర్‌ఖల్సా ఈ సంఘటన వెనుక ఉన్నట్లు తెలుస్తోందని, ప్రాంతంలో శాంతికి భగ్నం కలిగించే కుట్రలుచేస్తోందని తెలిపారు. ఈ సంఘటనలో గ్యాంగ్‌స్టర్లు, ఉగ్రవాదుల ప్రమేయం లేదని, ఈ వ్యక్తి తుక్కు వ్యాపార డీలర్‌అని పాత బాంబు మెటల్ వేస్ట్‌ను నిర్వీర్యం చేసే క్రమంలో కూడా ఇలాంటివి జరుగుతాయన్నారు.

# జ్యోతి మొబైల్స్‌నుంచి 12 టెరాబైట్ల డేటా రికవరీ



**న్యూఢిల్లీ, మే 27:** గూఢచర్యం కేసులో అరెస్టయిన హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. ఇక ఈ కేసు దర్యాప్తు ముమ్మురంగా కొనసాగుతోంది. ఇప్పటికే ఆమె ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను దర్యాప్తు అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. అందులో డిలీట్ అయిన సమాచారాన్ని దర్యాప్తు అధికారులు రికవరీ చేస్తున్నారు.సుమారు 12 టెరా బైట్ల డేటాను రికవరీ చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. జ్యోతి మల్హోత్రాకు చెందిన మూడు ఫోన్ల నుంచి 12 టెరా బైట్ల డేటాను స్వాధీనం చేసుకున్నాం. రికవరీ చేసిన డిజిటల్ డేటాను పరిశీలిస్తున్నాము. ఆమె ల్యాప్‌టాప్‌లోని డేటాను ఇంకా పరిశీలించాల్సి ఉందని సీనియర్ పోలీసు అధికారిని ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వచ్చాయి. అదే విధంగా జ్యోతి మల్హోత్రా నాలుగురు పాకిస్థానీ నిఘా ఏజెంట్లతో నేరుగా సంప్రదింపులు జరిపినట్లు కూడా తేలింది. వీరిలో ఢిల్లీలోని పాక్ హైకమిషన్‌ను సందర్శించినప్పుడు పరిచయమైన డానిష్, అహ్సన్, షాహిద్ ఉన్నారు. దీంతో పాక్ భద్రతా సంస్థలో వీరి పాత్ర గురించి అధికారులు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా పాక్ కోసం గూఢచర్యం చేసిందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు సంబంధించి కీలక విషయాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పాకిస్థాన్ పర్యటనలో అక్కడి అధికారులు ఆమెకు రాచమర్యాదులు చేసారు. లాహోర్‌లోని అనార్కలీ బజార్‌ని సందర్శించిన సమయంలో యూట్యూబర్‌కు ఏకంగా ఆరుగురు గన్‌మెన్లు ఏకే 47తో భద్రత కల్పించినట్లుగా తేలింది. స్కాట్లాండ్‌కు చెందిన ఓ యూట్యూబర్ వీడియోతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. జ్యోతికికల్పించిన సెక్యూరిటీని చూసి స్కాట్లాండ్ యూట్యూబర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'కాలమ్ అబ్రాడ్' అనే యూట్యూబర్ స్కాటిష్ పౌరుడు కాలమ్ మిల్ గత మార్చి నెలలో పాక్‌లో పర్యటించారు. లాహోర్‌లోని ప్రసిద్ధ అనార్కలీ బజార్‌లో తిరుగుతుండగా.. అక్కడ కొందరు తుపాకులతో కనిపించారు. వారి చొక్కాలపై 'నో ఫియర్' అని రాసి ఉంది. స్కాటిష్ యూట్యూబర్ విడుదల చేసిన తాజా వీడియోలో ఆయన పాకిస్థాన్‌లోని అనార్కలి బజార్‌లో జ్యోతి మల్హోత్రాతో మాట్లాడుతున్నారు. ఇందులో ఆమె 'మొదటిసారి పాకిస్థాన్ వచ్చారా' అంటూ కల్లమ్‌ను ప్రశ్నిస్తున్నది. 'లేదు ఇది ఐదోసారి' అంటూ ఆయన సమాధానమిచ్చారు. తాను ఇండియన్‌ను అంటూ ఆమె పరిచయం చేసుకుంది. అయితే పాకిస్థాన్ ఆతిథ్యం గురించి జ్యోతిని కల్లమ్ ప్రశ్నించగా గొప్పగా ఉందంటూ ఆమె సమాధానమిచ్చింది. అయితే ఆమె వెంట ఆరుగురు సాయుధులైన పోలీసులు ఉండడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని ఆయన చెప్పుకొచ్చాడు.



## రక్షణరంగానికి అధునాతన
# ఐదోతరం యుద్ధవిమానం

### 2030నుంచి తయారీకి ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ రెడీ

**న్యూఢిల్లీ, మే 27:** భారత్ రక్షణరంగంలోకి ప్రతిష్టాత్మకమైన ఐదోతరం యుద్ధవిమానం వస్తోంది. ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ వివిద పారిశ్రామికసంస్థల భాగస్వామ్యంతో ఈ అధునాతన యుద్ధవిమానాన్ని తయారుచేసింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉంచేలా ఈ అధునాతన మధ్య తరహా యుద్ధ విమానం (ఎఎంసిఎ)ను రూపొందించాలని అనుమతించారు. ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఎడిఎ)ఈరంగ పరిశ్రమల భాగస్వామ్యంతో ఈ యుద్ధవిమానం రూపొందిస్తున్నట్లు రక్షణరంగ అధికారులు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటురంగాల్లోకూడా వీటి తయారీకి అనుమతివ్వాలని రక్షణశాఖ భావిస్తోంది. కంపెనీలు స్వతంత్రంగాను, లేదా జాయింట్ వెంచర్లు, లేదా కన్సార్టియమ్‌ల తరహాలో రూపొందించుకోవచ్చని, బిడ్డరు మాత్రం భారతీయ కంపెనీ అయిఉండాలని, భారత చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుందని రక్షణశాఖ తెలిపింది. ఏరోస్పేస్ రంగంలో ఆత్మనిర్భర్‌భారత్‌ను సాధించే దిశగా ఈ యుద్ధ విమానం తయారీ ఉంటుందని రక్షణరంగం భావిస్తోంది. ఎడిఎ ఇందుకోసం ముందు ఆసక్తి ఉన్న పార్టీల దరఖాస్తులను కోరుతూ నోటిఫికేషన్ జారీచేస్తుంది. రక్షణమంత్రిత్వశాఖలో ఎడిఎ ఒక స్వతంత్ర ప్రతిపత్తికలిగిన వ్యవస్థ కావడం, యుద్ధవిమానాల తయారీలో నైపుణ్యం ఉండటంతో ఈ సంస్థ ఆధ్వర్యంలోనే కొత్త 5వ జెన్ యుద్ధవిమానం రూపొందుతోంది. అధునాతన ఆయుధాలను సైతం తీసుకెళ్లే సామర్థ్యంతో ఈ యుద్ధవిమానం ఉంటుంది. భారతీయ వాయుసేన అవసరాలకు తగినట్టుగా నిర్మిస్తారు. 2030 తర్వాతనుంచి ఈ విమానాల తయారీ ప్రారంభిస్తారు. మెరుపుదాడులు, అతిసమీపంనుంచి దాడులు, స్వింగ్‌రోల్ వంటివి ఈ విమానం ప్రత్యేకతలు. అంతేకాకుండా భావితరం క్షిపణులు కూడా ఈ విమానంలో తీసుకెళ్లేవిధంగా ఏర్పాట్లు ఉంటాయి. కేవలం అమెరికా, రష్యా,చైనాలు మాత్రమే ఇప్పటి వరకూ ఐదోతరం యుద్ధవిమానాలు రూపొందించాయి. ఈ విమానం రెండి ఇంజన్ల మధ్యతరహా మల్టీరోల్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా పనిచేస్తుంది. 25 టన్నుల బరువుతో అధునాతన శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో రూపొందుతుంది.

## ఆపరేషన్ సిందూర్‌పై బిఎస్‌ఎఫ్ విడియో

### 2.2 కిలోమీటర్లు దూసుకుపోయి ధ్వంసంచేసాం: బిఎస్‌ఎఫ్ ఐజి శశాంక్ ఆనంద్

**శ్రీనగర్, మే 27:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' ను విజయవంతంగా చేపట్టిన విషయం తెలిసిందే. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను త్రివిధదళాలు సమన్వయంతో ధ్వంసం చేశాయి. కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించి ఉగ్రమూకల పనిపట్టాయి. ఇక ఆపరేషన్‌కు సంబంధించిన దృశ్యాలను మన బలగాలు గత కొన్ని రోజులుగా ఎక్స్ వేదికగా షేర్ చేస్తున్నాయి. తమ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తూ శత్రుదేశాలకు స్ట్రాంగ్ మెసేజ్ ఇస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ వివరాలను వివరిస్తూ.. తాజాగా బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కూడా ఆ తరహా విడియోని పంచుకుంది. అందులో మూడు టెర్రర్ లాంచ్ ప్యాడ్‌లను ధ్వంసం చేసినట్లు చూపించింది. ఈ మేరకు పాక్‌లో 2.2 కిలోమీటర్ల దూరం చొచ్చు కెళ్లి ఉగ్రవాద స్థావరాలపై భారత సాయుధ దళాలు ఖచ్చితమైన దాడులను నిర్వహించారు. పాక్ ఆర్మీ పోస్టులపై కూడా దాడిచేసి ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను జమ్ము ఫ్రాంటియర్ బీఎస్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శశాంక్ ఆనంద్ విడుదలచేసారు. మే 9, 10 తేదీల మధ్య రాత్రి సరిహద్దు సమీపంలో లష్కరే తోయిబాకు చెందిన లూని ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌ను నాశనం చేశాం. ఆర్ఎస్ పురా సెక్టార్‌కు ఎదురుగా ఉన్న మస్త్‌పూర్ అనే మరో లాంచ్‌ప్యాడ్‌ను కూడా ధ్వంసం చేశాం. భారత దళాల దాడులతో పాక్ రేంజర్లు అక్కడి నుంచి పారిపోయారని జమ్ము ఫ్రాంటియర్‌లోని బీఎస్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ అన్నారు.

## కర్ణాటకలో ఇద్దరుబిజెపి ఎమ్మెల్యేలపై
# బహిష్కరణ వేటు



**బెంగళూరు, మే 27:** ఇద్దరు బిజెని ఎమ్మెల్యేలపై బహిష్కరణ వేటు పడింది. పార్టీ నియమాలను ఉల్లంఘించారనే కారణంతో బిజెపి వారిపై వేటు వేసింది. కర్ణాటకకు చెందిన ఇద్దరు బిజెపి ఎమ్మెల్యేలు ఎస్టీ సోమశేఖర్, ఎ శివరామ్ హెబ్బర్ ఆరేసి ఏళ్లపాటు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీకి చెందిన కేంద్ర క్రమశిక్షణ కమిటీ తెలిపింది. ఈ ఏడాది మార్చి 25న ఆఇద్దరు ఎమ్మెల్యేలకు పార్టీ షోకాజ్ నోటీసులు ఇచ్చిందని, ఆ నోటీసులకు వారు సమాధానాలు ఇచ్చారని, వారిచ్చిన సమా ధానాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతనే వారిపై బహిష్కరణ వేటు వేశామని బిజెపి కేంద్ర క్రమశిక్షణ కమిటీ తెలిపింది. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల సందర్భంగా వారు పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటు వేశారని, దానిపై షోకాజ్ నోటీసు ఇచ్చినా వారి నుంచి సరైన సమాధానం రాలేదని, అందుకే ఆ ఇద్దరిపై బహిష్కరణ వేటు వేశామని పేర్కొంది.

# కారులోనే కుటుంబం ఆత్మహత్య!

### కోట్ల రూపాయల్లో అప్పు, వ్యాపారంలో నష్టాలు



**చండీఘర్, మే 27:** కోట్లరూపాయల్లో అప్పులు పేరుకుపోవడం, వ్యాపారంలో నష్టాలు పెరిగిపోయి ఒక కుటుంబం మొత్తం కారులోనే ఆత్మహత్యకు పాల్పడింది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌కు చెందిన కుటుంబం హర్యానాలోని పంచకుల వద్ద రాత్రివేళ ఈ ఆత్మహత్యకు పాల్పడింది.

కుటుంబంమొత్తం విషరసాయనాలు సేవించి కారులోనే ఆత్మహత్యచేసుకున్నారు. పంచకుల సెక్టార్ 27వద్ద పార్కుచేసిన కారులో మొత్తం అందరూ విగతజీవులై పడి ఉన్నారు. వెనుక అద్దాలను ఒక టవల్‌తో కవర్‌చేసారు. కారును లోపలినుంచే లాక్‌చేసారు. ఆరోడ్డున పోయే పాదచారులు అనుమానం వచ్చి తొంగిచూస్తే లోపల స్పృహతప్పి పడి ఉన్న వ్యక్తులను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్షణ స్పందన వాహనాలు వెంటనే స్పాట్‌కు వచ్చాయి. కారులో ఏడుగురు ఉన్నట్లు గుర్తించి వారంతాకూడా స్పృహలో లేనట్లు గుర్తించారు. సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

పంచకులలో భాగేశ్వర్‌ధామ్ ఏర్పాటుచేసిన హనుమాన్‌కథను వీక్షించేందుకు వారంతా బయలుదేరినట్లు తేలింది. కార్యక్రమం ముగిసాక వారంతా డెహ్రాడూన్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలోనే ఈ ఆత్మహత్యలకు పాల్పడినట్లు తేలింది.

42 ఏళ్ల ప్రవీణ్ మిట్టల్; తండ్రి దేశ్‌రాజ్ మిట్టల్, ఆయన భార్య, ప్రవీణ్ భార్య,మరో ముగ్గురుచిన్నారులు, ఇద్దరుటీనేజి కుమార్తెలు, ఒక కుమారుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు తేలింది. ఈ కుటుంబానికి టూర్స్ ట్రావెల్స్ బిజినెస్ ఉంది. ఈవ్యాపారం విపరీత నష్టాల్లో ఉన్నట్లు తేలింది. పోలీసులువచ్చిన తర్వాత కూడా వారిలో మిట్టల్ ఒక్కటే కొన ఊపిరితో ఉన్నాడు. తీరా ఆసుపత్రికి తీసుకెళ్లాక చనిపోయినట్లు తేలింది. చేతిరాతతో రాసిన లేఖను కారునుంచి స్వాధీనంచేసుకున్నారు. పంచకుల డిప్యూటి కమిషనర్ హిమానరది కౌశిక్, లా అండ్ ఆర్డర్ డిసిపి అమిత్ దహియాలు ఆ ప్రాంతానికిచేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ఆరుగురిని ఓజాస్ ఆసుపత్రికితీసుకెళ్లారు. అయితే అప్పటికే వారు చనిపోయినట్లు ఆసుపత్రి వర్గాలు ధృవీకరించాయి. మరో వ్యక్తిని సివిల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆతడిని కూడా చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారు. ప్రాథమికంగా ఇదొక ఆత్మహత్యకేసుగా నిర్ధారించారు. ఆర్థిక సమస్యలే ఈ ఆత్మహత్యకు కారణమని గుర్తించారు. పంచకులలో నివసిస్తూ వ్యాపారం నిర్వహించారు.

తొలినాళ్లలో ఆర్థికంగా సజావుగానే సాగిన తర్వాత డెహ్రాడూన్‌కు వెళ్లిన తర్వాతనుంచి వ్యాపారం నష్టాల్లో నడిచింది. దీనితో కోట్లరూపాయలు అప్పు పేరుకుపోయింది. మృతదేహాలను సివిల్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.



ప్రజావాణిలో చిన్నారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ఇటలీ మహిళ

## మైస్కూల్ నిర్వాహకులపై స్థల యజమాని దౌర్జన్యం

### ప్రజావాణిలో ఇటలీ మహిళ దరఖాస్తు, స్పందించిన చిన్నారెడ్డి,దివ్య

**హైదరాబాద్ (బేగంపేట), మే 27,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 25లో స్థలాన్ని లీజుకు తీసుకుని నిర్వహిస్తున్న మై స్కూలు ఇటలీ విద్యా సంస్థ ప్రాంగణంలో స్థల యజమాని రోనక్ యార్ ఖాన్ అతని అనుచరులు దౌర్జన్యం చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటలీకి చెందిన ఎన్నారై డాక్టర్ వల్లూరు అపర్ణ మంగళవారం సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు(దరఖాస్తు) చేసారు. ఆమె ఇచ్చిన దరఖాస్తుపై స్పందించిన ప్రజావాణి ఇంచార్జ్ డా.జి.చిన్నారెడ్డి,స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవ రాజన్‌లు వెంటనే సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు ఫోన్ చేసి ఈ దరఖాస్తుపై ఎండార్స్‌మెంట్ చేసారు.బాధితురాలికి న్యాయం చేయాలని సైబరాబాద్ సీపీకి సూచించారు. హైద రాబాద్‌కు చెందిన డాక్టర్ వల్లూరు అపర్ణ 35సం వత్సరాల కిందట యూకేలో డిగ్రీ,పీజీ ,పీహెచ్‌డీ పూర్తి చేసి ఇటలీకి చెందిన ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ పెప్పోను వివాహం చేసుకుని ఇటలీలో స్థిర పడ్డారు.మాతృదేశంపై మమకారంతో దేశంలోని పలు రాష్ట్రాల్లో డాక్టర్ అపర్ణ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ హైదరాబాద్‌లో మై స్కూల్ ఇటలీ విద్యాసంస్థను నెలకొల్పాలని రోనక్ యార్‌ఖాన్‌కు చెందిన ఎకరం స్థలాన్ని 2027వరకు లీజు అగ్రిమెంట్ చేసుకుని స్కూలు ఏర్పాటుకు సన్నా హాలు చేస్తుండగా స్థల యజమాని వెంటనే ఖాళీ చేయాలంటూ బెదిరిస్తున్నాడంటూ ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వివాదంపై ఇప్పటికే మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. అయినప్పటికీ దాడులు చేయడం, బెదిరిస్తుండటంతో మంగళవారం ప్రజావాణిలో డా.చిన్నారెడ్డి, దివ్యలకు ఫిర్యాదు చేసినట్లు బాధి తురాలు వల్లూరు అపర్ణ తెలియజేసారు.

**ప్రజావాణికి 247 దరఖాస్తులు**

మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మానికి మొత్తం 247దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 31దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 55దరఖాస్తులు,మున్సిపల్‌శాఖకు సంబంధించి 16దరఖాస్తులు, హోంశాఖకు సం బంధించి 14దరఖాస్తులు,ఇందిరమ్మ ఇండ్ల కోసం 57దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 58దరఖాస్తులు,ప్రవాసీప్రజావాణికి 12దం ఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు.

## సామాజిక ఉద్యమంగా 'వనమహోత్సవం': మంత్రి సురేఖ



**హైదరాబాద్,మే 27,ప్రభాతవార్త:** వనమహోత్స వం కార్యక్రమాన్ని సామాజిక ఉద్యమంగా చేపట్టాలని అటవీ పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వనమహోత్సవ కార్యక్రమాలపై మం గళవారం సచివాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రవ్యా ప్తంగా పచ్చదనాన్ని విస్తరింప చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిఏడాది మొక్కలు పెంచే కార్యక్రమాన్ని వన మహోత్సవం పేరిట చేపడు తుందన్నారు.గత ఏడాది అనుభవాల ఆధారంగా మరింత పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారు లను మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో..అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు సన్నద్ధం అవ్వాలని మంత్రి సురేఖ ఆదేశించారు.జిల్లాల్లో జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని సూచించారు.2024 సం వత్సరం రాష్ట్రవ్యాప్తంగా 20.02 కోట్ల మొక్కలు నాటాలని ప్రణాళికలు వేసుకోగా 19.04 కోట్లు నాటినట్టు మంత్రి గుర్తుచేశారు.95 శాతం మేరకు అంచనాలు రీచ్ అయినట్టు వెల్లడించారు.ఈ సారి 100శాతం టార్గెట్ రీచ్ కావాలని దిశానిర్దేశం చేశారు.ప్రతి గ్రామంలో వన నర్సరీల ద్వారా మొక్కలు పెంచి అదే గ్రామంలో నాటించడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు.గతంలో ఎదురైన అనుభవాలు, తప్పిదాలు పునరావృత్తం కాకుండా అవసరమైన జాగ్రత్తలను అధికారులు తీసుకోవాలన్నారు.ప్రతీ ఇంటికి మొక్కలు ఇచ్చి నాటేందుకు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రజలు అడిగిన మొక్కలను అందజేయడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.ఇండ్లలో ప్రధానంగా పెంచే గులాబీ,మందార,గన్నేరు, సీతాఫలం, జామ, ఉసిరి, అల్ల నేరేడు, మునగ, కానుగ, తులసి, ఈత మొక్కలతో పాటు పలు ఔషద మొక్కలు,పూల మొక్కలను సిద్ధం చేయాలని ఆదే శించారు. పూల మొక్కలను ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు,కమ్యూనిటీ కేంద్రాలు,వైద్య శాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠ శాలలు, కళాశాలల ఆవరణల్లో నాటేందుకు ప్రణాళిక రూపొందించాలని మంత్రి ఆదేశిం చారు. గతం కంటే ఈసారి మాన్ సూన్ ముందే వచ్చిందని,అందరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. ఏ ఏరియాలో ఎటువంటి చెట్లు నాటాలో గుర్తించి ఆవిధంగా ముందుకు వెళ్ళాలన్నారు.ఈ వనమ హోత్సవంలో ఈత, తాటి, వేప,చింత,కుంకుడు మొక్కలు నాటించాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వారిని గుర్తించి ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మొక్కల పెంపకంలో ప్రత్యేకంగా కృషి చేసిన వారికి పలు విధాలుగా గుర్తింపు ఇవ్వాలన్నారు. వనజీవి రామయ్యవంటి మహనీయుల కుటుం బీకులను సన్మానించాలన్నారు. ఈ సమావేశంలో అటవీశాఖ ప్రిన్సిపల్‌సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డాక్టర్‌సువర్ణ, ఎంఏయూడీ సెక్రటరీ టీ కే‌శ్రీదేవి,ప్రియాంకవర్గీస్ తదితరులు పాల్గొన్నారు.



## నేను పార్టీ మారడం లేదు

### కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతారావు

**హైదరాబాద్, మే 27 ప్రభాతవార్త:** తాను పార్టీ మారుతున్నానని అంటూ తప్పుడు ప్రచారం చేస్తు న్నారని, అది పూర్తిగా అవాస్తవం అని కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడి యాతో మాట్లాడారు. తాను పార్టీ మారుతు న్నానని, వస్తున్నవన్నీ వదంతులన్నీ నమ్మవద్దని అన్నారు. నేను ఏ పార్టీ మారను అధిష్టానం నిర్ణయం ప్రకారం కట్టుబడి ఉంటానని తెలి పారు. అదేవిధంగా తాను అందుకున్న క్రమ శిక్షణ నోటీసుపై స్పందించారు. ఏదైతే నోటీస్ వచ్చిందో దానికి జవాబు ఇవ్వడం, ఫోన్ ద్వారా మాట్లాడటం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, అదేవిధంగా ఇటీవల ఢిల్లీకి వెళ్లిన ప్పుడు జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబను స్వయంగా కలిసి మాట్లాడటం జరిగిందన్నారు. గాంధీ భవన్‌లో జరిగిన విషయాలు చాలా బాధాకరం, ఉద్దేశ్య పూర్వకంగా చేసింది కాద న్నారు. తాను చేసినా, తన మహిళా కాంగ్రెస్ నాయకులు ఎవ్వరు చేసిన బాధ్యత తనదే అని పెద్ద మనసు చేసి అందరూ తనను, మహిళ కాంగ్రెస్ నాయకులను క్షమించవల సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను, కాంగ్రెస్ అధిష్టా నను కోరడం జరిగింది.

**మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు శిక్షణ:** జూన్ 3వ తేది నుంచి ఢిల్లీలోని పార్టీ కార్యాలయం ఇం దిరా భవన్‌లో మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షు లకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరి గిందని కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతా రావు తెలిపారు. ప్రతి మంగళవారం రాష్ట్రం నుంచి ఐదుగురు జిల్లా అధ్యక్షులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

## రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలి

### బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్



**హైదరాబాద్, మే 27 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ అన్నారు. మంగళ వారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిసారీ కేంద్రంపై విమర్శలు చేస్తూ కాలయాపన చేస్తూ వచ్చారని విమర్శించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన 10వ నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొనడం సానుకూలమైన విషయమే, కానీ ఆ సమావేశ స్ఫూర్తికి అనుగుణంగా రాష్ట్రంలోని ఎంఎస్‌ఎంఇల బకాయిలుగా ఉన్న విద్యుత్, ఇన్‌పుట్, ఫైనాన్స్ సబ్సిడీలను వెంటనే విడుదల చేయాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. వికసిత్ రాజ్యం నుంచి వికసిత్ భారత్‌గా ముందడుగు వేసే లక్ష్యంతో జరిగిన నీతి ఆయోగ్ 10వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం దేశ అభివృద్ధిలో మైలురాయిగా నిలిచేలా ఉందన్నారు. ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందితేనే దేశం వికసిత్ భారత్‌గా మారుతుందని కేంద్ర ప్రభుత్వం నమ్మకం వ్యక్తం చేసింది. ఈ దిశగా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించి నీతిఆయోగ్ సమావేశం నిర్వహించింది. అభివృద్ధి, పాలన పరంగా కీలక సలహాలు, సూచనలు చేసింది. ము ఖ్యమంత్రుల అభిప్రాయాలను కూడా తీసుకుం దన్నారు. నీతి ఆయోగ్ సమావేశం స్ఫూర్తికి అను గుణంగా కేంద్ర పథకాలను తెలంగాణలో అమలు చేయాలని బిజెపిస్పష్టంగా డిమాండ్ చేస్తుంద న్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విష యంలో తీసుకునే చర్యలను భారతీయ జనతా పార్టీ నిశితంగా పరిశీలిస్తుందన్నారు.


## జూన్ 2ను ఘనంగా నిర్వహించాలి

### బిఆర్ఎస్ శ్రేణులకు కెటిఆర్ పిలుపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే27:** జూన్ 2వ తేదీన తెలంగాణ భవన్‌లో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. అన్ని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాలతో పాటు నియోజకవర్గాలు, మున్సిపాలిటీలు, పట్టణాలు, మండలాల్లో జాతీయ జెండాను, పార్టీ పతాకాన్ని ఎగురవేసి, పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహిం చాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జూన్ 2వ తేదీన పార్టీ వ్యవస్థాపక సభ్యులు, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి పాల్గొని జాతీయ జెం డాను, పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తారని, ఈ వేడుకల్లో పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అలాగే తెలం గాణ వ్యాప్తంగా అన్ని జిల్లా పార్టీ కార్యాలయాల్లో పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జాతీయ జెండాతో పాటు పార్టీ జెండాలను ఎగరేసి సంబరాలు జరపాలని కోరారు. తెలంగాణ తొలి ముఖ్య మంత్రి కేసీఆర్ చేసిన ప్రతి ఆలోచన అనేక రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర సర్కార్ కు కూడా దిక్సూ చిగా నిలిచిందని పేర్కొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయాలి

### జెఎసి నిరాహార దీక్షలో పలువురు ఉద్యమకారుల డిమాండ్



మంగళవారం నిరాహార దీక్షలో నినాదాలు చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కమిటీ నేతలు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మే 27, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును తక్షణమే ఏర్పాటుచేయాలని తెలంగాణ ఉద్యమ కారుల జేఏసీ ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రటరీ జనరల్ ప్రఫుల్ రామిరెడ్డిలు డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలం గాణ ఉద్యమకారులను గుర్తించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరాహారదీక్ష నిర్వ హిం చారు. ఈ దీక్షనుద్దేశించి వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి, వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు నాలుగు గదుల ఇళ్లను నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రతినెల 30వేల రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని, అమరవీరుల స్మృతివనంను 100 ఎకరాలలో ఏర్పాటుచేయాలని, రాజకీయరిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శులు బత్తుల సోమయ్య, క్రిష్టఫర్, లావణ్యలు మాట్లాడుతూ ఉద్యమకారుల, అమరుల కుటుంబాలకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు.

ఈ నిరాహార దీక్షకు ఉద్యమ కారులు చెరుకు సుధాకర్, జేఏసీ ఛీఫ్ అడ్వైజర్ బోయపల్లి రంగారెడ్డి, వైస్ ఛైర్మన్ తుల్జారెడ్డి, అన్వర్ పటేల్, గోకె పద్మ, సుజి, మహిళా అధ్యక్షులు కోలి మాధవి, ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, కళాకారులు పెద్ద యాదగిరి బృందంతో పాటు ఉద్యమకారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## సైబర్ నేరస్తులకు బ్యాంకు ఖాతాలు అందజేస్తున్న నేరగాళ్ల పట్టివేత

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** విదేశాల్లో వున్న బడా సైబర్ నేరస్తులకు భారత్‌లో పలు చోట్ల బ్యాంకు ఖాతాలను అందజేస్తున్న ఇద్దరు నేరగాళ్లను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీకి చెందిన విజయ్ మిశ్రా, నోయిడాకు చెందిన రితీష్ సింగ్‌లు కొంతకాలంగా విదేశాల్లో వుం టున్న బడా సైబర్ నేరగాళ్లక భా రత్‌లోని పలు నగరాలలో ఆయా ప్రాంతాల లో నివసించే బీదా బిక్కి జనంతో పరిచయాలు పెంచుకుని, వారి పేరిట బ్యాంకుఖాతాలు తెరిచి పాస్ పుస్తకాలు, ఎటిఎం కార్డులను తీసుకునేవారు. ఈ క్రమంలో అమాయకులకు కొంత నగదు ఇచ్చే వారు. వీరు సమకూర్చిన బ్యాంకు ఖాతాల సహకారంతో విదేశాల్లోని సైబర్ నేరగాళ్లు భారత్‌లోని అమా యకులను మోసం చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న సిటీ సైబర్ క్రైం పోలీసులు విజయ్ మిశ్రా, రితీష్ సింగ్‌లను ఢిల్లీ లో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించి ఇక్కడి కోర్టులో హాజరు పరిచి జైలుకు రిమాండుకు పంపారు. నిందితుల నుంచి పెద్ద ఎత్తున నకిలీ పాన్ కార్డులు, ఆ ధార్ కార్డులు, సిం కార్డులు, డెబిట్ కార్డులను జప్తు చేశారు.

## ఉద్యోగులను బెదిరిస్తే కఠిన చర్యలు: ఎసిబి డిజి హెచ్చరిక

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** ఎసిబి అధి కారుల పేరిట ప్రభుత్వ ఉద్యోగులను ఎవరైనా బెదిరించినా. డబ్బులు డిమాండ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ విభాగం డిజి విజయ్ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మీడియాకు ప్రకటన విడుదల చేస్తూ నకిలీ ఎసిబి అధికారుల భరతం పడతామని వెల్లడించారు. ఎసిబి అధికారులు ప్రభుత్వ ఉద్యోగులను డబ్బులు డిమాండ్ చేయ రని, బెదిరించరని ఆయన తెలిపారు. కొందరు మోసగాళ్లు నకిలీ ఎసిబి అధికారుల పేరిట వసూళ్లకు పాల్పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లా టేకు లపల్లి పోలీసు స్టేషన్‌లో ఓ నకిలీ ఎసిబి అధికారి పట్టుబడితే అతనిపై కేసునమోదు చేశామని విజయ్‌కుమార్ తెలిపారు.ఎసిబి అధికారుల పేరి ట ఎవరుఫోన్ చేసిన వెంటనే 1064కు ఫోన్ చే యాలని, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా వుంచుతామని ఎసిబి డిజి తెలిపారు.

## జూన్ 3 నుంచి ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

### 42,832 మంది దరఖాస్తు, 150 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు: ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కృష్ణారావు

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జూన్ 3 నుంచి రాష్ట్రంలో 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లను విడుదల చేసినట్టు ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ ఏ కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 3 నుంచి 13 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీ క్షలు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలకు రాష్ట్రంలో 42832 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో బాలురు 26,286మంది, బాలికలు 16,546మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రంలోని 150పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. విద్యా ర్థులకు సంబంధించిన హాల్‌టిక్కెట్లు, ముద్రిత నామినల్‌రోల్స్ రాష్ట్రంలోని పాఠశాలలకు పంపిం చారు. విద్యార్థులు తమహాల్‌టిక్కె ట్లను సంబం ధితపాఠశాల ప్రధానోపాధ్యాయుడి నుండి పొం దవచ్చని, అలాగే హాల్‌టిక్కెట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌కార్యాలయం అధికారిక వెబ్‌సైట్‌లో అందు బాటులో ఉన్నాయని కృష్ణారావు తెలిపారు.

## కెటిఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి

### ఫిషర్‌మెన్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టుసాయికుమార్

**హైదరాబాద్, మే 27 ప్రభాతవార్త:** మాజీ మంత్రి కెటిఆర్ మాట అదుపులో పెట్టుకొని పొదుపుగా మాట్లాడాలని ఫిషర్‌మెన్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టుసాయికుమార్ అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లా డారు. తెలంగాణ రాజకీయ వ్యవస్థలో అజ్ఞాని కెటిఆర్ అంటూ మండిపడ్డారు. రాత్రి తీసుకున్న డ్రగ్స్‌తో తెలంగాణ భవన్‌లో కూర్చొని మాటలు మాట్లాడుతున్నాడన్నారు. డ్రగ్స్ టెస్టుకు సిద్ధమా అన్న ఛాలెంజ్‌కి భయపడ్డ కెటిఆర్‌కు రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు.

తెలంగాణ సమాజాన్ని పది సంవత్సరాలు పీల్చుకొని తిన్నారన్నారు. మీ సోదరి కవిత దయ్యం అనే పదం నీ గురించా, నీ మామ గురించా మీకే తెలియాలన్నారు. వైఎస్సార్‌ని ఆదర్శంగా తీసుకొని రేవంత్ రెడ్డి స్వర్ణయుగం లాగ తెలంగాణను పాలిస్తున్నాడని అన్నారు.

## రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి సీతక్క

**హైదరాబాద్,మే 27 ,ప్రభాతవార్త:** యువత రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఒక ప్రకట నలో విజ్ఞప్తి చేశారు.ఉపాధి అవకాశల కల్పన కోసం రాజీవ్ యువ వికాసం ద్వారా జూన్ 2న లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందచేయ నున్నట్లు తెలిపారు. రూ.లక్షలోపు యునిట్లకు మొదటి దశలో ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించినట్లు తెలిపారు.రాష్ట్ర ఆవిర్భావ దినో త్సం రోజు ఎంపికైన లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందించనున్నట్లు తెలిపారు.ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తూనే..మరో వైపు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామ న్నారు. మొదటి విడతలో రూ.లక్షలోపు యూని ట్లకు ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించిందన్నారు.

## బిసిలకు రిజర్వేషన్ల అమలు తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

### లేకపోతే ఆమరణ నిరాహారదీక్ష, రాహుల్‌గాంధీ ఇంటిని ముట్టడిస్తాం: ఆర్.కృష్ణయ్య హెచ్చరిక



మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో నీల వెంకటేష్, అనంతయ్య తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 27 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు స్థానిక సంస్థల్లో కల్పించిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రంలో బిసి సంఘాలకు చెందిన 1000 మంది నాయకులు ఆమరణ నిరాహారదీక్ష చేపడతారని, రాష్ట్రంలో యుద్ధమే జరుగుతుందని, ప్రభుత్వాన్ని స్తభింప జేస్తామని, అవసరమైతే ఢిల్లీలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఇంటిని కూడా ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సన్నహాలు చేస్తున్నట్లు తెలుస్తున్నదని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు పెంచే విషయంలో సరైన క్లారిటి ఇవ్వడం లేదని, ఒక్కొక్కసారి ఒకో రకంగా ప్రచారం చేసుకుంటున్నదన్నారు. ఈ సమావేశానికి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షత వహించగా, నాయకులు అనంతయ్య, పగిళ్ళ సతీష్, రాందేవ్, మణికంఠ, చిక్కుడు బాలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వం పరుగులు తీస్తుంటే

### వరుస ఓటములతో కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు: బిజెపి ఎంపి డా.లక్ష్మణ్

**హైదరాబాద్, మే 27 ప్రభాతవార్త:** దేశం నరేంద్ర మోడీ ప్రభుత్వ పాలనలో పరుగులు తీస్తుంటే వరుస ఓటములను జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలతో విషం చిమ్ము తున్నారని రాజ్యసభ సభ్యులు, బిజెపి ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మణ్ మండిపడ్డారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధులు ఎన్.వి.సుభాష్, గంగాపురం వెంకట్ రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు తాడూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. మోడీ ప్రభుత్వం 11ఏళ్ల సుపరిపాలన పట్ల అప్రకటిత ఎమర్జెన్సీ అచ్చేదిన్ పీడకలగా మారి పోయిందంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 1975లో మీడియా స్వేచ్ఛను కాలరాసిన వాస్త విక ఎమర్జెన్సీ కాంగ్రెస్ పాలనలోనే జరిగిందని చురకలు అంటించారు. మోడీ పాలనలో ప్రజా స్వామ్య వ్యవస్థలు బలోపేతం అయ్యాయ న్నారు. న్యాయభారతీయ జనతా పార్టీకి ఎన్నికల వరకే రాజకీయాలు చేస్తుందని ఆ తర్వాత దేశాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. భారతీయ జనతా పార్టీ తెలం గాణ ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలపై పోరాటం కొనసాగిస్తుందన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### ఎండి విసి సజ్జన్నార్



**హైదరాబాద్ (చిక్కడపల్లి), మే 27 ప్రభాతవార్త:** టీజీఎస్‌ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి యాజమా న్యం కట్టుబడి ఉందని, రాష్ట్ర ప్రభుత్వ సహకా రంతో పెండింగ్ అంశాలను దశల వారీగా పరిష్కరిస్తామని సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ స్పష్టం చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి టీజీఎస్ ఆర్టీసీ కళాభవన్‌లో రాష్ట్రస్థాయి ఎంప్లాయ్ వెల్ఫేర్ బోర్డు సభ్యులతో యాజమాన్యం మంగళవారం సమావేశమైంది. ఈ సమావేశానికి సంస్థ ఎండీ వీసీ సజ్జనర్‌ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో కలిసి ఆయన వెల్ఫేర్ బోర్డు సభ్యులనుంచిసూచనలు, సలహాలను స్వీక రించారు. ఆర్టీసీలో 3036 రెగ్యూలర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, సాంకేతిక కారణాల వల్ల నియామక ప్రక్రియలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఆ నియామకాలు కచ్చితంగా జరుగుతాయని, అందులో ఎలాంటి అనుమానాలు అవసరం లేద న్నారు. తమ మనుగడ కోసం ఐదారు నెలలుగా కొందరు రెచ్చగొట్టే విధంగా మాట్లా డుతున్నా ఉద్యోగులు ఎంతో సమయమనంతో ఉన్నారని చెప్పారు. ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీ కొనుగోలు చేసేలా అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఈ కార్యక్ర మంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ముని శేఖర్, ఖుస్రోషా ఖాన్, సాలోమన్, వెంకన్న, రాజశేఖర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్పతో పాటు హెచ్‌ఒడీలు, తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్‌సి నోటిఫికేషన్‌పై నిర్ణయం తీసుకోవాలి

### రెవెన్యూ శాఖ మంత్రికి తెలంగాణ రాష్ట్ర డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీ కోసం డిఎస్‌సి నోటిఫికేషన్‌పై త్వరగా నిర్ణయం తీసుకోవాలని తెలంగాణరాష్ట్ర డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సం ఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితోపాటు విద్యాశాఖ అధికారులకు తెలంగాణ రాష్ట్ర డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం మంగళవారం విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో ఇప్పటికే టెట్ నోటిఫికేషన్ జారీచేసి పరీక్షల షెడ్యూల్‌ను కూడా ప్రకటించి నందున డిఎస్‌సి నోటిఫికేషన్‌పై త్వరగా నిర్ణ యం తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరీశ్ నాయకులు వీరబాబు, రమణ చారి కోరారు. టీచర్ పోస్టులతోపాటు ప్రమోషన్స్ ద్వారా ఏర్పడిన ఖాళీలను కలిపి పూర్తిస్థాయి ఖాళీలు సుమారు 10వేల వరకు ఉంటాయ న్నారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీ కోసం వెంటనే డిఎస్‌సి నోటిఫికేషన్‌ను జారీ చేయా లని దాంతోపాటు మోడల్ స్కూల్ నోటిఫికేషన్ జారీ చేయాలని.. ఇదేఅంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటిని కలిసి వినతి పత్రం సమర్పించినట్టు తెలిపారు. స్పందించిన మంత్రి ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్టు సంఘం నాయకులు తెలిపారు. టెట్ పరీక్షల షెడ్యూల్ జిల్లాల వారీగా త్వరగా ఇచ్చి పరీక్ష కేంద్రాలకి సంబంధించి అభ్యర్థులు ఇచ్చిన తొలి, రెండవ ఆప్షన్స్‌ప్రకారమే కేటాయింపు చేసేలా చూడాలని వారు విద్యా శాఖ అధికారులను కోరారు.

## బెదిరింపులకు పాల్పడ్డ కార్పొరేటర్‌పై కేసు

**హైదరాబాద్(కుత్బుల్లాపూర్), మే 27, ప్రభాతవార్త:** డబ్బుల వసూల విషయంలో బెదిరింపులకు పాల్పడ్డ సూరారం కార్పొరేటర్‌పై కేసు నమోదం య్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గాజులరామారంకు చెందిన అంజన్ గౌడ్ అనే వ్యక్తినుండి డబ్బుల వసూల విషయంలో వివా దం చోటు చేసుకుంది. కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ తనని చంపటానికి బెదిరించా డని జీడిమెట్ల పోలీసులకు అంజన్ గౌడ్ ఫిర్యా దు చేశాడు. కేసు నమోదు లో నిర్లక్ష్యం చేశారనే ఆరోపణతో అంజన్‌గౌడ్ ఉరి వేసుకుని ఆత్మ హత్యయత్నానికి పాల్పడ్డాడు. ఇది గుర్తించి పోలీ సులు అతనికి నచ్చచెప్పి కార్పొరేటర్‌పై కేసు నమోదు చేశారు.

## ప్రజావాణిని ప్రశంసించిన అమెరికన్లు



ప్రజావాణిని సందర్శించిన అమెరికన్లను సత్కరించిన చిన్నారెడ్డి,దివ్య.

**హైదరాబాద్ (బేగంపేట), మే 27,ప్రభాత వార్త:** ముఖ్యమంత్రి ప్రజావాణితో ప్రజల సమస్యలు సత్వరంగా పరి ష్కారమవుతున్నాయని,ప్రజావాణి పనితీరు ఎంతో బావుందని పలువురు అమెరికన్లు అభిప్రాయం వ్యక్తం చేసా రు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజావాణిని సందర్శించిన అమెరికన్లు ప్రజావాణి పనితీరును పరిశీలించారు. అమెరికాకు చెందిన పారిశ్రామిక వేత్తలు రాబర్ట్ హాల్,శ్రీక్స్ సూగోడ్, చరణ్ గుంటీలు సందర్శిం చారు. ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించడం, హెల్ప్‌డెస్క్,ఎన్నారైల కోసం ఏర్పాటు చేసిన ప్రవాసీ ప్రజావాణి డెస్క్‌ను అమెరికన్ల బృందం పరిశీలించింది.ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ ,సీఎం ప్రజావాణి ఇంచార్జి డా.జి. చిన్నారెడ్డి,స్టేట్‌నోడల్ అధికారి దివ్య దేవరాజన్ లను కలిసారు.ఈ సందర్భంగా అమెరికన్ల బృందాన్ని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరిం చారు.వారికి సీఎం ప్రజావాణిలో అందిస్తున్న సేవలను గురించి వివరించారు.

# అడవుల్లో పులులకు 'విద్యుత్ షాక్'

**వేటగాళ్ల విద్యుత్‌తీగల బారిన పడి మృతి చెందుతున్న పులులు**
**వాటి సంరక్షణకు కవర్ కండక్టర్లు ఏర్పాటు**
**ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అటవీశాఖ అధికారులు**



**హైదరాబాద్,మే 27,ప్రభాతవార్త:** తరచుగా అడవుల్లో విద్యుత్ షాక్‌తో పులులు మరణిస్తున్నాయి. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు దర్యాప్తు నిర్వహించగా దానికి ప్రధాన కారణం వేటగాళ్ళే అని తేలింది. తెలంగాణ అటవీ ప్రాంతాల్లో పులుల వేటగాళ్ల విద్యుత్ ఉచ్చులను ఏర్పాటు చేసి పులులను హతమార్చుతున్నారు. ఈ వేటగాళ్లు పులుల గోళ్లు, చర్మాన్ని అక్రమంగా విక్రయిస్తు న్నారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న పులులే లక్ష్యంగా యంగా దందా సాగుతోంది. ఈ సమస్యకు పరిష్కారంగా విద్యుత్ తీగలకు కవర్డ్ కండక్టర్స్ ఏర్పాటు చేయాలని అటవీ అధికారులు సూచిస్తున్నారు. అటవీ, విద్యుత్ శాఖల మధ్య సమన్వయం పులుల సంరక్షణకు అత్యవసరం. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ అటవీ ప్రాంతాల్లో పులుల సంరక్షణ తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోంది. పులుల వేటగాళ్ల పగలు పక్షుల మాదిరిగా వ్యవహరించి. రాత్రి వేళల్లో పులుల ప్రాణాలను తీస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. కేవలం పది రోజుల క్రితం కే8 అనే పులిని దారుణంగా చంపిన ఘటన మరువకముందే, మరో పులి వేటగాళ్ల విద్యుత్ ఉచ్చులకు బలైంది.ఈ సంఘటనలు రాష్ట్రంలో పులుల సంరక్షణకు మరింత పటిష్టమైన చర్యలు అవసరమని స్పష్టం చేస్తున్నాయి.వేటగాళ్లు గ్రామాల్లో విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన లైన్లకు అక్రమంగా కొండీలు వేసి,అటవీ ప్రాంతాల్లో ప్రాణాంతకమైన విద్యుత్ ఉచ్చులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఉచ్చులకు చిక్కి పులులు బలవుతున్నాయి. పులి చనిపోయిన తర్వాత, దాని గోళ్లు, చర్మాన్ని వేరు చేసి అక్ర మంగా విక్రయిస్తూ వేటగాళ్ల సొమ్ము చేసుకుం టున్నారు. ఇది కేవలం పులుల ప్రాణాలను తీయడమే కాకుండా, అటవీ పర్యావరణ వ్యవస్థకు తీవ్ర నష్టం కలిగిస్తోంది.ముఖ్యంగా మహారాష్ట్ర లోని తడోబా, తిప్పేశ్వర్, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రా వతి పులుల అభయారణ్యాల నుంచి తెలంగాణ అడవుల్లోకి వస్తున్న పులులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని అటవీ సంపదపై వేటగాళ్ల నిఘా అధికంగా ఉంటోందని అధికారులు అనుమానిస్తున్నారు. పులుల వేటగాళ్ల విద్యుత్ ఉచ్చులకు బలైపోయిన సంఘటనలు తెలంగాణలో గతంలోనూ నమోదయ్యాయి.

ఈనెల 15న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలంలోని పాతచిచ్చాల అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగను అమర్చి కే8 పులిని చంపేశారు. ఈ కేసులో మొత్తం 30 మంది నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్ అధికారి సుశాంత్ సుకుద్దేవ్ బోబాడే తాజాగా వెల్లడించారు.ఈ నెల 14న పెంచికల్‌పేట రెవెన్యూ పరిధిలోని ఎల్లూరు నల్లకుంట అటవీ ప్రాంతంలో వేటగాళ్ల విద్యుత్ తీగలను అమర్చి కే8 పులిని దారుణంగా చంపేశారు. పులిని చంపిన తర్వాత, దాని చర్మం, గోళ్లు, మీసాలు, దంతాలు తీసుకెళ్లారు. ఈ ఘటన అటవీ శాఖలో తీవ్ర కలకలం సృష్టించింది. కేసు నమోదు చేసిన అధికారులు, అనుమానితులను అదుపులోకి తీసుకొని విస్తృత విచారణ చేపట్టారు. అనేక కోణాల్లో దర్యాప్తు చేసి, నేరానికి పాల్పడిన వారితో పాటు, వారికి సహకరించిన వారిని కూడా గుర్తించారు. దర్యాప్తులో భాగంగా, ఈ కేసులో ప్రమేయం ఉన్న మొత్తం 30 మంది నిందితులను గుర్తించి, వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిని సిర్పూర్ సివిల్ కోర్టులో హాజరుపరచగా, కోర్టు వారికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో, నిందితులందరినీ ఆసిఫాబాద్ జిల్లా జైలుకు తరలించారు. ఈ అరెస్టులు అటవీ నేరాలపై ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో తెలియజేస్తున్నాయి. పులుల సంరక్షణకు సంబంధించి కఠిన చట్టాలను అమలు చేయడంతో పాటు, అటవీ ప్రాంతాల్లో నిఘాను మరింత పెంచాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.అంతే కాకుండా ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశాల అడవుల్లో వేటగాళ్ల ఉచ్చు బిగించి పులిని చంపేశారు.గోళ్లు,చర్మాన్ని అక్రమ రవాణా చేస్తుండగా అటవీ అధికారులకు పట్టుబడ్డారు. ఇలా తెలంగాణలో పలు ప్రాంతాల్లో పులులను కరెంట్ షాక్ తో చంపేస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. పులుల సంరక్షణకు అత్యంత కీలకమైన పరిష్కారం విద్యుత్ తీగలకు కవర్డ్ కండక్టర్స్ (ఇన్సులేటెడ్ కోటింగ్) ఏర్పాటు చేయాలని ఆసిఫాబాద్ డీఎఫ్ఓ నీరజ్‌కుమార్ తెలిపారు. ఇలా చేస్తే కొండీలు వేసే అవకాశం ఉండదని, అడవి జంతువులను స్మగ్లర్ల బారి నుంచి రక్షించవచ్చని ఆయన అభిప్రాయ పడ్డారు. అడవుల్లోని విద్యుత్ తీగలకు కవర్డ్ కండక్టర్స్ ఏర్పాటు చేయాలని పలుమార్లు విద్యుత్తు శాఖ అధికారులను కోరామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఆసిఫాబాద్ ఎస్ఈ శేషారావు పేర్కొన్నారు. అటవీ శాఖ, విద్యుత్ శాఖ సమన్వయంతో పనిచేసి ఈ ప్రాణాంతక విద్యుత్ ఉచ్చులను అరికట్టకపోతే, తెలంగాణ అడవుల్లో పులుల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. పులుల సంరక్షణకు ప్రభుత్వం, ప్రజలు కలిసికట్టుగా కృషి చేయాలనే అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# వరి దిగుబడిలో దేశంలోనే రాష్ట్రం అగ్రస్థానం

## గణనీయంగా పెరిగిన పంటల ఉత్పత్తులు

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** దేశంలో రికార్డు స్థాయిలో బియ్యం ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని అర్థ, గణాంకశాఖ తెలిపింది. రాష్ట్రంలో వరి పంట సాగుకు అనుకూల వాతావరణం ఉండటంతో పాటు, ప్రభుత్వ విధానాలతో గతేడాది 2024-25 సంవత్సరంలో తెలంగాణలో రికార్డుస్థాయిలో పంటల సాగు విస్తీర్ణం జరిగినట్లు వెల్లడించింది. దేశంలోనే అత్యధికంగా బియ్యం పండిస్తున్న రాష్ట్రంగా అగ్రస్థానంలో నిలిచిందని మంగళవారం అర్థ, గణాంక శాఖ తెలిపింది. రాష్ట్రంలో సాధారణ సాగు విస్తీర్ణానికి మించి వరి పంట వేయడంతో దిగుబడులు రికార్డు స్థాయిలో వచ్చాయి. గత రబీ (యాసంగి) సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 16 లక్షల హెక్టార్లు కాగా, గతేడాది ఏకంగా 24.04 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. 2023-24 వార్షిక సంవత్సరంలో రాష్ట్రంలో 168.75 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి జరిగింది. తదుపరి ఏడాది 2024-25 అంతకు ముందు ఏడాది వచ్చిన దిగుబడిని అధిగమించి ఏకంగా 183.57 లక్షల టన్నులు అదనపు ఉత్పత్తి సాధించిందని కేంద్రం తెలిపింది. గత సంవత్సరం వానాకాలం, యాసంగిలో కలిపి మొత్తం 275 లక్షల టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వచ్చింది. దీని నుంచి 183 లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తయినట్లు నివేదిక తెలిపింది. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ తర్వాత వరుసగా ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, పంజాబ్ ఉన్నాయి. ఈ నేపధ్యంలోనే వివిధ పంటలు ప్రధానంగా వరి దిగుబడులు పెరిగాయని అంచనాల్లో పేర్కొంది. వరి ధాన్యం ఒకటే కాకుండా, వివిధ రకాలకు చెందిన ఇతర పంటల దిగుబడి సైతం గతంలో కంటే పెరిగినట్లు తెలిపింది. అలాగే తృణ, చిరుధాన్యాలు కలిపి రాష్ట్రంలో 37.19 లక్షల టన్నులు, మినుములు 43,570, పెసలు 24,170, కందులు 1.99 లక్షల టన్నులు, శనగ 1.10 లక్షల టన్నులు, నూనె గింజలు 5.5 లక్షల టన్నులు పండినట్లు అర్థ గణాంక శాఖ వెల్లడించింది.

# యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు నిధులు

## 20 నియోజకవర్గాల్లోని స్కూల్స్‌కి రూ. 4వేల కోట్లకు అనుమతులు

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు నిధులు విడుదల చేసింది. రాష్ట్రంలోని 20 నియోజక వర్గాల్లో ఇప్పటికే శంఖుస్థాపనలు చేసిన 20 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు రూ. 4 వేల కోట్ల విడుదలకి పరిపాలనా అనుమతులు ఇస్తూ విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కి రూ. 200 కోట్ల చొప్పున నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది అక్టోబర్ 11న రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు ముఖ్యమంత్రితోపాటు మంత్రులు శంకు స్థాపనలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం కోసం నిధులను విడుదల చేస్తూ విద్యా శాఖ కార్యదర్శి మంగళ వారం జీవో ఆర్‌టి నంబర్ 96ను జారీ చేశారు. రాష్ట్రంలోని పేద మధ్యతరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య అందించడమే లక్ష్యంగా యంగ్ ఇండియా ఇండిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రారంభిస్తున్నట్టు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే.

# థియేటర్ల తీరు మారాలి: ప్రేక్షకులకు మెరుగైన సేవలందించాలి

**టికెట్ ధరల పెంపు సంప్రదింపులు ఇక ఛాంబర్‌ద్వారానే**
**రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందాలనే నా తపన**
**'బంద్' వెనుక జనసేన నేతలుంటే వారిపైనా చర్య**
**ఎపి డి.సిఎం పవన్ కల్యాణ్**



**విజయవాడ,మే27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సినిమా హాళ్ల నిర్వహణను పకడ్బందీగా చేపట్టడం ద్వారా ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలని ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు.ఆ దిశగా సంబంధిత ప్రభుత్వ శాఖలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. కొత్త చిత్రాలు విడుదల సందర్భంలో టికెట్ ధరలపెంపు నిమిత్తం నిర్మాతలు, వారికి సంబంధించినవారు వ్యక్తిగత హోదాలో కాకుండా తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించే విధానాన్ని అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సినిమా టోగ్రఫీ శాఖమంత్రి కందుల దుర్గేష్, ఇతర అధికా రులతో ఆయన సినిమా రంగానికి సంబంధించి వర్చువల్‌గాను.అందుబాటులతో ఉన్న అధికారులతో సమాలోచన చేసారు.ఈ సందర్భంగా మంత్రి దుర్గేష సినిమాలు హాళ్ల బంద్ ప్రకటనలు, ఈ క్రమంలో తమ శాఖద్వారా చేపట్టిన చర్యలను, తాజా పరిణామాలను ఉపముఖ్యమంత్రికి వివరిం చారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పలు కీలక సూచనలు చేశారు. టికెట్ ధరల పెంపు కావచ్చు, సినిమాహాళ్ల నిర్వహణ విషయం కావచ్చు.. ఏ విషయంలోనైనా ప్రభుత్వ శాఖలు తమ విధులను, పర్యవేక్షణనుపకడ్బందీగా చేయాల న్నారు. త్వరలో విడుదలయ్యే హరిహర వీరమల్లు సినిమాకు సైతం టికెట్ ధరల పెంపు కోసం నిర్మాత వ్యక్తిగతంగా కాకుండా చలనచిత్ర వాణిజ్య మండలి ద్వారానే ప్రభుత్వానికి అర్జీ ఇచ్చి, సంప్రదింపులు చేయాలని... ఇందులో తనమన బేధాలు పాటించవద్దు అని స్పష్టంగా చెప్పారు. తానె వ్వరిని బెదిరించను, ఉన్నదున్నట్లుగా చెబుతా నన్నారు. ఎపిలో చలనచిత్రపరిశ్రమ బాగుండాలని, ఇక్కడే షూటింగులు జరిగే పరిస్థితులుండాలన్నదే తమ ప్రభుత్వ తపన అన్నారు.తన మాటల్లో ఆవేదన తప్ప బెదిరింపులు,అదిరింపులు ఉండవన్నారు. అలాచేయ దంవలన ప్రయో జిజి జనం ఎలా ఉంటుందన్నారు.

**ప్రేక్షకులు సినిమా హాల్ వరకూ రావాలంటే..?**

టికెట్ ధర కంటే సినిమా హాల్లో పాప్ కార్న్ లాంటి తినుబండారాలు, శీతల పానీయాలు, చివరకు మంచి నీళ్ల సీసాల ధరలు సైతం భారీగా ఉండటంపై ఈ సందర్భంగా చర్చించారు. వాస్తవంగా వాటి ధరలు ఎంత ఉంటున్నాయి, ఇంతకు విక్రయిస్తున్నారు, అసలు వాటిలో ఉండే నాణ్యత ప్రమాణాలు ఏమిటనేది కూడా సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ధరల నియంత్రణ కూడా చేపట్టాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మల్టీప్లెక్సులు, సింగిల్ స్క్రీన్స్‌లో ఆహార పదార్థాలు, శీతల పానీయాల వ్యాపారంలోను గుత్తాధిపత్యం సాగుతోందనే విషయం కూడా ప్రభుత్వ దృష్టికి వచ్చినందున దీనిపై విచారణ చేపట్టాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. ప్రేక్షకులు కుటుంబ సమేతంగా సినిమా హాలుకు రావాలంటే తినుబండారాలు, పానీయాల ధరలు చూసి వెనుకంజ వేసే పరిస్థితి రాకూడదని ఉప ముఖ్యమంత్రి అభిప్రాయ పడ్డారు. ధరలు తగ్గితే ప్రేక్షకుల సంఖ్యా పెరుగుతుంది, తద్వారా పన్ను ఆదాయం కూడా పెరుగుతుంది. ఈ అంశంపై పన్నుల శాఖతో పరిశీలన చేయించాలన్నారు. థియేటర్లలో తాగు నీటి ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ అనేవి యజమానులు కనీస బాధ్యతలని, వాటిని పాటించేలా స్థానిక సంస్థలు చూసుకొంటాయన్నారు. సినిమా హాళ్ల బంద్ నేపథ్యంపై తెలుగు చిత్ర రంగంలో సినిమా హాళ్ల బంద్ ప్రకటనలు వెలువడటానికి గల నేపథ్యం, ఆ నలుగురు ప్రమేయం, తమకు సంబంధం లేదని ఇద్దరు నిర్మాతలు ప్రకటించడం, తూర్పు గోదావరి జిల్లాలోనే తొలుత బంద్ ప్రకటన వెలువడటం తదితర అంశాలు ఈ కార్యక్రమంలో చర్చకు వచ్చాయి. బంద్ అంశంపై చేపట్టిన విచారణ పురోగతిని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వివరించారు. బంద్ ప్రకటన వెనక జనసేన నాయకుడు ఉన్నారని ఒక నిర్మాత మీడియా ముందు ప్రకటించిన విషయంపైనా చర్చించారు. ఈ ప్రకటన వెనక ఒక సినీ నిర్మాత, సినిమా హాళ్ల కలిగిన ఒక రాజకీయ నాయకుడి ప్రమేయం ఉన్నాయని సినిమా వర్గాలు చెబుతున్న క్రమంలో ఈ కోణంలోకూడా విచారణ చేయించాలని పవన్ కల్యాణ్ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి సూచించారు. సినిమా రంగంలో అవాంఛనీయమైన పరిస్థితులకు కారణమైన బంద్ అనే ప్రకటన వెనకగల కారణాలు తెలుసుకోవాలన్నారు. ఇందుకు కారకుల్లో జనసేన తరఫువాళ్లు ఉన్నా చర్యలకు వెనుకాడవద్దన్నారు. నిర్మాతలను కావచ్చు, నటులను కావచ్చు, దర్శకులను కావచ్చు... బెదిరింపు ధోరణిలో దారికి తెచ్చుకొని వ్యాపారాలు సాగించాలనుకొనే అనారోగ్యకర వాతావరణానికి తావు ఇవ్వకుండా సినిమా వ్యాపారం సాగించే ప్రోత్సాహకర పరిస్థితులను ప్రభుత్వం తీసుకువస్తుందని విషయాన్ని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలికి, నిర్మాతల మండలికి, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, దర్శకుల సంఘాలకు తెలియచేయాలన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకురాదలచిన కాంప్రహెన్సివ్ ఫిలిం డెవలప్మెంట్ పాలసీలో సినిమా రంగం అభివృద్ధికి సూచనలను కూడా తెలుగు సినిమా రంగంలోని సంఘాలు, మండళ్ల నుంచి స్వీకరించాలని పవన్ స్పష్టం చేశారు.

# అంగన్వాడీలకు పల్లీలు, పట్టీలు

**హైదరాబాద్, మే 27, ప్రభాత వార్త:** రాష్ట్రంలోని అంగన్వాడీలకు అదనపు పౌష్టికాహారాన్ని అందించాలని మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ నిర్ణయించింది. ప్రధానంగా బాలికల్లో రక్తహీనతను తగ్గించడంతో పాటు, సరిపడా బరువు పెరిగేందుకు అవసరమైన వాటిని సరఫరా చేయనుంది. ఇందులో భాగంగా వేసవి సెలవులు అనంతరం తిరిగి అంగన్వాడీ కేంద్రాలు పున:ప్రారంభమయ్యాక బాలికలకు పల్లీలు, చిరుధాన్యాలతో తయారు చేసిన పట్టీలను అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్ప టికే మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ద్వారా కుమురంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాల పల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రయోగా త్మకంగా ఈ పథ కాన్ని అమలు చేస్తున్నారు. అక్కడి ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు. రాష్ట్రంలో 14 నుండి 18 ఏళ్ల వయసున్న బాలికలు పౌష్టికాహారలోపం వల్ల రక్తహీనతతో ఇబ్బంది పడుతున్నారు. అలాగే వయసుకు తగ్గట్టుగా వారిలో ఎదుగుదల ఉండటం లేదు. ఈ నేపథ్యంలో బాలికల ఆరోగ్యం, పోషకాహార స్థితిని మెరుగుపరిచేందుకు 600 క్యాలరీల శక్తి, 1,820 గ్రాముల ప్రొటీన్ కలిగిన చిరుధాన్యాలతో పోషకాహారంఅందించాలని మహిళా, శిశుసంక్షేమ శాఖ ప్రతిపాదించింది. ఇందుకు అనుగుణంగా బడి బయట కిశోర బాలికలకు పల్లీలు, చిరుధాన్యాల పట్టీలు అందించడానికి ఇప్పటికే చర్యలు మొదలుపెట్టింది.

# పత్తి విత్తుల దందా: మార్కెట్లలో జోరుగా నకిలీ, కల్తీ

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** ఈసారి నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చిన పరిస్థితుల్లో దాని ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు పడుతుండటంతో రైతులు పత్తి విత్తుకునే పనిలో పడతారు. ఈ అవసరాల్ని ఆసరా చేసుకుంటున్న పలు కంపెనీలు, ఏజెన్సీలు, రిటైల్, హోల్‌సేల్ వ్యాపారులు, దళారులు అందరూ పత్తి విత్తన దందా సాగిస్తున్నారు. కంపెనీల విత్తనాల్లో కొన్ని బ్రాండెడ్లకు డిమాండ్ సృష్టించి అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకోవడం ఒక పక్క సాగుతుండగా, తక్కువ ధర పేరిట కల్తీ విత్తనాల్ని అంటగట్టి లాభపడుతున్నారు. ఈ వానాకాలంలో రాష్ట్రంలో సుమారు 50 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేసే అవకాశముందని రాష్ట్ర వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందుకోసం 45 వేల క్వింటాళ్ల పత్తి విత్తనాల అవసరముంటుందని నిర్ధారించారు. ఎకరానికి ప్యాకెట్‌న్నర నుంచి రెండు ప్యాకెట్ల వరకు విత్తనాలు విత్తుతారు. ఈ వానాకాలంలో సుమారు 8 లక్షల విత్తన ప్యాకెట్ల విక్రయాలు సాగనున్నాయి. కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్దఎత్తున సంగారెడ్డి, సిద్దిపేట తదితర జిల్లాలకు కల్తీ విత్తనాలు వచ్చినట్టు చెబుతున్నారు. రెండు నెలలు ముందుగానే దళారులు కొందరు ఆయా ప్రాంతాల్లోని రహస్య గోదాములు ఏర్పాటు చేసుకున్నట్టు తెలిసింది. బయటి రాష్ట్రాల నుంచి తెచ్చిన కల్తీ విత్తనాలను ఆ గోదాముల్లో ప్యాకింగ్ చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో కొందరు స్థానిక మధ్యవర్తులతో ఒప్పందం కుదుర్చుకుని విత్తనాలు అమ్ముతున్నట్టు విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా బీటీ పత్తి విత్తనాల బ్రాండెడ్ కంపె నీల ప్యాకెట్ల మాదిరే కల్తీ విత్తనాల ప్యాకెట్లను తయారు చేసి రైతులకు అమ్ముతున్నారు. కంపెనీ విత్తనాల మాదిరిగానే తెగుళ్లను తట్టుకుంటుం దని, అధిక దిగబడులు వస్తాయని నమ్మబలుకు తున్నారు. బీటీ ప్యాకెట్ ధర రూ.901 ఉండగా, అందులో సగం రూ.500, రూ.600కే ఇస్తామని అంటగడు తున్నారు. ఇక బీటీ3 విత్తనాలపై నిషేధం ఉన్నా కొన్ని చోట్ల గుట్టుగా రైతులకు అధిక ధరలకు అమ్ముతున్నారు. దీంతో రైతులు నిలువు దోపిడీకీ గురవుతున్నారు.

# రాష్ట్రంలో కొత్త విత్తన చట్టం

## విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** నకిలీ, కల్తీ విత్తనాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా రైతుల సంక్షేమం కోసమే కొత్త విత్తన చట్టం తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు దీనికి సంబంధించి కొత్త విత్తన చట్టం రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ హైదరాబాద్‌లోని రాష్ట్ర రైతు కమిషన్ కార్యాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ కొత్త విత్తన చట్టం కోసం అవసరమైతే ఇతర రాష్ట్రాల్లోనూ అమలవుతున్న ఆయా విత్తన చట్టాలను అధ్యయనం చేస్తామన్నారు. రైతులకు మేలు చేసేలా రాష్ట్ర విత్తన చట్టం పగడ్బందీతో పటిష్టంగా రూపొందించడానికి ఈ కమిటీ కృషి చేస్తుందని చెప్పారు. విత్తన చట్ట ముసాయిదా రూపకల్పనకు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు, విత్తనాల తయారీ సంస్థలు, ఆర్గనైజర్లు, డీలర్లతో సంప్రదించి, వారి అభిప్రాయాలను సేకరిస్తామని వెల్లడించారు.

# వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండాలి: అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే27:** హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ పరిధిలో అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండాలని, జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్తు విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని, ట్రాఫిక్ ఇబ్బంది, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా, ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అన్నారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రేటర్ సిటీతో పాటు అన్ని జిల్లాల్లో ఎప్పటికప్పుడు వర్షాల పరిస్థితిని సమీక్షించాలని సీఎస్ ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

# కానిస్టేబుల్ కుమార్తెకు ఉద్యోగం ఇచ్చిన సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే27:**గత 19 ఏళ్లుగా కారుణ్య నియామకం కోసం ఎదురు చూస్తున్న ఓ మహిళ కలను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చింది. హోం శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా నియామక ఉత్తర్వులు ఇచ్చి ఆ కుటుంబంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం నింపారు. వరంగల్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ బి.భీమ్ సింగ్ సర్వీస్‌లో ఉండగా 24-09-1996లో ఎన్‌కౌంటర్‌లో మరణించారు. తండ్రి మరణం నేపథ్యంలో కారుణ్య నియామకం కోసం ఆయన కూతురు బి. రాజశ్రీ దరఖాస్తు చేసుకున్నారు. అయితే వివిధ సాంకేతిక కారణాలు చూపిస్తు గత ప్రభుత్వాలు ఆమెకు ఉద్యోగం ఇవ్వడానికి నిరాకరించాయి. రాజశ్రీ అనేక సార్లు ప్రభుత్వానికి విజప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. అయితే రాజశ్రీ సమస్యను వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మానవతాదృక్పథంతో స్పందించిన సిఎం రేవంత్ రెడ్డి నిబంధనలు సడలించైనా సరేఉద్యోగం ఇవ్వాలని సీఎంవో అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో రాజశ్రీ తన కుటుంబంతో కలిసి వచ్చి సిఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగరాజు పాల్గొన్నారు.

# జూన్ 2 నుంచి 9 వరకు రాజీవ్ యువ వికాసం మంజూరు

## 15 తర్వాత యూనిట్ల గ్రౌండింగ్ ప్రారంభం: డిప్యూటీ సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే27:** తెలంగాణ రాష్ట్రంలో రాజీవ్ యువ వికాసం పథకం అమలు తీరుపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ పథకం ద్వారా యువతకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వేగవంతం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. సమావేశం అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన మంజూరు పత్రాలను జూన్ 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం, జూన్ 15వ తేదీ తర్వాత ఎంపికైన యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా 5 లక్షల మంది యువతకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించినట్లు భట్టి విక్రమార్క వివరించారు.

# అనూహ్యంగా క్వాలిఫయర్ వన్‌కు చేరిన ఆర్సీబీ

## లక్నోసూపర్‌జెయింట్స్‌పై ఆరువికెట్ల తేడాతో విక్టరీ





**లక్నో, మే 27:** ఐపిఎల్ సీజన్‌లో 70వ మ్యాచ్ అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. లక్నోసూపర్‌జెయింట్స్, రాయల్‌ఛాలెంజర్స్ ఆఫ్ బెంగళూరు జట్లమధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ చివరివరకూ పోరాడి ఆరువికెట్ల తేడాతో ఎనిమిది బంతులు మిగిలి ఉండగానే విక్టరీ నమోదుచేసింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన ఎల్ఎస్జీ జట్టు మూడు వికెట్ల నష్టానికి నిర్ణీత 20 ఓవర్లలో 227 పరుగులుచేసింది. తదనంతరం లక్ష్యఛేదనలో వచ్చిన ఆర్సీబీ ఎనిమిది బంతులు మిగిలి ఉండగానే నాలుగు వికెట్ల నష్టానికి 230 పరుగులుచేసి ఆరువికెట్ల తేడాతో మ్యాచ్‌ను గెలిచింది. ఆర్సీబీ స్టాండ్ఇన్ కెప్టెన్ జితేశ్ శర్మ 33 బంతుల్లోనే 85 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు.

ఈ విజయంతో ఆర్సీబీ క్వాలిఫయర్ వన్ మ్యాచ్‌కు అర్హత సాధించింది. లక్నో నిర్దేశించిన భారీ ఛేదనలో ఆర్సీబీ బెంగళూరుఓపెనర్లు విరాట్‌కోహ్లీ 33, ఫిలిప్ సాల్ట్‌లు 30 పరుగులతో దంచేసారు. పోటీపడి మరీ ఇద్దరూ బౌండరీలుచేసారు. నాలుగు ఓవర్లకే స్కోరు 50కి చేరింది. ఆరంభసీజన్‌నుంచి ఆర్సీబీకి ఆడుతున్న కోహ్లీ ఈమ్యాచ్‌లో ఆ జట్టు తరపున 9 వేల పరుగుల మైలురాయికి చేరుకున్నాడు. కాగా ఈమ్యాచ్‌లో ఆర్సీబీ 228 పరుగులను 8 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. టాస్ గెలిచిన ఆర్సీబీ స్టాండ్ ఇన్ కెప్టెన్ జితేశ్ శర్మ బౌలింగ్ ఎంచుకున్నాడు. రిషభ్ పంత్ 61 బంతుల్లో 118 నాటౌట్‌గా సెంచరీతో చెలరేగడంతో లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 227/3 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ 37 బంతుల్లో 67 పరుగులుచేసి రాణించాడు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి మెరుపు శుభారంభం దక్కింది. ఫిలిప్ సాల్ట్ 19 బంతుల్లో 30 రన్స్, విరాట్ కోహ్లీ 3 బంతుల్లో 54 రన్స్‌తీసిఅదరగొట్టారు. దీంతో 7.4 ఓవర్లలో ఆ జట్టు 90/1తో నిలిచింది. ఈ దశలో వరుస బంతుల్లో రజత్ పాటీదార్ 14, లియామ్ లివింగ్ స్టోన్ ఔట్ అయ్యారు. ఆ తర్వాత కాసేపటికే కోహ్లీ కూడా ఔట్ కావడంతో లక్నో రేసులోకి వచ్చింది. ఈదశలో ఆర్సీబీస్టాండ్ ఇన్ కెప్టెన్ జితేశ్ శర్మ సంచలన బ్యాటింగ్ చేశాడు. 33 బంతుల్లో అజేయంగా 85 రన్స్ చేసి జట్టును గెలిపించాడు. మయాంక్ అగర్వాల్ సైతం 2 బంతుల్లో 41 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో 8 బంతులు మిగిలి ఉండగానే ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది.

క్వాలిఫయర్1లో పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడనున్నాయి. ఈ మ్యాచ్ మే 29న ముల్లాన్‌పూర్‌లో జరగనుంది. మే 30న జరిగే ఎలిమినేటర్‌లో గుజరాత్ టైటాన్స్‌తో ముంబై ఇండియన్స్ తలపడనుంది.

# డిఆర్డీవో చైర్మన్ పదవీకాలం మరో యేడాది పొడిగింపు

**న్యూఢిల్లీ, మే 27:** రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డిఆర్‌డీవో) ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ పదవీకాలాన్ని ఒక సంవత్సరం పొడిగించడానికి క్యాబినెట్ నియామకాల కమిటీ (ఎసిసి) ఆమోదం తెలిపింది. ఆయన పదవీకాలాన్ని ఈ ఏడాదిజూన్ ఒకటవ తేదీనుండి 2026 మే 31వ తేదీ వరకు లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు పొడిగించారు.

2022 ఆగస్టులో డిఆర్డీవో చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కామత్, స్వావలంబన మరియు స్వదేశీ సామర్థ్య అభివృద్ధిపై దృష్టి సారించి, భారతదేశ రక్షణ పరిశోధన కార్యక్రమాలను వేగవంతంచేయడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వంలో, ప్రభుత్వ ఆత్మనిర్భర్ భారత్‌కు అనుగుణంగా క్షిపణి సాంకేతికత, అంతరిక్ష వ్యవస్థలు, మానవరహిత వాహికలు మరియు అధునాతన ఉత్పత్తుల్లో గణనీయమైన పురోగతిని సాధించింది. డాక్టర్ కామత్‌కు గత ఏడాది మే 27న ఒక సంవత్సరంపాటు కేబినెట్ నియామకాలకమిటీ పొడిగింపునిచ్చింది. ఈ నెలలో ఆ పొడిగింపు ముగియనుండటంతో మరో ఏడాది పొడిగించారు. ఆయన ఐఐటి ఖరగ్‌పూర్ అమెరికాలోని ఒహియో స్టేట్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి.

# ఐజిసిఎస్ఈ పరీక్షల్లో విప్లవాత్మక విజయాలు సాధించి రికార్డు సృష్టించిన ఫ్యూచర్ పాత్‌వేస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే27:** శ్రీచైతన్య ఫ్యూచర్ పాత్‌వేస్ గ్లోబల్ స్కూల్ తమ విద్యార్థులు సాధించిన అసాధారణ విజయాలను ఆనందంగా ప్రకటించింది. 3 నుంచి 8వ తరగతి వరకు ఉన్న 24 మంది విద్యార్థులు 10వ తరగతి ఐజీసీఎస్ఈ పరీక్షలు విజయవంతంగా పూర్తి చేసి కొత్త ప్రమాణాలను స్థాపించి చరిత్ర సృష్టించారు. గచ్చిబౌలికి చెందిన 13 ఏళ్ల 8వ తరగతి విద్యార్థిని లక్ష్మీ అనిక స్నేహపాండే 10వ తరగతి సంబంధించిన ఐజీసీఎస్ఈ రసాయన శాస్త్రంలో 93శాతం మార్కులు సాధించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. 80శాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులు 80శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. వందశాతం ఉత్తీర్ణత(100 ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులయ్యారు. మావరిక్స్ లెర్నింగ్ అప్రోచ్(ఎంఎల్ఏ),చైల్డ్ ప్రాడిజీ ప్రోగ్రాం(సిపిపి) వంటి వినూత్న సృజనాత్మక ... మెరుగుపరిచి అభివృద్ధిని సాధించడంలో కీలక పాత్ర పోషించాయి. ఈ ప్రోగ్రాములు పాఠశాల



సమయంలోనే ఒత్తిడి లేని విధానం అందిస్తూ విద్యార్థుల ప్రతిభను వెలికి తీసి వారి సామర్థ్యాన్ని వెలికి తీసి వారి ... పెంపొందించడంపై దృష్టి పెట్టాయి. భవిష్యత్తు మార్గదర్శకులను ఆకర్షిస్తూ ఫ్యూచర్ పాత్‌వేస్ గ్లోబల్ స్కూల్ ఆకర్షణీయ తరగతి నాయకులను తీర్చిదిద్దే దంపై కట్టుబడి ఉందని విద్యార్థుల ప్రతి ఒక్కరి సామర్థ్యాన్ని సాధించేందుకు ఉత్సాహభరితమైన వాతావరణాన్ని సృష్టించడమే తమ ఉద్దేశం. శ్రీచైతన్య ఫీచర్ పాత్‌వేస్ డైరెక్టర్ సీమా బొప్పన,చీఫ్ ఆఫ్ అకాడమిక్స్ పుష్పవల్లి,ఏజియం శివకామాక్షమ్మ నేతృత్వంలో విద్యార్థులు ఉపాధ్యాయులు,తల్లిదండ్రులకు ఈ అద్భుత విజయానికి శుభాకాంక్షలు తెలిపారు.

# నేడే 'మిరాయ్' టీజర్ విడుదల

సూపర్ హీరో తేజ సజ్జా సూపర్ యోధగా తన అడ్వంచరస్ యాక్టింగ్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు, మే28న తన మోస్ట్ ఎవైటెడ్ మూవీ మిరాయ్ టీజర్ విడుదలకానుంది. ఈ గ్లింప్స్ ఖచ్చితంగా గొప్ప సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందిస్తుంది, ప్రేక్షకులను సినిమా కోసం క్రియేట్ చేసిన కొత్త ప్రపంచంలోకి తీసుకువెళుతుంది. ఈ ఎక్స్ ట్రార్డినరీ టీజర్ చూడటానికి మరో రెండు రోజులు వేచి ఉండాలి. టీజర్ పోస్టర్ తేజ సజ్జా చేతిలో మంత్రదండం పట్టుకుని నడుస్తున్న రైలు పైన నిలబడి, రిస్కీ స్టంట్ చేస్తూ క్యారెక్టర్ బోల్డ్ నేచర్‌ని ప్రజెంట్ చేస్తోంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ యాక్షన్‌అడ్వెంచర్ ముంబైలోని చారిత్రాత్మక గుహలలో కొత్త షూటింగ్ షెడ్యూల్ జరుగుతోంది. తేజ సజ్జాతో పాటు, కొంతమంది ప్రధాన తారాగణం ఈ తాజా షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమాలో సూపర్ యోధ పాత్ర పోషించడం ద్వారా తేజ సజ్జా అద్భుతంగా మేకోవర్ అయ్యారు. ఈ సినిమాలో రాకింగ్ స్టార్ మనోజ్ మంచు విలన్ నటించగా, రితికా నాయక్ కథానాయికగా నటించింది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ, స్క్రీన్‌ప్లేను కూడా అందించగా, మణిబాబు కరణం డైలాగ్స్ రాశారు. గౌరహరి సంగీతం అందించగా, శ్రీ నాగేంద్ర తంగల ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. సుజిత్ కుమార్ కొల్లి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ చిత్రం 2డీ, 3డీ ఫార్మాట్లలో 8 భాషలలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నటీనటులు: తేజ సజ్జా, మనోజ్ మంచు, రీతికా నాయక్

సాంకేతిక నిపుణులు: దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని
నిర్మాత: టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్
బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి, సంగీతం: గౌరహరి
ఆర్ట్ డైరెక్టర్: శ్రీ నాగేంద్ర తంగల
రచయిత: మణిబాబు కరణం
పీఆర్ఓ: వంశీశేఖర్.



# 'భైరవం' యూనివర్సల్ సబ్జెక్ట్..హీరో నారా రోహిత్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుత స్పందనతో, పాజిటివ్ బజ్‌తో ముందుకు దూసుకెళ్తుంది. విజయ్ కనకమేడల దర్శకత్వంలో, శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ భారీ నిర్మించారు. పెన్ స్టూడియోస్ డాక్టర్‌జయంతీలాల్ గడా సమర్పిస్తున్నారు. ఈ సినిమా మే 30న సమ్మర్ సీజన్‌లో బిగ్గెస్ట్ రిలీజ్‌కి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో హీరో నారా రోహిత్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.



**ఈ కథ మీ వద్దకు ఎలా వచ్చింది?** నిర్మాత బెల్లంకొండ సురేష్ ఈ కథ గురించి ఫోన్ చేసి చెప్పారు. ఆయన జడ్జిమెంట్ మీద నాకు నమ్మకం ఉంది. శశి కుమార్ క్యారెక్టర్ గురించి చెప్పారు. నేను సినిమా చూశాను. చాలా నచ్చింది. **మీ ముగ్గురు ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ చూస్తుంటే చాలా అద్భుతంగా కుదిరినట్టుగా అనిపిస్తుంది. దీనికోసం ఏదైనా హోంవర్క్ చేశారా?** మాకు ఎప్పటినుంచో పరిచయం ఉంది. పర్సనల్‌గా కూడా మేము చాలా క్లోజ్. మా మధ్య చాలా కంఫర్ట్ ఉంటుంది. డైరెక్టర్ విజయ్‌కి చాలా క్లారిటీ ఉంది. **ఇకపై మీ నుంచి బ్యాక్ టు బ్యాక్ సినిమాలు రాబోతున్నాయా?** చిన్న బ్రేక్ తీసుకోవాలనుకున్నాను. అది కాస్త పెద్ద బ్రేక్ అయింది.(నవ్వుతూ) ఇకపై రెగ్యులర్‌గా సినిమాలు వస్తాయి. సుందరకాండ ఆల్మోస్ట్ పూర్తయింది. జూలైలో రిలీజ్ ఉండొచ్చు. నెక్స్ట్ ఫిల్మ్ ఆగస్టులో స్టార్ట్ చేయబోతున్నాను. **మనోజ్, సాయి శ్రీనివాస్‌తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?** మనోజ్ నాకు చిన్నప్పటినుంచి తెలుసు. ఈ సినిమాతో చాలా పర్సనల్ బాండ్ వచ్చింది. సాయి నాకు 2010 నుంచి తెలుసు. తను డాన్స్ ప్రాక్టీస్ చేస్తుండేవాడు. అప్పటినుంచి తను పరిచయం. నిజానికి సురేష్ గారితో ఒక సినిమా చేయాలి.కానీ అది కుదరలేదు. ఈ సినిమాతో మేమంతా మరింత దగ్గరయ్యాం. **జయసుధ క్యారెక్టర్ గురించి?** ఇందులో జయసుధ బామ్మ క్యారెక్టర్ చేశారు. జయసుధగారు లెజెండరీ. సార్ వచ్చారు తర్వాత వారితో వర్క్ చేయడం ఆనందాన్ని ఇచ్చింది.




# 'షష్టిపూర్తి' పై పెట్టిన బడ్జెట్ అంతా తెరపై కనిపిస్తుంది..

ప్రస్తుతం ఉన్న తరుణంలో ఓ ఫ్యామిలీ ఎమోషన్స్, కుటుంబ కథా చిత్రాలు, విలువలను చాటి చెప్పే కథల్ని నిర్మించడం అంటే మామూలు విషయం కాదు. అలాంటి ఓ సందేశాత్మక చిత్రంగా షష్టిపూర్తి సినిమాను రూపేశ్ నిర్మించారు. నిర్మాతగానే కాకుండా హీరోగానూ నటించారు. డా. రాజేంద్ర ప్రసాద్, నటి అర్చన, ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రల్లో ఈ చిత్రాన్ని పవన్ ప్రభ తెరకెక్కించారు. మా ఆయి (ఎంఎఎఎఐఇ) ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం మే 30న విడుదల కాబోతోంది. ఈ క్రమంలో హీరో, నిర్మాత రూపేశ్ మంగళవారం (మే 27) నాడు మీడియాతో ముచ్చటిస్తూ సినిమా గురించి ఎన్నో విషయాల్ని పంచుకున్నారు. ఆయన చెప్పిన విశేషాలివే.. షష్టిపూర్తి కథ నాకు చాలా నచ్చింది. ప్రస్తుతం ఇలాంటి కథలే రావడం లేదు. హింసతో కూడిన చిత్రాలే వస్తున్నాయి. ఇలాంటి విలువలతో స్క్రిప్ట్ నా వద్దకు రావడంతో ఎంతో ఆనందించాను. ఇందులో అన్ని రకాల అంశాలుంటాయి. ఈ చిత్రాన్ని నిర్మించడం ఆనందంగానే ఉన్నా.. నటించడాన్ని ఎక్కువగా ఎంజాయ్ చేశాను. షష్టిపూర్తి పూర్తిగా కల్పిత చిత్రమే. కానీ ఇందులోని పాత్రల్ని చూస్తే ఆడియెన్స్ మాత్రం తమని తాము చూసుకున్నట్టుగా కనెక్ట్ అవుతారు. ప్రస్తుతం అసలు స్వచ్ఛమైన ప్రేమను కూడా చూపించడం లేదు. ఇందులో కుటుంబ అంశాలతో పాటుగా అన్ని రకాల ఎమోషన్స్‌ను చూపించాం. షష్టిపూర్తి కథను రాజేంద్ర ప్రసాద్ కోసమే పవన్ ప్రభ రాసుకున్నారు. ఆయన కొడుకుగా నటించే వారిది కొత్త మొహం అయితే ఎలాంటి అంచనాలు లేకుండా సినిమాను చూస్తారు. అందుకే కొత్త ఫేస్ కోసం దర్శకుడు చూశారు. చివరకు నేను ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చాను. ఇళయరాజా మ్యూజిక్‌తో సినిమా స్థాయి పెరిగింది. ఆయన మాకు ఎంతో సహకరించారు. ప్రతీ పాటకు ఎన్నో ఆప్షన్స్ ఇచ్చారు. బయట ప్రచారం జరిగినట్టుగా అక్కడ ఏమీ జరగలేదు. కీరవాణి అడిగిన వెంటనే పాటను రాసిఇచ్చారు. చైతన్య ప్రసాద్ వల్లే ఇదంతా సాధ్యమైంది. ఇందులోని పాటలు, ఆర్ఆర్ ఆడియెన్స్‌ను కదిలిస్తాయి. షష్టిపూర్తి కథ విన్న తరువాత ఇలాంటి పెద్ద టీం ఉండాల్సిందే అని ఫిక్స్ అయ్యాను. అందుకే పెద్ద పెద్ద టెక్నీషియన్ల కోసం ట్రై చేశాం. బడ్జెట్ అనుకున్న దాని కంటే ఎక్కువే అయింది. అయితే ఆ ఖర్చు పెట్టింది అంతా కూడా తెరపై కనిపిస్తుంది. అయితే ఎవ్వరూ కూడా ఇంతఇవ్వాలని డిమాండ్ చేయలేదు. షష్టిపూర్తి కోసం చాలా వర్క్ షాప్స్ చేశాం. నాకు అయితే ఎమోషనల్ సీన్స్ చేయడం సులభం అనిపిస్తుంది. అది నా ఓవర్ కాన్ఫిడెన్స్ కాదు. షష్టిపూర్తి కథ వినే పెద్ద టెక్నీషియన్స్ ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చారు. కథలో బలం ఉందనే ఇళయరాజా, తోట తరణి ఒప్పుకున్నారు. దానికి తగ్గట్టే మంచి అవుట్ పుట్ వచ్చింది. నేను ముందుగా ఈ ప్రాజెక్ట్‌లోకి నిర్మాతగా ఎంట్రీ ఇచ్చాను. మా ఆయి ప్రొడక్షన్స్ అంటే.. మా అమ్మ ప్రొడక్షన్ అని అర్థం. అమ్మ జ్ఞాపకార్థంగానే అలా పెట్టుకున్నాను. అవుట్ పుట్ పట్ల చాలా సంతోషంగా ఉన్నాను. రాజేంద్ర ప్రసాదైనా, అర్చనైనా, ఇళయరాజైనా సరే ఏదైనా ఒక పని చేస్తే వంద శాతం ఫోకస్డ్‌గా ఉంటారు. అందుకే వాళ్లు ఆ స్థాయికి వెళ్లారు. ఏ పని చేసినా వంద శాతం ఫోకస్డ్‌గా చేయాలని వాళ్లని చూసి నేర్చుకున్నాను.




# 'కిల్లర్' నుంచి జ్యోతి పూర్వజ్ 'రక్తిక' లుక్ రిలీజ్

శుక్ర, మాటరాని మౌనమిది, ఏ మాస్టర్ పీస్ వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ కిల్లర్ అనే సెన్సేషనల్ సైఫై యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన హీరోగా పాత్రలో నటిస్తుండటం విశేషం. జ్యోతి పూర్వజ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, విశాల్ రాజ్, దశరథ, చందూ, గౌతమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏయు అండ్ఐ మరియు మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి ఈ కొలాబ్రేషన్‌లో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది. కిల్లర్ మూవీ నుంచి హీరోయిన్ జ్యోతి పూర్వజ్ నటించిన రక్తిక క్యారెక్టర్ లుక్ రిలీజ్ చేశారు. ఈ పాత్రలో ఆమె వ్యాంపైర్ లుక్‌లో ఆకట్టుకుంటోంది. ఇప్పటికే కిల్లర్ మూవీ నుంచి రిలీజ్ చేసిన గ్లింప్స్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్, సూపర్ హీరో..ఇలాంటి ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా రూపొందుతోంది. కిల్లర్ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. నటీనటులు : జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, విశాల్ రాజ్, దశరథ, చందూ, గౌతమ్, తదితరులు, టెక్నికల్ టీమ్: సినిమాటోగ్రఫీ: జగదీశ్ బొమ్మిశెట్టి, మ్యూజిక్: ఆశీర్వాద్, సుమన్ జీవ, వీఎఫ్ఎక్స్, వర్చువల్ ప్రొడక్షన్: మెర్జ్ ఎక్స్ఆర్, పీఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), లైన్ ప్రొడ్యూసర్: దశరథ, బ్యానర్స్: థింక్ సినిమా, మెర్జ్ ఎక్స్ఆర్, ఏయు అండ్ ఐ.



# 'ప్రేమకి ప్రాణం ఉంటే-నన్ను చెప్పుతో కొట్టుద్ది' పుస్తక ఆవిష్కరణ

యువ రచయిత గణ రచించిన ప్రేమకి ప్రాణం ఉంటే నన్ను చెప్పుతో కొట్టుద్ది అనే తెలుగు నవల అవిష్కరణ కార్య క్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు సందీప్ రెడ్డి వంగ, మెహర్ రమేష్, శివ నిర్వాణ, సాయి రాజేష్‌లతో పాటు పలువురు రచయితలు, దర్శకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సందీప్ రెడ్డి వంగ చేతుల మీదుగా పుస్తకాన్ని అవిష్కరించారు. తరువాత ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందన్నారు. అలాగే పుస్తక శీర్షికను ప్రశంసించారు. నవల టైటిల్ చాలా అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. ఇక రచయిత గణ గురించి మాట్లాడుతూ.. ఇలాంటి మరెన్నో మంచి నవలలు పాఠకులకు అందించాలని కోరారు. దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ, ప్రేమకి ప్రాణం ఉంటే – నన్ను చెప్పుతో కొట్టుద్ది నవలను సగం వరకు చదివాను, చాలా ఆసక్తిగా అనిపించింది, మిగతా సగం కూడా త్వరగానే పూర్తి చేస్తాను అన్నారు. ఇది కచ్చితంగా పుస్తక ప్రియులకు ఎంతో చేరువయ్యే నవలా అన్నారు. ఇలాంటి రచనలు నేటి సమాజానికి ఎంతో అవసరం అని కూడా మాట్లాడారు. ప్రముఖ దర్శకులు మెహర్ రమేష్ తన అనుభూతిని పంచుకుంటూ.. ఈ పుస్తకంలో ప్రేమ చెప్పుతో కాదు.. చెబుతూ కొట్టింది అంటూ నవలలోని భావాన్ని వినోదాత్మకంగా వివరించారు. ఇది కచ్చితంగా అందరికి నచ్చుతుందని అభిప్రాయపడ్డారు. నవల రచయిత గణ మాట్లాడుతూ, ఈ వేడుకకు వీరందరి రాకతో నిండుదనం వచ్చిందని, ఈ నవలలో అన్ని రకాల భావోద్వేగాలు ఉన్నాయన్నారు. యువతకు మాత్రమే కాదు అన్ని వయసుల వారిని కట్టిపడేసే విషయం ఉన్న ఈ నవల అమెజాన్‌లో అందుబాటులో ఉందని చెప్పారు. అలాగే గణ రచించిన మరో పుస్తకం ద రియల్ యోగి. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేపథ్యంలో రాసిన ఈ ద రియల్ యోగి పుస్తకానికి కూడా చాలా మంచి ఆదరణ వచ్చిందని ఆ పుస్తకం కూడా అమోజాన్ లో అందుబాటులో ఉందని చెప్పారు.




# ఓటీటీలో జూన్ 13 నుంచి 'రానా నాయుడు సీజన్ 2'

ఒకే వేదికపై బలవంతుడైన రానా నాయుడు, భయంకరమైన జిత్తులమారిలా ఆలోచనలు చేసే సునీల్ గ్రోవర్ తలపడుతుంటే... అసలు సిసలైన దుమ్ము దులిపే దృశ్యం మన ముందు ప్రత్యక్షమవుతుంది. దీన్ని ఆవిష్కరిస్తూ ఓ వీడియోను ఎవరి ఊహకు అందని విధంగా నెట్‌ఫ్లిక్స్ సిద్ధం చేసి విడుదల చేసింది. ఈ వీడియోలో రానా దగ్గుబాటి, సునీల్ గ్రోవర్ ఇద్దరూ కనిపించారు.సీరియస్‌గా, కఠినంగా కనిపించే రానా నాయుడు ప్రపంచంలోకి తనదైన మార్క్ ఉన్మాదంతో ఉన్న సునీల్ ప్రవేశించాడు. ఇతను ఎప్పుడూ నిశ్శబ్దాన్ని కోరుకునే వ్యక్తి కాదు. దీంతో పరిస్థితి అంతా గందరగోళంగా మారిపోయింది. నిజానికి ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనటానికి సిద్ధంగా లేదు. సునీల్ గ్రోవర్ మాట్లాడుతూ, రానా దగ్గుబాటి మరియు నేను ఒకే ఫ్రేమ్‌లో? నేను కూడా ఊహించలేదు. రానా నాయుడు అనేది పవర్ మూవ్స్, ఫ్యామిలీ డ్రామా, యాక్షన్‌లతో నిండిన తీవ్రమైన, గట్టి ప్రపంచం. అలాంటి లోకంలో నేను నా స్టైల్ అల్లకల్లోలంతో ప్రవేశించాను. నెట్‌ఫ్లిక్స్ ఈ ఐడియా చెప్పగానే, ఇది ఖచ్చితంగా మైండ్‌బ్లోయింగ్ అనిపించింది. మేము షూట్ చేసినది వైల్డ్, అన్‌ప్రెడిక్టబుల్, అంతెక్కువ ఫన్‌తో కూడినది. అది రెండు వేర్వేరు లోకాలు ఒకదానితో ఒకటి ఢీకొన్నట్లు అనిపించింది – కానీ ఏదో ఒక విధంగా అది క్లిక్ అయిపోయింది. రానా నాయుడు సీజన్ 2 డ్రామా తీసుకొస్తుంది.. అంతేకాదు కొంచెం మాయహెమ్ కూడా. సునీల్ గ్రోవర్ మాట్లాడుతూ, నేను, రానా దగ్గుబాటి ఒకే ఫ్రేమ్? దీన్ని నేను అస్సలు ఊహించలేదు. రానా నాయుడు పవర్‌ఫుల్ మలుపులు, ఫ్యామిలీ డ్రామా, యాక్షన్‌తో కూడిన తీవ్రమైన, కఠినమైన ప్రపంచం. అలాంటి లోకంలోకి నా ఎంట్రీ అనేది నా స్టైల్లోనే ఉంటుంది. నెట్ ఫ్లిక్స్ ఈ ఐడియా గురించి నాకు చెప్పగానే నాకు అద్భుతంగా అనిపించింది. వైల్డ్, ఎవరూ ఊహించని, ఫన్ కలగలిపిన కథాంశంతో తెరకెక్కించాం. రెండు వేర్వేరు లోకాలు ఢీ కొన్నట్లుగా నాకు అనిపించింది. రానా నాయుడు సీజన్2 కల్లోలంతో కూడా డ్రామాను మీ ముందుకు తీసుకు వస్తుంది. ఇందులో నేను చేసింది అతిథి పాత్ర కాదు. సాధారణంగా మీరు చూసే కలయికలా మాత్రం ఇది కనిపించదు. మిమ్మల్ని నవ్విస్తూనే అసలేం జరుగుతుందనే ఆసక్తిని కలిగిస్తూ మరింతగా చూడాలనిపించేలా ఉండే సందర్భం అన్నారు. రానా దగ్గుబాటి మాట్లాడుతూ, సునీల్ గ్రోవర్ కనిపించగానే మీరు ఊహించలేని పరిస్థితులను చూస్తామనే భావమనైతే కలుగుతుంది. రానా నాయుడులా చక్కటి యాక్షన్ సన్నివేశాల్లో నటిస్తాను. పంచ్‌లనే కాదు పంచ్ లైన్‌లను కూడా తప్పించుకుంటాను.



# 'గ్యాంబ్లర్స్' టీజర్ లాంచ్

మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో కథానాయకుడిగా అందరి హృదయాల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న యూత్‌ఫుల్ క్రేజీ హీరో సంగీత్ శోభన్ కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం గ్యాంబ్లర్స్. ప్రశాంతి చారులింగా నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కేసీఆర్ ఫేమ్ రాకింగ్ రాకేష్ పృథ్వీరాజ్ బన్న, సాయి శ్వేత, జస్విక, భరణి శంకర్, మల్హోత్ర శివ, శివారెడ్డి ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ రచయిత, దర్శకుడు విజయేంద్రప్రసాద్ దర్శకత్వంలో శ్రీవల్లి అనే సైన్స్‌ఫిక్షన్ సినిమాను నిర్మించిన నిర్మాతలు సునీత, రాజ్‌కుమార్ బృందావనంలు ఈ సినిమాను రేష్మాస్ స్టూడియోస్, స్నాప్ అండ్ క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కేఎస్‌కే చైతన్య ఈ చిత్రానికి దర్శకుడు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్న ఈ చిత్రాన్ని జూన్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. కాగా ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. టీజర్‌ను గమనిస్తే,యుద్ధం జూదం ఒక్కటే.. యుద్ధం ఎక్కడ మొదలుపెట్టాలో తెలియాలి.. జూదం ఎక్కడ ఆపాలో తెలియాలి అంటూ ఓ సంభాషణతో మొదలవుతుంది. ఈ చిత్రంలో సంగీత్ శోభన్ ఓ గ్యాంబ్లర్‌గా కనిపించబోతున్నారు. ఆయన పాత్ర కొత్తగా ఉండబోతుందని తెలుస్తోంది. సినిమాలోని ముఖ్య పాత్రలను ఈ టీజర్‌లో పరిచయం చేశారు. టీజర్‌ను చూస్తుంటే సినిమా చూడాలన్న ఆసక్తి కలుగుతుంది. వైవిధ్యమైన పాయింట్‌తో రూపొందుతున్న ఈ టీజర్ అందరిలోనూ సినిమాపై క్యూరియాసిటీని పెంచింది. ఈసందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, ఇదొక మిస్టరీ ఎంటర్‌టైనర్. ఈ చిత్రంలో కొత్త సంగీత్ శోభన్‌ను చూడబోతున్నారు. ఆయన నటనలోని మరో కోణాన్ని ఆవిష్కరించే చిత్రమిది. చిత్రంలో ఉండే థ్రిల్లింగ్ అంశాలు, ట్విస్ట్‌లు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయి. పూర్తి వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో అన్ని వర్గాలను అలరించే అంశాలున్నాయి. ఇటీవల కేసీఆర్ చిత్రంతో అందరి ప్రశంసలు అందుకున్న రాకింగ్ రాకేష్ ఈ చిత్రంలో ఓ ముఖ్యపాత్రను పోషిస్తున్నాడు. ఆయన పాత్ర కూడా అందర్ని అలరించే విధంగా ఉంది అన్నారు.



# 'త్రీ రోజెస్' సీజన్ 2 గ్లింప్స్ రిలీజ్

ఈషా రెబ్బా, సత్య, హర్ష చెముడు, ప్రిన్స్ సిసిల్, హేమ, సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ త్రీ రోజెస్. ఆహా ఓటీటీలో సూపర్ హిట్టయిన ఈ సిరీస్ కు ఇప్పుడు సీజన్ 2 రాబోతోంది. ఈ సిరీస్‌ను మాస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎస్ కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మారుతి షో రన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. రవి నంబూరి, సందీప్ బొల్ల రచన చేయగా, కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహించారు. 'త్రీ రోజెస్ సీజన్ 2 నుంచి యాక్టర్ సత్య చేసిన బెట్టింగ్ భోగి క్యారెక్టర్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. విశ్వంభర, రాజా సాబ్ ,పెద్ది వంటి ప్రెస్టీజియస్ మూవీస్‌లో నటిస్తూ చాలా బిజీగా ఉన్నా సత్య..త్రీ రోజెస్ కంటెంట్‌ను ఇష్టపడి ఈ వెబ్ సిరీస్‌లో నటించాడు. సత్యను ఫస్ట్ టైమ్ ఓ వెబ్ సిరీస్‌లో పరిచయం చేస్తోంది మాస్ మూవీ మేకర్స్. ఈ సిరీస్‌లో హీరోయిన్ రాశీ సింగ్ భర్తగా సత్య నటిస్తున్నాడు. సత్య చేసిన బెట్టింగ్ భోగి క్యారెక్టర్ గ్లింప్స్ హిలేరియస్‌గా ఉండి నవ్విస్తోంది. క్రికెట్ మ్యాచ్‌లపై బెట్టింగ్స్ పెట్టే బెట్టింగ్ భోగిగా మనం రియల్ లైఫ్‌లో చూసే ఎంతోమందిని గుర్తుచేశాడు సత్య. రాశీ సింగ్, సత్య మధ్య వచ్చే సీన్స్ అన్నీ ఫుల్ ఎంటర్ టైన్ మెంట్ అందించబోతున్నాయి. త్వరలోనే త్రీ రోజెస్ సీజన్ 2 వెబ్ సిరీస్ ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది.



# జాగిలాల హ్యాండ్లర్ల మొదటి మహిళగా..



సైన్యంలోనూ మహిళలు సత్తా చాటుతున్నారనడానికి నిదర్శనం అస్సాం రైఫిల్స్‌కు చెందిన పి.వి.శ్రీలక్ష్మి. సరిహద్దు వెంబడి చొరబాట్లను నిరోధించడం, విద్రోహ శక్తులను అంత మొందించడం అసాం రైఫిల్స్ ప్రధాన విధులు. ఈ పారామిలిటరీ దళంలో జాగిలాల హ్యాండ్లర్లుగా ఇప్పటిదాకా మగవాళ్లే ఉండగా, మొదటి మహిళగా శ్రీలక్ష్మి ఎంపికయ్యారు. శునకాల సైకాలజీ, క్షేత్రస్థాయిలో ఎత్తుగడల అడ్వాన్స్‌డ్ కోర్సులను పూర్తిచేసాకే ఈ బాధ్యతల్ని తీసుకున్నారీమె. మున్ముందు మరింత మంది శ్రీలక్ష్మి బాటలో నడవనున్నారని అధికారులు చెబుతున్నారు.

# అలసినప్పుడు 'న్యాపుచీనో'



మధ్యాహ్నం ఓ చిన్న కునుకు తీస్తే... రెట్టింపు ఉత్సాహంతో పనులు పూర్తిచేస్తాం. ఇంట్లో ఉంటే వాళ్లకైతే ఇది సాధ్యం. మరి ఉద్యోగాల్లో ఉన్నవారికి ఎలా? అలా అని ముంచుకొస్తున్న నిద్రను నియంత్రిస్తే... చేసే ధ్యాస లేక, ఒత్తిడి ఎక్కువై... పనిలో నాణ్యత తగ్గిపోతుంది. కొన్నిసార్లైతే అనుకున్న సమయానికి పూర్తిచేయలేం కూడా. అందుకే ఓ 'న్యాపుచీనో' వేస్తే మంచిదంటున్నారు నిపుణులు. అంటే కాఫీ, నిద్ర. నిద్రొచ్చేటప్పుడు కాఫీ తాగండి. తర్వాత 15-20 నిమిషాలు నిద్రపోండి. దీన్నే న్యాపుచీనో అంటారు. ఇది కూడా పవర్ న్యాప్ లాంటిదే. కాకపోతే కాఫీ అదనం. మన శరీరంలోని అడెనోసిన్ అలసటకు కారణం. నిద్ర దీని స్థాయుల్ని తగ్గిస్తుంది. మెదడుకు విశ్రాంతి దొరుకుతుంది. అయితే నిద్రకు ముందే కాఫీ తాగుతాం... కాబట్టి లేచాక ఉంటే కెఫిన్ పనిచేయడం మొదలవుతుంది. ఇది తాజాదనాన్నిచ్చి... పని మరింత చురుగ్గా చేసేందుకు తోడ్పడుతుందట. దాంతో మీరు అలర్ట్, ఫోకస్ మోడ్‌లోకి వెళ్లిపోవచ్చు. మధ్యాహ్నం వేళ, చదువుకుని అలసిపోయినప్పుడు, డ్రైవింగ్‌కి ముందు ఓ న్యాపుచీనో వేస్తే... మరింత ఉత్సాహంతో పని చేయొచ్చుట. నచ్చితే ప్రయత్నించండి.

## చెలి చిట్కా

- బెండకాయకూర కరకరలాడు తుండా లంటే ముందురోజు రాత్రి బెండ కాయలను తరిగి వుంచు కొని మర్నాడు కూర చేయండి.
- ఉడకబెట్టిన పొట్టు తీసిన ఆలుగడ్డలు నల్లబడ కుండా వుండాలంటే నల్లటి ఉప్పు నీటిలో ఉంచండి.

# అందాల రాణి.. మహిళా సాధికారత కోసం..

హైదరాబాద్‌లో జరిగుతున్న 72వ మిస్ వరల్డ్ ఫెస్టివల్లో ట్రినిడాడ్‌టొబాగోకు ప్రాధాన్యతనిస్తోంది అనాలైతే నాన్టన్. వృత్తిరీత్యా జియోటెక్నికల్ సివిల్ ఇంజినీర్ అయిన 26 ఏళ్ల ఈ బ్యూటీ... తన లక్ష్యం సామాజిక సమస్యలపై పోరాటమని, ముఖ్యంగా మహిళల్లో ఆరోగ్య చైతన్యం తీసుకురావాలనుకుంటున్నా అని చెబుతోంది. . అందాల పోటీలనగానే అందరూ శారీరక సౌందర్యం గురించి మాట్లాడతారు. కానీ, అంతకుమించి తెలివితేటలు, ఆత్మవిశ్వాసం, వాక్చాతుర్యం, అంతులేని దయ ఉండాలంటే మరచిపోతారు.



ఇది మమ్మల్ని మేము నిరూపించుకునే వేదిక మాత్రమే కాదు... వివిధ సామాజిక సమస్యల పోరాటంలో ఆలోచనలు పంచుకునేందుకు బలమైన నెట్‌వర్క్ కూడా. నా పరిధిని విస్తృతం చేసుకునేందుకు, వినూత్న ఆలోచనలను గుర్తించేందుకు ఇది చక్కగా ఉపయోగపడుతుంది. శాంటాక్రూజ్‌లోని పాక్స్‌వేల్ మా స్వస్థలం. మాది పెద్ద కుటుంబం. ఎనిమిది మంది పిల్లల్లో నేనే మొదటిదాన్ని. నాకంటే చిన్నవాళ్లయిన వారందరికీ నన్ను ఆదర్శంగా చూపించేవారు. అందుకే, చదువు, ఆటల్లోనే కాదు, సామాజిక సేవ, ఫిట్‌నెస్, కెరియర్... ఇలా అన్నింటిలోనూ మేటిగా నిలబడాలని భావించేదాన్ని. స్కూలింగ్ పూర్తిచేసుకున్నాక యూకేలో యూనివర్సిటీ ఆఫ్ బాత్ నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ అందుకున్నారు. ఎర్త్ ఇన్వెస్టిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్‌లో జియోటెక్నికల్ సివిల్ ఇంజినీరింగ్‌గా పనిచేస్తున్నది.

పురుషాధిక్యత కలిగిన స్టెమ్ రంగంలో, ముందుకు సాగడానికీ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా. వాటన్నింటినీ ఆత్మవిశ్వాసంతో అధిగమించా. మిస్ వరల్డ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రకటన అనుకోకుండా చూశా. ప్రతి దశలో ఉన్న పోటీలు, ఈ సంస్థ ఉద్దేశం తెలిశాక ప్రయత్నించకుండా ఉండలేకపోయా.

**మహిళలకు ఉచితం...**

స్వచ్ఛంద సేవతో సమాజానికి నావంతు తిరిగివ్వడాన్ని ఇష్టపడతా. అలా పెద్ద స్థాయిలో సేవ చేసే మార్గంగా ఈ ఆలోచనా. అందుకే, మనసులో ఎన్నో భయాలు ఉన్నా సరే... నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకొచ్చి ఈ పోటీల్లో పాల్గొన్నా.. ఆడిషన్‌కి వెళ్లినప్పుడు అక్కడ ఉన్నవారంతా హైహీల్స్. మేకప్ చాలా గ్లామర్ ఉన్నారు. నేను మాత్రం నేచురల్ హెయిర్, మేకప్‌తో హాజరయ్యా. అర్హత సాధిస్తానా అనుకున్నా కానీ, నా ప్రతిభతో ముందుకు దూసుకుపోయా. ఈ పోటీల్లో ఫిట్‌నెస్‌లో ఏరియల్స్ స్కిల్స్‌లో నా ప్రతిభ, 'సిస్టర్ స్ట్రాంగ్' పేరుతో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ ప్రాజెక్టులు ప్రభావం చూపించాయి. ఇందులో భాగంగా మహిళలకు ఉచితంగా ఫిట్‌నెస్, క్రీడల్లో శిక్షణ, స్థానిక ప్రాథమిక పాఠశాలల్లో రగ్బీ కోచింగ్ సెషన్‌లు నిర్వహించా. ఓ పక్క ఉద్యోగం చేస్తూ, వారాంతంలో ఫిట్‌నెస్ సెషన్‌లు నిర్వహిస్తూనే మోడలింగ్‌లోనూ నైపుణ్యాలు అలవర్చుకుని మరీ మిస్‌వరల్డ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో కిరీటం అందిపుచ్చుకున్నా. ఇక, భవిష్యత్తులోనూ మా దేశంలో మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపించేలా చైతన్యం తీసుకురావాలనుకుంటున్నా. బ్యూటీవిత్ ఎ పర్పస్‌లో భాగంగా 'ది రిప్పల్ ఫెక్ట్' పేరుతో ఆటల ద్వారా సస్టెయినబిలిటీనీ, మహిళా సాధికారతనీ ప్రోత్సహిస్తున్నాను. ఈ పోటీలకోసం తెలంగాణ సందర్శించడం ఓ అద్భుతమైన అనుభూతి. చార్మినార్, చౌమొహల్లా ప్యాలెస్ చూసి ఆశ్చర్యపోయా. ఇక్కడ చరిత్రాత్మక నిర్మాణాలు వాటి ఆర్కిటెక్చర్ నన్ను ఎంతో ఆకట్టుకున్నాయి.

# అడుగేయడమే ఆట

వేసవి సెలవుల్లో పిల్లలకు ఆడింది ఆట, పాడింది పాట. ఎండరా... బయటికి వెళ్లొద్దన్నా వినకుండా ఆటలంటూ పరుగెడతారు. ఇంట్లోనే ఉంచాలంటే ఈ ఆటను ప్రయత్నించండి. మూడు వరుసల్లో పాదాలు, చేతి గుర్తులు మార్చి మార్చి ఉంటాయి. వాటి ఆధారంగా పిల్లలు ముందుకు సాగాలి. ఒక పాదం ఉండాల్సిన చోట రెండు పాదాలు పెట్టినా... కుడిచేతి స్థానంలో ఎడమ చేతిని ఉంచినా... ఇలా ఎక్కడ తప్పుచేసినా ఆట ఆగిపోతుంది. మళ్లీ మొదటినుంచి రావాలి. ఒక్కరు లేదా ఎందరున్నా దీన్ని ఆడొచ్చు. పొరపాటు చేయకుండా ఎవరు ముగిస్తే వాళ్లే విజేత చాక్పీస్, కాగితాలతో సొంతంగా ప్రయత్నించొచ్చు. అంత ఓపిక లేదంటే ఆన్‌లైన్‌లో వెతికేయండి... హ్యాండ్ అండ్ ఫీట్ మ్యాట్లు, కటింగ్స్ రెడీగా దొరికే స్తున్నాయి. వాటినైనా తెప్పించుకోవచ్చు. టైంపాస్ గానే భావించకండి. ఇదో మంచి వ్యాయామం కూడా: బ్యాలెన్సింగ్, మోటార్ స్కిల్స్, కళ్లు శరీరం సమన్వయం, ఫోకస్ పెరగడం వంటి ఎన్నో ప్రయోజనాలూ ఉన్నాయి. ఈ సెలవుల్లో ప్రయత్నించి చూడండి.





# ఆమ్‌చూర్ పౌడర్



కూరలు, చిరుతిళ్లలో ఆమ్‌చూర్ పౌడర్ వాడుతాం. కొన్నిసార్లు చారులో కూడా చింతపండు లేదా నిమ్మ రసానికి బదులు దీన్నే వేస్తాం. సమోసా చాట్, శాండ్విచ్లోనూ ఇదుండాల్సిందే! ఆ రుచి అలాంటిది. ఇంత ముఖ్యమైన ఆమ్‌చూర్ పౌడర్ కొనకుండా ఇంట్లోనే చేసుకుంటే ఇంకెంత బాగుంటుంది కదూ?! ఇదేదో పెద్ద ప్రహసనం అనుకుంటున్నారా.. ఊహూ, చాలా తేలిగ్గా చేసేయొచ్చు. దీనికి పచ్చి మామిడికాయలు, కాస్తంత ఉప్పు ఉంటే చాలు. కాయలు మాత్రం చాలా పుల్లగా ఉండేవాటిని ఎంచుకోవాలి. నాలుగు కాయలకు అర చెంచా ఉప్పు పడుతుంది. మామిడికాయలను కడిగి, చెక్కు తీసి.. ఒక అర గంటసేపు నీళ్లలో ఉంచాలి. లేకుంటే రంగు మారి, నల్లగా అవుతాయి. బయటకు తీసి, తుడిచి.. చిప్స్ కటర్‌తో స్లైసులుగా కోయాలి. అవి సన్నగా ఉండాలి. లేదంటే సరిగ్గా ఎండవు. అన్నీ అయ్యాక శుభ్రమైన వస్త్రం మీద పరచి... పగలు ఎండలో, రాత్రి లోనికి తెచ్చి ఫ్యాన్ కింద ఎండబెట్టాలి. ఇలా మూడు రోజులు చేయాలి. వీటికి ఉప్పు జతచేసి, గ్రైండ్ చేయాలి. చాలా మెత్తగా ఉండాలి కనుక.. జల్లెడపట్టి, మళ్లీ గ్రైండ్ చేయాలి. ఈ ఆమూర్ పౌడర్ తడి లేని, గాలి చొరబడని సీసాలో భద్రంచేస్తే.. ఆరు నెలలు నిల్వ ఉంటుంది.

# ఆఫీసులో మాట్లాడాలా వద్దా?

**ఒకరితో మరొకరు మాట్లాడటం, అభిప్రాయాలు పంచుకోవడం.. లాంటి సోషల్ ఇంటరాక్షన్ ఆఫీసులోనే కాదు,** రోజువారీ ప్రక్రియలోనూ అవసరమే. అయితే దానికీ కొన్ని పరిమితులు ఉంటాయి. కొత్తగా కాలేజీ నుంచి ఆఫీసులోకి అడుగుపెట్టారు. కాబట్టి, అక్కడి సీరియస్ వాతావరణం మీకు ఇంకా అలవాటు కాలేదేమో!



సాధారణంగా సంస్థలు తమ ఉద్యోగుల ఉత్పాదకత పెంచాలి అనుకుంటాయి. ఇక సీనియర్లు కొత్తతరం త్వరగా నేర్చుకుని పని అందుకోవాలని కోరుకుంటారు. ఇది ఎక్కడైనా సహజమే! పరిచయం పెంచుకోవాలన్న తాపత్రయంలో మరీ ఎక్కువ సమయం గడిపేస్తున్నారేమో గమనించుకోండి. అలాంటప్పుడు మీపై సమయం వృథా చేస్తోందన్న దురభిప్రాయం కలగడం మామూలే. రోజంతా సీట్లోనే ఉండమని ఎవరూ అనరు. అలాగని అస్తమానూ మాటలతో గడిపేస్తాను అన్నా ఊరుకోరు. కాబట్టి, అమ్మాయైనా అబ్బాయైనా ఎంతసేపు మాట్లాడుతున్నామన్న దానిపై పరిమితి పెట్టుకోవడం మేలు. ఇంకా కొత్త కాబట్టి, మీ ఉద్యోగ నైపుణ్యాలను పెంచుకోండి. పని వివరాలు తెలుసు కోవడం సందేహాలను నివృత్తి చేసు కోవడంపై ఎక్కువ దృష్టి పెట్టండి. ఎందుకంటే ఇప్పుడు మీరు ఉద్యోగి. ఆ ఉద్యోగ బాధ్యతలు, వాటిని నిర్వర్తించడవంలో మీ పాత్రను అర్థం చేసుకుంటూ సాగండి. అప్పుడు ఏ సమస్యా ఉండదు. కొద్ది సమయమే మాట్లాడుతున్నా అంటారా.. అయితే పని ప్రాంతంలో జోకులు, సొంత విషయాలను పక్కన పెట్టేస్తే సరి. ఇంతరులకూ ఇబ్బంది ఉండదు.

# స్టీలు పాత్రలు మెరవాలంటే..

స్టీలు గిన్నెలు శుభ్రంగా ఉన్నప్పుడు తళతళ లాడుతూ ఎంత మంచి రూపాన్ని ఇస్తాయో, వాటి మీద గీతలు పడినా లేదా వాటిని సరిగ్గా శుభ్రం చేయకపోయినా పాత వాటిలా కనిపిస్తాయి. ముఖ్యంగా మనం రోజువారీ ఉపయోగించే స్టీలు గిన్నెలను శుభ్రం చేసే విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ వాటిని శుభ్రం చేయడమే కాకుండా కొత్తవాటిలా మెరిపించేం దుకు ఉపకరించే కొన్ని చిట్కాలు మీకోసం.. గోరువెచ్చని



**సోప్వాటర్‌తో..** రోజువారీ ఉపయోగించే వస్తువులను శుభ్రం చేయడానికి కూడా ఓ పద్ధతి ఉంది. దీని ప్రకారం ముందుగా చల్లని నీళ్లతో ఆ పాత్రపై ఎలాంటి పదార్థాలు లేకుండా పైపైన కడిగేయాలి. తర్వాత మెత్తని స్పాంజ్‌తో గోరువెచ్చని నీళ్లలో కలిపిన సోప్ మిశ్రమాన్ని ఉపయోగించి శుభ్రం చేసుకోవాలి. ఒకవేళ స్టీల్‌పాత్రపై తొలగించేందుకు పదార్థాలు గట్టిగా అంటిపెట్టుకొని ఉంటే వాటిని స్టీల్ లేదా ఐరన్ స్క్రాబ్‌ను ఉపయోగించకూడదు. దీని కోసం నైలాన్ స్క్రాబ్ మాత్రమే ఉపయో గించాలి. ఫలితంగా పాత్రలపై ఎలాంటి గీతాలు పడకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే స్టీల్ గిన్నెలను శుభ్రం చేసిన తర్వాత వాటిని మెత్తని వస్త్రంతో తుడుచుకొని కాసేపు ఆరబెట్టాలి.


**టొమాటో కెచప్‌తో..** కొన్ని పాత్రలకు అడుగు భాగంలో రాగి పూత ఉంటుంది. ఇలాంటి పాత్రలకు ఒక్కటే కొత్తగా ఉంటే సరిపోదు.. రాగి కోటింగ్ కూడా కొత్తదానిలా మెరవాలి. వంటింట్లో అందుబాటులో ఉండే టొమాటో కెచప్ ఉపయోగిస్తే సరి. రాగి కోటింగ్ ఉన్న ప్రాంతంలో కెచప్‌ని అప్లై చేసి పది నిమిషాలు అలానే వదిలేయాలి. ఆ తర్వాత స్క్రాబ్‌తో వాటిని శుభ్రం చేస్తే కొత్తవాటిలా మెరుస్తాయి.

**మాడిపోయినప్పుడు..** సాధారణంగా స్టీల్ పాత్రలు మాడిపోయినప్పుడు బ్రౌన్ కలర్‌లో మరకలు పడడమే కాకుండా అవి పాత్రకు చాలా గట్టిగా అతుక్కుని ఉంటాయి. ఇలాంటి వాటిని తొలగించాలంటే ముందుగా ఆ పాత్రలో నీళ్ల పోసి కాసేపు నానబెట్టాలి. ఆ తర్వాత రెండు చెంచాల బేకింగ్ సోడా వేయాలి. ఇలా చేయడం వల్ల పాత్రకు అంటుకున్న పదార్థాల అవశేషాలు సులభంగా తొలగిపోతాయి. తర్వాత నైలాన్ స్క్రాబ్లో మాడిపోయిన మరకలన్నీ పూర్తిగా వదిలిపోతాయి.

**వెనిగర్‌తో...** పాత్రల్లో పాలు నీళ్ల ఎక్కువగా మరిగించినప్పుడు లేదా పాలు ఎక్కువగా చేరడం వల్ల అడుగుభాగం అట్టకట్టినట్లుగా తయారవుతుంది. ఇలాంటప్పుడు మూడువంతుల నీళ్లలో 1/3 వంతు వెనిగర్ కలిపి ఆ మిశ్రమాన్ని పాత్రలో పోయాలి. తర్వాత కాసేపు కదపకుండా పక్కన పెట్టాలి. కొద్దిసేపటి తర్వాత వేడినీళ్లతో ఆ పాత్రని శుభ్రం చేయడం ద్వారా అడుగుభాగంలో చేరిన ఖనిజాలను పూర్తిగా తొలగించవచ్చు.

# మొహాన్ని మెరిపిస్తాయి !

చర్మం ప్రకాశవంతంగా మారడానికి.. ముఖవర్చస్సు మరింతగా ఇనుమడించడానికి ఫేషియల్స్ వేసుకోవడం సహజం అయితే వాటితో పాటు అప్పుడప్పుడూ ఫేస్ పీల్స్ కూడా వేసుకుంటూ ఉండాలి. అయితే ఫేస్ పీల్స్ అనగానే.. పార్లర్‌కే వెళ్లక్కర్లేదు. ఇంట్లో లభ్యమయ్యే పదార్థాలను ఉపయోగించే అద్భుతమైన ఫేస్ పీల్స్ తయారుచేసుకుని, ముఖానికి వేసుకోవచ్చు. మరి, ఆ పదార్థాలేంటి తెలుసుకుందాం..



**కీరాదోస..** అరకప్పు కీరాదోస గుజ్జు తీసుకుని అందులో కోడిగుడ్డులోని తెల్లసొన, చెంచా నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా వేసుకుని 20 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇందులో ఉన్న కీరాదోస.. పిగ్మెంటేషన్ సమస్యను తగ్గించడంతో పాటు ముడతలు, సన్నని గీతలు వంటివి కూడా తగ్గుముఖం పట్టేలా చేస్తుంది.

**ఫైనాపిల్ /బొప్పాయి..** అరకప్పు ఫైనాపిల్ ముక్కలు, పావు కప్పు బొప్పాయి ముక్కలు తీసుకుని మెత్తని పేస్టులా చేసుకోవాలి. తర్వాత అందులో అరచెంచా ఆర్గానిక్ తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్‌లా వేసుకుని 20 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో ఓసారి, చల్లని నీటితో మరోసారి ముఖాన్ని శుభ్రం చేసుకుని పొడి వస్త్రంతో తుడుచుకోవాలి.



**ఓట్స్‌తో..** బాగా గిలక్కొట్టిన కోడిగుడ్డులోని తెల్లసొనలో మెత్తగా చేసుకున్న అరచెంచా అవకాడో, రెండు చెంచాల తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమానినన ముఖానికి ప్యాక్‌లా అప్లై చేయాలి. 20 నిమిషాలు ఆరనిచ్చి తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ వేసుకోవడం వల్ల చర్మంపై ఉండే బ్లాక్‌హెడ్స్ సులభంగా తొలగిపోతాయి.

**అవకాడోతో..** బాగా గిలక్కొట్టిన కోడిగుడ్డులోని తెల్లసొనలో మెత్తగా చేసుకున్న అరచెంచా అవకాడో, రెండు చెంచాల తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా అప్లై చేయాలి. 20 నిమిసాలు ఆరనిచ్చి తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ చర్మంలోని తేమని అధిక సమయ నిలిపి ఉంచడానికి బాగా తోడ్పడుతుంది. ఫేస్ పీల్స్ వేసుకున్న తర్వాత ఎండలోకి వెళ్లే ముందు సన్‌స్క్రీన్ లోషన్ విధిగా రాసుకోవాలి. లేదంటే ట్యాన్ సమస్య బారిన పడే అవకాశాలు ఎక్కువ.

# పిలిస్తే పలికే జగన్నాథుడు



పాండవులను అవమానించాలనుకున్న దుర్యోధనుడు వారి వద్దకు దుర్వాసమునిని పంపాడు. శిష్యులతో సహా వెళ్లిని ముని తాము ఆకలితో వచ్చామని చెప్పాడు. అది విన్న ధర్మజుడు మీరాకతో మా పర్ణశాల పావనమైంది. స్నానంచేసి రండి, భోజనం సిద్ధం చేస్తా అన్నాడు. ఇందరికి ఎలా వడ్డిస్తాడో చూద్దాం అనుకున్నాడు దుర్వాసముని. అక్షయపాత్ర నుంచి రోజుకొక్కసారే ఆహారం లభిస్తుంది. ఇప్పుడేం చెయ్యాలి? అనుకుంది ద్రౌపది. భక్తితో కృష్ణుణ్ణి స్మరించి నిండుసభలో నన్ను దుశ్శాసనుడు అవమానించగా ఆదుకున్నావు! ఇప్పుడు మహర్షి గుణానికి అతిథ్యమివ్వడంలో భంగం కలగనివ్వకు కృష్ణ అంటూ వేడుకుంది. శ్రీకృష్ణుడు క్షణాల్లో ప్రత్యక్షమై, బాగా ఆకలిగా ఉంది. తినడానికి ఏమైనా ఇవ్వమ్మా అన్నాడు. నువ్వు కూడా నన్ను పరీక్షిస్తున్నావా? అంటూ బిక్కమొహం పెట్టి సమస్యను వివరించింది ద్రౌపది. కృష్ణుడు నవ్వి అక్షయపాత్రను తెమ్మని చెప్పాడు. అక్షయపాత్ర అడుగున అతుక్కుని ఉన్న మెతుకును చూపి దీనిని పెట్టామన్నాడు. ద్రౌపతి అలానే చేసింది. అది తిని, దుర్వాసుడు ఆశీర్వదించి వెళ్లాడు, దిగులుపడకు అన్నాడు. ముని బృందానికి అక్షయపాత్రలోంచి వడ్డించగా అందరూ తృప్తిగా తిన్నారు. కృష్ణుడి మహత్తుకు ద్రౌపదితో బాటు పాండవులంతా సంతోషించారు. భక్తుల పట్ల భగవంతుడికి ఎంత కరుణో చూడండి. పిలిచిన క్షణమే వచ్చి ఆదుకున్నాడు అన్నాడు దుర్వాసుడు తన శిష్యులతో.

ఆధ్యాత్మికం

# చక్కటి ప్రణాళిక అవసరం



పట్టు చిక్కాలంటే ప్రణాళిక అవసరం ఈ తరం మహిళలు ఇంటి నిర్వహణే కాదు ఆఫీసు బాధ్యతల్నీ ఆత్మవిశ్వాసంతో అందిపుచ్చుకుంటున్నారు. అయితే, ఇక్కడ రాణించాలంటే కొంత నేర్పరితనం, మరికొన్ని మెలకువలనూ అలవరుచుకోవాలి. అవేంటంటే..

- పనులు సమర్థంగా పూర్తి చేయాలంటే దాని మీద కచ్చితమైన అవగాహన ఉండాలి. అప్పుడే వాటిల్లో దేనికి ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వాలో అర్థమవుతుంది. చక్కటి ప్రణాళిక తెలుసుకోగలుగుతారు. పని ఒత్తిడిని తగ్గించుకోగలరు.
- . పని ప్రదేశంలో సానుకూల వాతావరణం లేకపోతే అది ఉత్పాదకత మీద ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. అందరినీ కలుపుకొని పోవడం, ఉద్యోగుల సమస్యలపైనా దృష్టిపెట్టడం, వెనకబడిన వారికి చేయూతనివ్వడం వంటివన్నీ మీకు బలాన్ని చేకూరుస్తాయి. ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లో అయినా మీతో కలిసి పనిచేయడానికి వారూ ఆసక్తి చూపుతారు. ఆ బృంద స్ఫూర్తి కెరియర్‌లో ముందుకు వెళ్లేందుకు సాయం చేస్తుంది.
- అందరికీ అన్నీ తెలిసి ఉండాలనేం లేదు. కానీ, ఎప్పటికప్పుడు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మీ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా మరింత వేగంగా, సమర్థంగా పనిచేయొచ్చు. అనుభవజ్ఞుల సలహాలు, సూచనలను పాటించడం ద్వారా పనిని మెరుగుపరుచుకోవచ్చు.

ఆట




# టి20 సిరీస్ ఇంగ్లండ్ కైవసం

## 3-0 తేడాతో వెస్టిండీస్ క్లీన్ స్వీప్

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్ మహిళా జట్టు కెప్టెన్ నాట్ స్కైవర్ బ్రంట్ నేతృత్వంలో కొత్త శకాన్ని ప్రారంభించింది, ఆతిథ్య ఇంగ్లాండ్ జట్టు వెస్టిండీస్‌ను టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో 3-0 తేడాతో ఓడించింది. చెల్మ్స్ ఫోర్డ్‌లోని కౌంటీ గ్రౌండ్‌లో జరిగిన మూడో మ్యాచ్‌లో 17 పరుగుల తేడాతో ఆతిథ్య ఇంగ్లాండ్ మహిళాజట్టు విజయం సాధించింది. దీంతో టీ 20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. 145 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, ఇంగ్లాండ్ హోవ్‌లో జరిగిన సిరీస్‌లో 2-0 ఆధిక్యంలోకి వెళ్లడంతో వెస్టిండీస్ ఓదార్పుకరమైన విజయాన్ని సాధించే దిశగా సాగింది. అయితే, ఎడమచేతి వాటం స్పిన్నర్ లిన్సే స్మిత్ 17వ ఓవర్‌లో షబికా గజ్నబి మరియు జహ్జారా క్లాక్సన్‌లను వరుస బంతుల్లో అవుట్ చేయడం ద్వారా పతనానికి కారణమయింది, వెస్టిండీస్ 3 వికెట్లకు 109 పరుగులు చేయగా, నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 127 పరుగులు చేయగలిగింది. వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ 54 బంతుల్లో 71 పరుగులు చేయడం మాత్రమే ఆ జట్టు బ్యాట్స్‌మెన్ నుండి వచ్చిన ఏకైక సహకారం. అయితే విజయానికి ఇంకా 32 పరుగులు అవసరమైన 18వ ఓవర్‌లో ఆమె అవుట్ కావడంతో వెస్టిండీస్ ఓటమి చెందాల్సి వచ్చింది. మిగిలిన రియాలియానా గ్రిమ్మండ్ (15), కియానా జోసెఫ్ (0), సైదా జేమ్స్ (7), షబికా గజ్నబి (14), జహ్లారా కాక్సన్ (0), అలియా అల్లీన్ (9), జానిల్లియా గ్లాస్కో (1), అఫీ ఫ్లెచర్ (6), మాండీమంగ్రూ (1) విఫలమయ్యారు. అంతకుముందు, బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ హీథర్ నైట్ అజేయంగా 66 పరుగులు మరియు స్కైవర్ బ్రంట్ 40 బంతుల్లో 37 పరుగులు చేయడంతో స్కోరు బోర్డు వేగంగా కదలింది. మిగిలిన ఇంగ్లండ్ బ్యాటర్లు డానివ్యాట్‌హాడ్జ్ (0), సోఫియా డంక్లీ (3), అమీజోన్స్ (22), అలిస్‌కాప్సే (4), ఎమిలీ అర్లోట్ (2) పరిమితమయ్యారు. అయితే 5ఓవర్లలో 2వికెట్లకు 21 పరుగులకు తగ్గించబడిన తర్వాత ఐదు వికెట్లకు 144 పరుగులు చేసి వెస్టిండీస్ లక్ష్యాన్ని సునాయాసంగా అధిగమించింది.





## నార్వే చెస్ ఓపెనర్‌లో..

# గుకేష్‌పై కార్ల్‌సెన్ విజయం

**న్యూఢిల్లీ:** నార్వే చెస్ ఓపెనర్‌లో ప్రపంచ ఛాంపియన్, భారత్ గ్రాండ్ మాస్టర్ గుకేష్‌పై వరల్డ్ నెంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సెన్ విజయం సాధించాడు. తన ఎండ్‌గేమ్ నైపుణ్యాన్ని ప్రదర్శించి, టోర్నమెంట్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న మ్యాచ్‌లో కార్ల్‌సెన్ మూడు కీలకమైన పాయింట్లను సాధించాడు. నార్వేలో మంగళవారం నాలుగు గంటలకు పైగా జరిగిన ఉత్కంఠ భరితమైన మ్యాచ్‌లో, గుకేష్ నార్వేజియన్ ఛాంపియన్‌ను ఒత్తిడిలో ఉంచాడు. కానీ ఒక కీలకమైన తప్పిదం అతని 55 ఎత్తుగడలలో ఓటమికి దారితీసింది. కార్ల్‌సెన్ విజయం అతన్ని అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ మరియు ప్రపంచ నంబర్ 2 హికారు నకమురాతో సంయుక్తంగా ఆధిక్యంలో ఉంచింది, అతను గ్రాండ్‌మాస్టర్ ఫాబియానో కరువానాను ఓడించాడు. ముఖ్యంగా, రెండవ భారతీయ ఆటగాడు ఎరిగైసి అర్జున్ చైనా నంబర్ 1 వీ యిపై ఆర్మగెడాన్ గేమ్‌లో రాణించాడు. ఈ టోర్నమెంట్ ఒక ప్రత్యేకమైన స్కోరింగ్ విధానాన్ని అనుసరిస్తుంది, ఇది క్లాసికల్ విజయానికి మూడు పాయింట్లు ఇస్తుంది. డ్రా అయితే, అదనపు పాయింట్ల కోసం తదుపరి ఆర్మగెడాన్ మ్యాచ్ ఆడతారు. ఈ సంవత్సరం లైనప్‌లో పురుషులు మరియు మహిళల విభాగాలలో అగ్రశ్రేణి ప్రతిభ ఉంది, చెస్‌లో లింగ సమానత్వాన్ని నొక్కి చెబుతుంది.

# ఫ్రెంచ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో స్వైటెక్, అల్కరాస్ శుభారంభం

**న్యూఢిల్లీ:** ఫ్రెంచ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ 2025లో డిఫెండింగ్ ఛాంపియన్స్ ఇగా స్వైటెక్, కార్లోస్ అల్కరాస్ శుభారంభం చేశారు. వరుసగా నాలుగో టైటిల్‌పై కన్నేసిన స్వైటెక్ అద్భుతమైన ప్రదర్శన కనబర్చింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో పోలెండ్ స్టార్ స్వైటెక్ 63, 63తో రెబెకా స్రాంకోవా (స్లోవేకియా)ను ఓడించింది. గంటా 24 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో స్వైటెక్ 25 విన్నర్స్ కొట్టడంతో పాటు 17 అనవసర తప్పిదాలు చేసింది. ఒక ఏస్ మాత్రమే కొట్టిన స్వైటెక్‌కు ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైంది. రెండో సెట్‌లో ప్రత్యర్థి రెబెకా 31 ఆధిక్యంలోకి వెళ్ళింది. అయితే స్వైటెక్ వెంటనే పుంజుకొని వరుసగా





10 పాయింట్లు, ఆ తర్వాత ఐదు గేమ్‌లు గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఫ్రెంచ్ ఓపెన్‌లో స్వైటెక్‌కు వరుసగా ఇది 22వ విజయం. తదుపరి రౌండ్ లో స్వైటెక్ 2021 యూఎస్ ఓపెన్ ఛాంపియన్ ఎమ్మా రాడుకానుతో తలపడుతుంది. ఇతర మహిళల సింగిల్స్ ఫలితాల్లో పౌలా బడోసా (స్పెయిన్) 6-7 (1/7), 6-1, 6-4 తేడాతో నవోమి ఒసాకా (జపాన్)ను ఓడించింది. ఎమ్మా రడుకాను (గ్రేట్ బ్రిటన్) 7-5, 4-6, 6-3 తేడాతో వాంగ్ జిన్యు (చైనా)పై, జెస్సికా బౌజాస్ మనీరో (స్పెయిన్) 6-0, 6-1 ఎమ్మా నావారో (అమెరికా)పై, బెర్నార్డా పెరా (అమెరికా) 6-4, 6-4 తేడాతో కరోలిన్ గార్సియాపై, కేటీ బౌల్టర్ (గ్రేట్ బ్రిటన్) 6-7 (47), 6-1, 6-1 తేడాతో కరోల్ మోనెట్ (ఫ్రాన్స్)పై విజయం సాధించారు. కాగా పురుషుల సింగిల్స్‌లో స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాస్ 6-3, 6-4, 6-2తో ఇటలీ ప్లేయర్ జెపెరిపై విజయం సాధించాడు. 1 గంట 56 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్కరాస్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. అల్కరాస్ ఈ మ్యాచ్‌లో 31 విన్నర్స్, 3 ఏస్‌లు కొట్టి, 23 అనవసర లోపాలు మాత్రమే చేశాడు.




## ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో..

# గుల్వీర్‌కు స్వర్ణం

**న్యూఢిల్లీ:** 26వ ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025లో గుల్వీర్ సింగ్ భారతదేశానికి తొలి బంగారు పతకాన్ని, సెర్విన్ సెబాస్టియన్ కాంస్య పతకం సాధించాడు. రిపబ్లిక్ ఆఫ్ కొరియాలోని గుమిలో మంగళవారం ప్రారంభమైన పురుషుల 10,000 మీటర్ల ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. హరి చంద్ (1975) మరియు జి. లక్ష్మణన్ (2017) తర్వాత తాజాగా గుల్వీర్ సింగ్ నేతృత్వంలో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో పురుషుల 10,000 మీటర్ల పరుగులో భారతదేశం సాధించిన మూడవ స్వర్ణం ఇది కావడం విశేషం. జాతీయ రికార్డు హోల్డర్ (27:00.22) స్థిరంగా ప్రారంభించిన గుల్వీర్ రేసులో ఎక్కువ భాగం ఐదుగురు వ్యక్తులపై ఆధిక్యాన్ని కొనసాగాడు. చివరి ల్యాప్‌లో అతను బహ్రెయిన్‌కు చెందిన ఆల్బర్ట్ కిబిచి రాప్‌ను అధిగమించి ముందుకు దూసుకెళ్లాడు. కిబిచి రాప్‌పై 28:38.63 సమయంలో గమ్యాన్ని చేరుకుని ఆధిక్యంతో ముగించాడు. అగ్రస్థానంలో ఉన్న భారతదేశానికి చెందిన సావన్ బర్వాల్ 28:50.53 సమయంతో నాల్గవ స్థానంలో నిలిచాడు. ఇది గుల్వీర్ సింగ్‌కు రెండవ ఆసియా ఛాంపియన్‌షిప్ పతకం కావడం గమనార్హం. అంతకు ముందు 2023 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో అతనికి 5000 మీటర్లకు సంబంధించిన పోటీలో కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ ఛాంపియన్‌షిప్‌లో సెర్విన్ సెబాస్టియన్ కాంస్య పతకం సాధించాడు. పురుషుల 20 కిలోమీటర్ల రేస్ వాక్ ఈవెంట్‌లో సెబాస్టియన్ ఈ పతకాన్ని దక్కించుకున్నాడు. చైనా మరియు జపాన్‌కు చెందిన అగ్రశ్రేణి అథ్లెట్లతో పోటీ పడిన సెబాస్టియన్ వ్యక్తిగత అత్యుత్తమ సమయాన్ని నమోదు చేశాడు. ఈ అనుభవజ్ఞుడైన అథ్లెట్ 1:21:13.60 సమయంలో రేసును పూర్తి చేసి, చైనాకు చెందిన వాంగ్ జావోజావో మరియు జపాన్‌కు చెందిన కెంటో యోషికావా కంటే వెనుకబడి ఉన్నాడు. ఈ ఘనత సెబాస్టియన్ వ్యక్తిగత బెస్ట్ 1:21:23 కి దగ్గరగా ఉంది, ఫిబ్రవరిలో ఉత్తరాఖండ్ జాతీయ క్రీడలలో అతను స్వర్ణం సాధించినప్పుడు అతను ఈ రికార్డును నెలకొల్పాడు. ఇక తోటి భారత అథ్లెట్ అమిత్ 1:22:14.30 సమయంలో రేసును ముగించి గౌరవప్రదమైన ఐదవ స్థానాన్ని పొందాడు.

# భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మే 27:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో మన సూచీలు తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొన్నాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1300 పాయింట్ల మేర లాభనష్టాల మధ్య చలించింది. ముఖ్యంగా ఆటో, ఐటీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీంతో సూచీల రెండు రోజుల వరుస




లాభాలకు బ్రేక్ పడింది. నిఫ్టీ మళ్లీ 24,850 స్థాయికి చేరింది. సెన్సెక్స్ ఉదయం 82,038.20 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమై కాసేపటికే భారీ నష్టాల్లోకి జారుకుంది. కొద్దిసేపటికి లాభాల్లోకి వచ్చిన సూచీ 82,410.52 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మదుపర్లు ఆనందపడే లోపే మళ్లీ నష్టాల్లోకి వెళ్లిన సూచీ.. ఇంట్రాడేలో 81,121 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 624 పాయింట్ల నష్టంతో 81,551.63 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 174.95 పాయింట్ల నష్టంతో 24,826.20 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 27 పైసలు క్షీణించి 85.37గా ఉంది. ఇండస్ ఇండ్ బ్యాంక్, సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్ షేర్లు మాత్రమే లాభపడ్డాయి. అల్ట్రాటెక్ సిమెంట్, ఐటీసీ, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.87 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3294 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# 3వేల ఉద్యోగులకు వోల్వో ఉద్వాసన

**ముంబై, మే 27:** స్వీడన్‌కు చెందిన వోల్వో కార్స్ ఖర్చు ఆదా ప్రణాళికలో భాగంగా సుమారు 3వేల ఆఫీస్ ఉద్యోగాలను తొలగించాలని నిర్ణయించింది. కంపెనీ పెరుగుతున్న ఖర్చులు, ఎలక్ట్రిక్ వాహనాల బలహీనమైన డిమాండ్, వాణిజ్య అనిశ్చితిని ఎదుర్కొంటున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో సంస్థ లేఆఫ్స్‌కు సంబంధించిన నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. కంపెనీ మాజీ సిఇఒ హాకన్ శామ్యూల్సన్ తిరిగి వోల్వోకు నాయకత్వ బాధ్యతలు చేపట్టిన కొన్ని వారాల్లోనే ఈ మేరకు నిర్ణం తీసుకోవడం విశేషం. కంపెనీ చేసే దాదాపు 18 బిలియన్ స్వీడిష్



క్రౌన్లు అంటే దాదాపు 1.9 బిలియన్ డాలర్లు తగ్గించే ప్రణాళికలను సిఇఒ ఏప్రిల్‌లో ప్రకటించారు. అందుకు అనుగుణంగానే ప్రస్తుతం లేఆఫ్స్ నిర్ణయం తీసుకున్నట్లు కూడా తెలిపింది. కంపెనీ మొత్తం సిబ్బందిలో 40శాతం వాటా కలిగిన వైట్ కాలర్ ఉద్యోగులకు లేఆఫ్స్ ఇవ్వడం ద్వారా ఖర్చు తగ్గించుకోవాలని కంపెనీ యోచిస్తున్నట్లు పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థకు యూరప్‌లో 29వేల మంది, ఆసియాలో 10వేల మంది, అమెరికాలో 3వేల మంది ఉద్యోగులు ఉన్నారు. తాజాగా ప్రకటించిన లేఆఫ్స్ రీసెర్చ్ హ్యూమన్ రిసోర్సెస్, కమ్యూనికేషన్ వంటి వివిధ విభాగాల్లో ఉంటాయని శామ్యూల్సన్ తెలిపారు. వోల్వో కార్ కొత్త ఫైనాన్స్ చీఫ్ ఫ్రెడ్రిక్ హాన్సన్ మాట్లాడుతూ, ఈ లేఆఫ్స్ వల్ల వ్యాపారం తాత్కాలికంగా ప్రభావితం చెందినా భవిష్యత్తులో మెరుగ్గా ఉంటుందని చెప్పారు. ఉద్యోగ తొలగింపులు ఎక్కువగా స్వీడన్‌లోని గోథెన్ బర్గ్‌లో ఉంటాయని చెప్పారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.